

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

టెన్త్ పరీక్షల్లో 5 నిమిషాల గ్రేస్ టైం 14
ఈ నెల 18 నుంచి పరీక్షలు ప్రారంభం
ఉదయం 9.30 నుంచి 12.30 వరకు
నేటి నుంచి ఒంటిపూట బడులు
ముగిసిన ఇంటర్మీడియట్ పరీక్షలు

శుక్రవారం | 15-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 330 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 10.11 తదుపరి సప్తమి; నక్షత్రం: కృత్తిక సా. 4.09 తదుపరి రోహిణి; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.8.50-9.38, మ.12.48-1.36; అమృతఘడియలు: మ.1.49-3.22; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.27; సూర్యాస్తమయం: 6.22 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విషయం దాచి..

సమాచారం ఇచ్చినా.. అసలు సంగతి వెల్లడించని ఎస్‌బీఐ

ఐదేళ్లలో రూ. 16,518 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు
అత్యధికంగా బీజేపీకి రూ. 6560 కోట్లు
మొత్తం బాండ్లలో సగం ఆ పార్టీకే
తర్వాత స్థానాల్లో తృణమూల్, కాంగ్రెస్, బీఆర్ఎస్
ఏడు, ఎనిమిది స్థానాల్లో వైసీపీ, టీడీపీ
ఎస్‌బీఐ ఇచ్చిన డేటాను వెబ్‌సైట్లో పెట్టిన ఈసీ
ఏ కంపెనీ ఏ పార్టీకి ఎంత ఇచ్చిందో వివరాల్లేవు

పార్టీలు, కంపెనీల మధ్య 'బాండ్' ప్రుడెంట్ ట్రస్టు
కంపెనీలిచ్చే నిధుల్ని పార్టీలకు మళ్లించటమే పని
11 ఏళ్లలో పార్టీలకు రూ. 2,256 కోట్ల విరాళాలు
వీటిలో 75% బీజేపీకే.. వెల్లడించిన రాయిటర్స్
ప్రశ్నలకు స్పందించని ప్రుడెంట్ ట్రస్టు

న్యూఢిల్లీ, మార్చి 14: అనుకున్నంతా అయ్యింది. సుప్రీంకోర్టు గద్దింపుల మీద దిగి వచ్చిన ఎస్‌బీఐ ఎలక్టోరల్ బాండ్ల వివరాలను మాత్రం తాను అనుకున్నట్లుగానే బయటపెట్టింది. ఏ కంపెనీ ఏ రాజకీయ పార్టీకి నిధులిచ్చిందనే వివరాలు కనుక్కొనే అవకాశం లేని విధంగా సమాచారాన్ని విడుదల చేసింది. ఎస్‌బీఐ మంగళవారం సమర్పించిన రెండు జాబితాలను ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా గురువారం తన వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేసింది. అందులో ఒక జాబితాలో ఏఏ కంపెనీలు ఎంతెంత విలువైన ఎలక్టోరల్ బాండ్స్ కొన్నాయో వివరాలు ఉన్నాయి. మరో జాబితాలో ఏఏ పార్టీలకు ఎంతెంత విలువైన ఎలక్టోరల్ బాండ్స్ అందాయో వివరాలు ఉన్నాయి. రెండు జాబితాల్లో ఎక్కడా బాండ్ల సీరియల్ నంబర్లను ప్రస్తావించక పోవడం గమనార్హం. ప్రస్తుతం ఇచ్చిన జాబితాల్లో ఏ కంపెనీ ఎస్‌బీఐ నుంచి కొన్న బాండ్లు ఏ పార్టీకి అందాయో తెలుసుకొనే అవకాశమే లేదు. ఎస్‌బీఐ అందించిన జాబితా సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికే విరుద్ధంగా ఉందని న్యాయకోవిదుడు ప్రశాంత్ భూషణ్ విమర్శించారు. ఏ కంపెనీ నుంచి ఏ రాజకీయ పార్టీ లబ్ధి పొందిందో

మిగతా 2వ పేజీలో...



2029లో జమిలి!

మూడంచెల ఎన్నికలు 2 దశల్లో జరపాలి
తొలుత లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు
తర్వాత వంద రోజుల్లో స్థానిక సంస్థలకు
'ఒక దేశం.. ఒకే ఎన్నిక'కు పచ్చజెండా!
రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫారసు
రాష్ట్రపతి ముర్ముకు 18 వేల పేజీల నివేదిక
హంగ్ ఏర్పడినా.. అవిశ్వాసం నెగ్గినా..
లోక్‌సభకు మళ్లీ ఎన్నికలు
సర్కారు పదవీకాలం ఆ టర్మ్ ముగిసేదాకే
అసెంబ్లీలు మధ్యలో రద్దయి, ఎన్నికలు వస్తే
వాటి గడువు లోక్‌సభ టర్మ్ పూర్తయ్యేదాకే
ఇందుకోసం రాజ్యాంగాన్ని సవరించాలి
దేశమంతా ఒకే ఓటర్ల జాబితా, ఐడీ కార్డు
ఉన్నత స్థాయి కమిటీ కీలక సిఫారసులు
ఇక ఎన్నికలే ఉండవు.. కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో జమిలి ఎన్నికలు జరపాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని అత్యున్నత స్థాయి కమిటీ సిఫారసు చేసింది. 'ఒక దేశం-ఒకే ఎన్నిక' కింద 2029లో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని పేర్కొంది. మూడంచెల విధానంలో.. లోక్‌సభ, అసెంబ్లీలు, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని స్థానిక సంస్థలకు.. రెండు దశల్లో ఎన్నికలు జరపాలని పేర్కొంది. చట్టసభల ఎన్నికలు ముగిసిన తర్వాత వంద రోజుల్లో దేశంలోని స్థానిక సంస్థలన్నిటికీ ఎన్నికలు జరపాలని సూచించింది. సుపరిపాలనకు, శీఘ్ర అభివృద్ధికి జమిలి ఎన్నికలు మంచివంటూ పలు కీలక సిఫారసులతో

మిగతా 9వ పేజీలో...

టెట్ ఉందోచ్!

మెగా డీఎస్సీ ముంగిట టీచర్ పోస్టుల ఆశావహులకు సర్కారు శుభవార్త

- సీఎం ప్రత్యేక చొరవతో టెట్‌పై నిర్ణయం
- ఈ నెల 20న విడుదలకానున్న నోటిఫికేషన్
- 27 నుంచి ఏప్రిల్ 10 దాకా దరఖాస్తులు
- మే 20 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఉపాధ్యాయ అర్హత పరీక్షల నిర్వహణ
- జూన్ 20లోపు ఫలితాల వెల్లడి
- డీఎస్సీ పరీక్షల నిర్వహణ తేదీలూ ఖరారు
- జూలై 17 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు
- దరఖాస్తు గడువు జూన్ 20 దాకా పొడిగింపు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ శిక్షణ కోర్సు పూర్తి చేసినా టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) రాయలేకపోయామే అని.. ఒకవేళ ఇప్పటికే రాసినా అర్హత సాధించలేకపోయామే అన్న అసంతృప్తితో ఉన్న ఆశావహులకు ఇక ఆ దిగులు అక్కర్లేదు! మెగా డీఎస్సీ ముంగిట వారికి శుభవార్త! టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డీఎస్సీ పరీక్షల తేదీని కూడా సర్కారు ప్రకటించింది. టెట్ నిర్వహణ దృష్ట్యా డీఎస్సీ దరఖాస్తు గడువునూ పొడిగించింది. ఈ మేరకు గురువారం అధికారిక ప్రకటన విడుదలైంది. డీఎస్సీ పరీక్ష రాయాలంటే టెట్ అర్హత తప్పనిసరి! ఇప్పటికే సర్కారు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో టెట్ నిర్వహణ కోసం డిమాండ్లు

మిగతా 14వ పేజీలో...



పెట్రో ధరలు తగ్గాయ్ 2

లీటరు పెట్రోల్, డీజిల్‌పై 2 చొప్పున..
నేటి ఉదయం 6 నుంచి అమల్లోకి..
దాదాపు రెండేళ్ల తర్వాత తగ్గిన ధరలు
'లోక్‌సభ' షెడ్యూల్‌కు ముందు తగ్గింపు!
ఇటీవలే వంటగ్యాస్ సిలిండర్‌పై
రూ. 100 తగ్గించిన చమురు సంస్థలు

ఆపరేషన్ రేవంత్!

ఎన్నికలే లక్ష్యంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డ ప్రణీత్
కొద్ది నెలల ముందు నుంచి పెద్దఎత్తున నిఘా
ఓ ఎస్పీ, ఎస్ఐబీ అప్పటి చీఫ్ ఆదేశాలతోనే..
వందల ఫోన్లు ట్యాప్ చేశా: మాజీ డీఎస్పీ ప్రణీత్
ఆయన వాట్సాప్ చాట్‌లో విస్తుపోయే అంశాలు
కేసు దర్యాప్తుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా!
ప్రణీత్‌రావుతో అంటకాగినవారి చుట్టూ ఉచ్చు

హైదరాబాద్/సిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ)లో ఉండగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే నాయకులు, ప్రముఖుల ఫోన్‌లను తాను ట్యాపింగ్ చేసినట్లు విచారణలో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ఒప్పుకొన్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏకంగా టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ట్యాపింగ్‌కు పాల్పడ్డారని

మిగతా 12వ పేజీలో...

ఈసీ కమిషనర్లుగా సుఖ్‌బీర్, జ్ఞానేశ్‌కుమార్



ఇద్దరూ 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారులే
370 అధికరణం రద్దు సమయంలో
కేంద్ర హోం శాఖలో జ్ఞానేశ్‌కుమార్ బాధ్యతలు
ఉత్తరాఖండ్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సంధూ
ఎంపిక కమిటీ నుంచి సీజేఐను తప్పించడంపై
నేడు సుప్రీం కోర్టులో విచారణ 2

నేటి నుంచి వాహనాలకు టీజీ

0001 నుంచి ప్రారంభం
కానున్న రిజిస్ట్రేషన్లు
ఇప్పటికే 'టీఎస్'గా నమోదైన
వాహనాలు యథాతథం
స్పెషల్ నంబర్లకు అయోమయం!
వాటికి టీఎస్‌లో రిజర్వ్
చేయాలా? టీజీలోనా? 13
నేడు సర్కారు స్పష్టతనిచ్చే చాన్స్
కొత్త కోడ్ తెలంగాణ
ఆత్మగౌరవానికి ప్రతీక: పొన్నం

'గొర్రెల పంపిణీ' కేసులో..

పశు సంవర్ధక శాఖ జేడీ, ఏడీ అరెస్ట్
రూ.2.10 కోట్ల బిల్లు
చెల్లింపులో గోల్‌మాల్ 14
ప్రైవేటు వ్యక్తులకు పెత్తనం
కలెక్టర్‌కు తప్పుడు వివరాలు

మరో 2 సీట్లకు బీఆర్ఎస్ అభ్యర్థులు

మల్కాజిగిరిలో లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్‌లో ఆత్రం సక్కు
ప్రకటించిన కేసీఆర్ 12

రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత వైద్యం 2

ఛత్తీస్‌గఢ్‌లో పైలెట్ ప్రాజెక్టు
ప్రారంభించనున్న కేంద్రం

కాంగ్రెస్‌లోకి జితేందర్‌రెడ్డి!



మాజీ ఎంపీ నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్
ప్రజల్లో ఉండే నాకు టికెట్ రాలేదని సీఎం బాధపడ్డారు
భవిష్యత్తును బీజేపీ అధినాయకత్వం చూసుకుంటుంది
ఎన్నికల్లో పోటీచేయను.. 'ఆంధ్రజ్యోతి'తో జితేందర్‌రెడ్డి
సీఎం వెళ్లారంటే పార్టీలోకి ఆహ్వానించేందుకే: జూపల్లి 12

హైదరాబాద్, మహబూబ్‌నగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పబోతున్నారు..! నేడో, రేపో ఆయన కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ కోసం జితేందర్‌రెడ్డి చివరివరకు ప్రయత్నించారు. తెలంగాణ పర్యటనకు వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ప్రత్యేకంగా భేటీ అయి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే, బీజేపీ నాయకత్వం పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు టికెట్ కేటాయించడంతో జితేందర్‌రెడ్డి తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ నేపథ్యంలోనే

మిగతా 12వ పేజీలో...

డీకే శివకుమార్‌ను కలిసిన మల్లారెడ్డి
కొడుకుతో కలిసి బెంగళూరుకు.. కర్ణాటక డిప్యూటీ సీఎంతో భేటీ
పార్టీ మార్పుపై ఊహాగానాలు.. వ్యాపార లావాదేవీలే: మల్లారెడ్డి



నేడు హైదరాబాద్‌కు మోదీ రాక

మల్కాజిగిరి నియోజకవర్గంలో రోడ్ షో
అనంతరం రాజ్‌భవన్‌కు.. అక్కడే బస
రేపు నాగర్‌కర్నూల్.. 18న జగిత్యాలలో సభ
ఎన్నికల ప్రచారంలో కమలం దూకుడు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కమలం పార్టీ స్పీడు పెంచింది. మెజారిటీ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా పార్టీ జాతీయ అగ్రనేతలు స్వయంగా రంగంలోకి దిగారు. పది రోజుల వ్యవధిలో ప్రధాని మోదీ రెండోసారి రాష్ట్రంలో

మిగతా 12వ పేజీలో...

తెలంగాణలో కాంగ్రెస్‌దే హవా!

17 లోక్‌సభ స్థానాల్లో 10 హస్తానికే
బీజేపీ-4, బీఆర్ఎస్-2, మజ్లిస్-1
ఏపీలో టీడీపీ కూటమికి ఘనవిజయం
మొత్తం 25 సీట్లలో 20 గెలిచే చాన్స్
ఉత్తరాదిన మళ్లీ బీజేపీ ప్రభంజనం
పలు రాష్ట్రాల్లో కమలం క్లీన్‌స్వీప్
ఏబీపీ-సీ ఓటర్ ఒపీనియన్ పోల్
తెలంగాణలో బీజేపీ 8 సీట్లు 12
గెలుస్తుందని నెట్‌వర్క్ 18 సర్వే వెల్లడి

పీట దెబ్బకు కదిలిన పీఠం! 14

యాదగిరిగుట్ట ఆలయ ఈవో బదిలీ
కొత్త ఈవోగా భాస్కర్‌రావు నియామకం
ఒకే ఎత్తులో ఉండే 10 పీటల కొనుగోలు
ప్రొటోకాల్ వివాదం నేపథ్యంలో చర్యలు



యాదాద్రి ఆలయంలో కొత్త పీటలను పరిశీలిస్తున్న అధికారులు





పార్టీలకు కంపెనీలకు మధ్య 'బాండ్'.. ప్రుడెంట్ ట్రస్టు

- కంపెనీలు ఇచ్చే నిధులను పార్టీలకు మళ్లించటమే ట్రస్టు పని
- గత 11 ఏళ్లలో రాజకీయ పార్టీలకు రూ.2,256 కోట్ల విరాళాల పంపిణీ
- వీటిలో 75% బీజేపీకే: రాయిటర్స్ వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 14: అక్కడున్న ఆ ఆఫీసులో పని చేసే సిబ్బంది ఇద్దరే. బయటి నుంచి చూస్తే ఏదో చిన్న పాటి కంపెనీ కార్యాలయంలా అది కనిపిస్తుంది. కానీ, లోగుట్టు తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే, గత 11 ఏళ్లలో ఆ ఆఫీసు నుంచి రూ.2,256 కోట్ల 'ఆర్థిక లావాదేవీలు' జరిగాయి. అది దేశంలోనే అతిపెద్ద ఎలక్టోరల్ ట్రస్టు ప్రుడెంట్ కార్యాలయం. రాయిటర్స్ వార్తాసంస్థ పరిశోధనాత్మక కథనంతో దీని గురించి తాజాగా ప్రపంచానికి తెలిసింది. 2013లో భారతీ ఎయిర్‌టెల్ కంపెనీ ప్రుడెంట్ ట్రస్టును నెలకొల్పింది. మరుసటి ఏడాది దానిని స్వతంత్ర ఆడిటర్లు ముకుల్ గోయల్, వెంకటాచలం గణేష్‌లకు అప్పగించింది. ఈ ట్రస్టు పని ఏమిటంటే.. వివిధ కార్పొరేట్ కంపెనీలు తనకు ఇచ్చే నిధులను రాజకీయపార్టీలకు విరాళాలుగా అందించటం. ఈ విధంగా గత 11 ఏళ్లలో రూ.2,256 కోట్ల విరాళాలు ఇచ్చింది. దీంట్లో 75 శాతం బీజేపీకే లభించాయి. అయితే, ఈ వివరాల్ని ప్రుడెంట్ వెల్లడించలేదు. అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా రాయిటర్స్ పరిశోధన జరిపి.. ఈ వివరాలను గుర్తించింది. దీని ప్రకారం 2019-23 మధ్య ఈ ట్రస్టుకు 8 భారీ భారతీయ కంపెనీలు దాదాపు రూ.414 కోట్ల నిధులను అందించాయి. ఈ మొత్తాన్ని ప్రుడెంట్ ట్రస్టు చెక్కుల రూపంలో బీజేపీకి బదిలీ చేసింది. రాయిటర్స్ గుర్తించిన కంపెనీలలో ఎస్సార్ మిట్టల్ నిప్పన్ స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, జీఎమ్మార్, ఎస్సార్ ఉన్నాయి. దీని గురించి రాయిటర్స్ ప్రతినిధి ఆయా కంపెనీలను ప్రశ్నించగా.. ప్రుడెంట్ ట్రస్టు తనపైన నిబంధనల ప్రకారమే విరాళాల్ని పంపిణీ చేస్తుందని, దాని గురించి తమకు తెలియదని జీఎమ్మార్, భారతీ ఎయిర్‌టెల్ ప్రతినిధులు చెప్పారు. మిగిలిన రెండు కంపెనీలు స్పందించటానికి నిరాకరించాయి. ప్రుడెంట్ ట్రస్టు కూడా రాయిటర్స్ ఈ మెయిల్ ప్రశ్నలపై స్పందించలేదు. అయితే, ఆ ట్రస్టుకు చెందిన ముకుల్ గోయల్‌ను రాయిటర్స్ ప్రతినిధి ఫోన్‌లో సంప్రదించి.. ట్రస్టు ఎలా పని చేస్తుందని ప్రశ్నించగా.. 'ఆ వివరాల్ని బహిరంగంగా మేం చర్చించం' అని మాత్రమే చెప్పారు. కాగా, దేశంలోని 18 ఎలక్టోరల్ ట్రస్టుల్లో ప్రుడెంట్ అతి పెద్దది. చట్టప్రకారం ఎలక్టోరల్ ట్రస్టులు తమకు లభించిన నిధుల గురించి, వివిధ పార్టీలకు వాటిని ఏ మేరకు పంపిణీ చేశామన్న దాని గురించి వివరాలు వెల్లడించాల్సి ఉంటుంది.

రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత వైద్యం

- ఛత్తీస్‌గఢ్‌లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించనున్న కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 14: రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన వారికి వారం రోజుల పాటు ఏ ఆసుపత్రిలోనైనా రూ. 1.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందించాలని నిర్ణయించింది. చికిత్స తర్వాత ఆసుపత్రులు రీఎంబర్స్‌మెంటును క్లెయిమ్ చేసుకోవచ్చని పేర్కొంది. దీనిని మోటార్ వెహికల్ యాక్సిడెంట్ ఫండ్ ద్వారా చెల్లించనున్నట్లు తెలిపింది. దేశంలో ఎక్కడైనా, ఏ రహదారిపై జరిగిన ప్రమాదానికైనా ఉచిత చికిత్స ఉంటుందని వెల్లడించింది. మొదట ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఛత్తీస్‌గఢ్‌లో ప్రారంభించనున్నట్లు గురువారం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ ప్రకటించింది. అనంతరం దీనిని దేశం మొత్తం విస్తరించనున్నట్లు వెల్లడించింది.

లోకం తీరు



వర్సిటీల్లో అంబుడ్స్‌పర్సన్లు ఎక్కడ?

- 228 విశ్వవిద్యాలయాలు ఇంకా నియమించలేదు
- జాబితాను విడుదల చేసిన యూజీసీ
- తెలుగు రాష్ట్రాల్లో ఆరు విశ్వవిద్యాలయాలు

న్యూఢిల్లీ, మార్చి 14: ర్యాగింగ్ వంటి అంశాలు, విద్యార్థుల సమస్యలపై అంబుడ్స్‌పర్సన్లను నియమించాలని పదేపదే చెబుతున్నా.. పలు విశ్వవిద్యాలయాలు పట్టించుకోవడం లేదని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) పేర్కొంది. దేశవ్యాప్తంగా ఇంకా 228 వర్సిటీలు అంబుడ్స్‌పర్సన్లను నియమించాలని పేర్కొంటూ.. బుధవారం ఆ జాబితాను విడుదల చేసింది. ఈ లిస్టులో 67 ప్రైవేటు, 159 రాష్ట్ర ప్రభుత్వ, రెండు డీమ్డ్ యూనివర్సిటీలున్నాయి. గత ఏడాది ఆగస్టులో జాదవ్‌పూర్ వర్సిటీలో ర్యాగింగ్, లైంగిక వేధింపుల కారణంగా ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడ్డారు. నవంబరులోనూ ర్యాగింగ్, వేధింపులు ఓ పీజీ విద్యార్థి బలవన్మరణానికి కారణమయ్యాయి. దీంతో వర్సిటీలు అంబుడ్స్‌పర్సన్లను నియమించుకోవాలంటూ యూజీసీ గెజిట్ జారీ చేసింది. జనవరి 17న సుమారు 421 వర్సిటీలు ఆ దిశలో చర్యలు తీసుకోలేదంటూ మందలించింది. తాజాగా ఇంకా 228 వర్సిటీలు అంబుడ్స్‌పర్సన్లను నియమించాల్సి ఉందని పేర్కొంటూ బుధవారం మరో జాబితాను విడుదల చేసింది. వెంటనే అంబుడ్స్‌పర్సన్లను నియమించుకుని, ఆ వివరాలను ఈమెయిల్ ద్వారా తెలియజేయాలని ఆదేశించింది. ఈ చిట్టాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆరు విశ్వవిద్యాలయాలున్నాయి. వీటిల్లో.. తెలంగాణకు చెందిన కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం, నిమ్స్, ఆర్జీయూకేటీ(బాసర), ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ, క్లస్టర్ వర్సిటీ, శ్రీవేంకటేశ్వర వేదిక్ విశ్వవిద్యాలయం ఉన్నాయి.

మమతా బెనర్జీకి తీవ్ర గాయం

- ఇంట్లో పడిపోవడంతో నుదుటిపై చిట్లి రక్తస్రావం



కోల్‌కతా, మార్చి 14: పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ గురువారం సాయంత్రం తన నివాసంలో పడిపోవడంతో ఆమెకు నుదుటిపై తీవ్ర గాయమైంది. ఆమెను వెంటనే ప్రభుత్వ ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రికి తరలించారు. సీనియర్ వైద్యుల బృందం ఆమెకు చికిత్స అందిస్తోంది. వైద్యులు రెండు కుట్లు వేసినట్టు ఆమె సోదరుడు కార్తీక్ బెనర్జీ తెలిపారు. నుదుటిపై గాయం నుంచి రక్తం కారుతున్న మమత ఫొటోను తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సోషల్ మీడియాలో పోస్టు చేసింది. తమ చైర్‌పర్సన్‌కు తీవ్ర గాయమైందని, ఆమె త్వరగా కోలుకోవాలని ప్రార్థించాలని కోరింది. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారని టీఎంసీ నేతలు తెలిపారు. ప్రధాని మోదీ, టీడీపీ చీఫ్ చంద్రబాబు, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తదితరులు మమతా బెనర్జీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నైట్ విజన్ ఐఎఫ్‌వీలు

- రూపొందించిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ
- సైన్యానికి అందజేసేందుకు రక్షణ శాఖతో ఒప్పందం

కంది, అల్వాల్(ఆంధ్రజ్యోతి), మార్చి 14: భారత సైన్యం అమ్ములపొదిలో చేరడానికి మరో సరికొత్త దివ్యాస్త్రం సిద్ధమైంది. రాత్రిళ్లు కూడా శత్రువుల కదలికలను గుర్తించి, దాడులు జరిపేలా తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఎద్దుమైలారంలో ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ నైట్‌విజన్ బీఎంపీ-2 ఇన్ఫాంట్రీ ఫైటింగ్ వెహికిల్(ఐఎఫ్‌వీ)లను రూపొందించింది. వీటి కోసం రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు గురువారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీఎండీ సంజయ్ ద్వివేదితో ఒప్పందం చేసుకున్నారు.

ఇంటివద్దే ఆర్టీసీ పార్శిళ్ల పికప్- డెలివరీ

- దిల్‌సుఖ్‌నగర్‌లోమోడల్ కౌంటర్ ప్రారంభం


లాజిస్టిక్స్ పికప్, డెలివరీల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎండీ సజ్జనర్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ప్రత్యామ్నాయ ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వ సహకారంతో టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలను మరింత విస్తరించనున్నట్లు ఆ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. వినియోగదారులకు వేగవంతమైన సేవ లందించేందుకు త్వరలో పార్శిళ్లను ఇంటి వద్ద నుంచే పికప్, డెలివరీ చేపడతామని ఆయన వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ బస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లాజిస్టిక్స్ మోడల్ కౌంటర్‌ను, పార్శిళ్ల హోం పికప్, డెలివరీ కోసం వినియోగించే కొత్త వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం నూతన లోగోను, బ్రోచర్‌నూ ఆయన ఆవిష్కరించారు. అనంతరం సజ్జనార్ మాట్లాడుతూ, సంస్థకు టికెట్ ఆదాయం 97 శాతం వస్తుండగా.. టికెటేతర ఆదాయం 3 శాతమే వస్తోందని చెప్పారు. దీంతో ప్రత్యామ్నాయ ఆదాయాన్ని పెంచుకోవాలనే లక్ష్యంతో ప్రైవేట్ మార్కెట్‌కు దీటుగా లాజిస్టిక్స్ విభాగాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. త్వరలోనే ఇలాంటి కౌంటర్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలోనే పార్శిళ్ల హోం పికప్, డెలివరీ సదుపాయాన్ని కల్పిస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ సేవలకు సంబంధించి సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం కాల్ సెంటర్ నంబర్ 040-69440069 గానీ, https://www.tsrtclogistics.in వెబ్‌సైట్‌ను గానీ సంప్రదించాలని సజ్జనార్ సూచించారు.

'గృహజ్యోతి'కి రూ.200 కోట్లు విడుదల

గృహజ్యోతి పథకం అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం డిస్కమ్‌లకు రూ.200 కోట్లు విడుదల చేసింది. ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ ఇందుకు సంబంధించిన జీవోను గురువారం జారీ చేశారు. రాష్ట్రంలో మార్చి 1 నుంచి గృహజ్యోతి పథకం అమలులోకి వచ్చింది. ఈ పథకం కింద అర్హులైన గృహ విద్యుత్ వినియోగదారుల్లో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన వారికి డిస్కమ్‌లు జీరో బిల్లులు జారీ చేస్తున్నాయి.

అటవీశాఖలో సూపరింటెండెంట్లకు గెజిటెడ్ హోదా

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో పనిచేస్తున్న సూపరింటెండెంట్లకు పరిపాలనా అధికారులుగా గెజిటెడ్ హోదాను కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా టీఎన్జీవో అటవీ ఫోరమ్ రాష్ట్ర సమితి నేతలు గురువారం సచివాలయంలో అటవీ, పర్యావరణ మంత్రి కొండా సురేఖను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

విషయం దాచి..



(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకోవడానికి బాండ్ల సీరియల్ నంబర్లు తప్పనిసరి అని వ్యాఖ్యానించారు. లబ్ధిదారులెవరో తెలుసుకోవడానికే జాబితాను వెలువరించాలన్నది సుప్రీంకోర్టు తీర్పు ఉద్దేశమని చెప్పారు. బాండ్ నంబర్ల సమాచారం విడిగా వేరే సైలోస్‌లో(విడిగా ఉండే డేటాబేస్) ఉందని ఎస్‌బీఐ చెబుతోందని ప్రస్తావించారు. ఓటర్ స్వేచ్ఛగా సమర్థంగా ఓటేయాలంటే ఒక రాజకీయ పార్టీకి ఎక్కడి నుంచి నిధులు వస్తున్నాయనే సమాచారం అతనికి తెలిసి ఉండాలని స్వయంగా సుప్రీంకోర్టే చెప్పిందని గుర్తు చేశారు. ఫలానా కంపెనీ విడుద చేసిన నిధులకు, ఫలానా పార్టీకి అందిన నిధులకు సంబంధం ఉందో లేదో ధ్రువీకరించుకొనేందుకు ఓటర్‌కు అవకాశం కలగాలంటే బాండ్ల సీరియల్ నంబర్లు కూడా జాబితాలో చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అయితే, సుప్రీంకోర్టు ఇటీవల ఎస్‌బీఐకి గడువు విధించినపుడు అనుకున్న అన్ని వివరాలు అందాలంటే సమయం పడుతుందని ఎస్‌బీఐ బదులిచ్చింది. కుదరదని, ఉన్న జాబితాను వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఒకవిధంగా కుంటి సాకులకు అవకాశం లేకుండా ఎంతోకొంత డేటా ప్రజల్లోకి వచ్చేందుకు ఈ ఆదేశం ఉపయోగపడింది. మొత్తం మీద ఎన్నికల సంఘానికి ఎస్‌బీఐ ఇచ్చిన డేటా పాక్షికమే. బాండ్ల సీరియల్ నంబర్లు ఇస్తే కానీ సంపూర్ణంకాదు.

ఐదేళ్ల డేటా

ఎస్‌బీఐ 2019 ఏప్రిల్ 1 నుంచి 2024 ఫిబ్రవరి 15 వరకు బాండ్లకు సంబంధించిన డేటాను ఎన్నికల సంఘానికి ఇచ్చింది. అంటే, దాదాపు ఐదేళ్ల కాలానికి సంబంధించిన డేటా అన్నమాట. కంపెనీలు ఇచ్చిన 22,030 బాండ్లను రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్నాయి. వాటి విలువ రూ.16,518 కోట్లు. ఎస్‌బీఐ ఇచ్చిన రెండు జాబితాల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం దేశంలోని దిగ్గజ కంపెనీలు అన్నీ ఎలక్టోరల్ బాండ్ల మీద భారీ ఎత్తున ఖర్చు పెట్టాయి. 2022లో ఈడీ విచారణను ఎదుర్కొన్న ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ సంస్థ ఏకంగా రూ.1,368 కోట్లను బాండ్ల రూపంలో చెల్లించింది. అగ్రస్థానంలో నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజనీరింగ్ సంస్థ 966 కోట్ల విలువైన బాండ్లు రాజకీయ పార్టీల కోసం కొనుగోలు చేసి, రెండో స్థానంలో ఉంది. హిందూ పత్రికలో పేర్కొన్న వివరాల ప్రకారం బాండ్ల రూపంలో అత్యధికంగా నిధులు అందుకున్న రాజకీయ పార్టీల్లో బీజేపీ అగ్రస్థానంలో ఉంది. ఆ పార్టీకి ఏకంగా 8633 బాండ్ల రూపంలో రూ.6,560 కోట్ల నిధులు అందాయి. తృణమూల్ 1609 కోట్లతో(12%) రెండో స్థానంలో ఉంది. కాంగ్రెస్ 3,146 బాండ్లతో 1421 కోట్లు అందుకొని మూడో స్థానంలో నిలిచింది. మొత్తం ఎలక్టోరల్ బాండ్లలో 47 శాతం బీజేపీకే దక్కాయి. కాంగ్రెస్‌కు 11 శాతం అందాయి. బీఆర్ఎస్ నాలుగో స్థానంలో, వైసీపీ, టీడీపీలు ఏడు, ఎనిమిది స్థానాల్లో ఉన్నాయి

బాండ్లు అందుకున్న పార్టీలు

	అందిన సొమ్ము రూ.కోట్లలో	శాతం
బీజేపీ	6060	47
తృణమూల్	1609	12
కాంగ్రెస్	1421	11
బీఆర్ఎస్	1215	9
బీజేడీ	775	6
డీఎంకే	639	5
వైసీపీ	337	2
టీడీపీ	219	1
శివసేన	159	1
ఆర్జేడీ	72	-
జనసేన	21	-

బాండ్లు ఇచ్చిన కంపెనీలు

కంపెనీలు - సొమ్ము రూ.కోట్లలో		కంపెనీలు - సొమ్ము రూ.కోట్లలో	
ఫ్యూచర్ గేమింగ్	1368	రెడ్డీ ల్యాబ్స్	80
మేఘా ఇంజనీరింగ్	966	పిరామల్	60
క్విక్ సప్లయ్ చైన్	410	నవయుగ	55
వేదాంత	400	శిర్డీసాయి ఎలక్ట్రికల్స్	40
హల్దియా ఎనర్జీ	377	సిప్లా	39
భారతి టెలికం	247	ఇంటర్‌గ్లోబ్-స్పైస్‌జెట్	36
ఎస్సెల్ మైనింగ్	224	మిట్టల్ కంపెనీలు	246
వెస్టర్న్ యూపీ పవర్	200	గ్రాసిమ్	33
కేవెంటర్ ఫుడ్ పార్క్	194	జిందాల్ స్టెయిన్‌లెస్	30
మదన్‌లాల్	185	బజాజ్ ఆటో	25
డీఎల్ఎఫ్	170	సన్ ఫార్మా	25
యశోద హాస్పిటల్స్	162	మ్యాన్‌కైండ్ ఫార్మా	24
ఉత్కళ్ అల్యుమినా	145	బజాజ్ ఫైనాన్స్	20
జిందాల్ స్టీల్	123	సుజుకీ	20
బిర్లా కార్బన్	105	అల్ట్రాటెక్	15
రుంగ్టా సన్స్	100	టీవీఎస్	10

ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీకి రూ.400 కోట్లు

- కేంద్ర సంస్థలతో బెదిరించి భారీగా నిధుల సేకరణ: ఖర్గే



న్యూఢిల్లీ, మార్చి 14: కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఈడీ, సీబీఐలను ఉపయోగించుకుని, బడా కంపెనీలను బెదిరించి రూ.400 కోట్లను బీజేపీ వసూలు చేసిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా 45 కంపెనీల నుంచి ఈ మొత్తం బీజేపీకి చేరిందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఈ నిధులకు సంబంధించిన శ్వేతపత్రాన్ని బీజేపీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర సంస్థలతో దాడులు చేయించడంతో 15 కంపెనీలు బీజేపీకి భారీఎత్తున నిధులు సమర్పించుకున్నాయని ఖర్గే ఆరోపించారు. బెదిరించడం, దోచుకోవడం, బ్లాక్‌మెయిల్ చేయడం ద్వారా బీజేపీ భారీ ఎత్తున నిధులు సమకూర్చుకుంటుందని ఆయన మండిపడ్డారు. నాలుగు షెల్ కంపెనీల నుంచి కూడా బీజేపీకి నిధులు వచ్చాయని ఆరోపించిన ఖర్గే... కాంగ్రెస్ ఖాతాలను సీజ్ చేయిస్తున్న బీజేపీ, తాను మాత్రం కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేసి నిధులు సమకూర్చుకుంటుందని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యం మీద బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే తాను సేకరించిన నిధులపై స్వతంత్ర విచారణకు ఆదేశించుకోవాలని ఖర్గే సవాలు విసిరారు. ఐటీ, ఈడీ దాడుల తర్వాత 30 సంస్థలు బీజేపీకి రూ.335 కోట్ల నిధులు అందజేశాయని ఆయన వ్యాఖ్యానించారు. నిర్ణీత వ్యవధిలోపు ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బయటపెడతామని ప్రధాన ఎన్నికల కమిషనర్ చేసిన ప్రకటనపై తమకు విశ్వాసముందని పూర్తి పారదర్శకతతో ఎలక్టోరల్ బాండ్ల వివరాలు వెల్లడించాలని ఖర్గే కోరారు.

తగ్గిన పెట్రో ధరలు

లీటరు పెట్రోల్, డీజిల్‌పై 2 చొప్పున తగ్గింపు



న్యూఢిల్లీ, మార్చి 14: ఇంధన ధరలు తగ్గాయి. పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.2 చొప్పున ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు తగ్గించాయి. తగ్గించిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి 6 గంటల నుంచి అమల్లోకి వస్తాయని గురువారం సాయంత్రం చమురు మంత్రిత్వ శాఖ తెలిపింది. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడానికి ముందు పెట్రో ధరల తగ్గింపునకు సంబంధించిన ప్రకటన వెలువడటం గమనార్హం. దీంతో వాహనదారులకు కాస్త ఉపశమనం లభించనుంది. తాజాగా తగ్గించిన ధరతో దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం నుంచి లీటరు పెట్రోల్ ధర రూ.96.72 నుంచి రూ.94.72కు తగ్గనుంది. అలాగే లీటరు డీజిల్ ధర రూ.89.62 నుంచి రూ.87.62కు చేరనుంది. ముంబైలో లీటరు పెట్రోల్ ధర రూ.104.21కు, చెన్నైలో రూ.100.75కు తగ్గనుంది. అలాగే ముంబైలో లీటరు డీజిల్ రూ.92.15, కోల్‌కతాలో రూ.90.76, చెన్నైలో రూ.92.34కు చేరనుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.109.66, డీజిల్ ధర రూ.97.82గా ఉంది. వీటిపై మరో రూ.2 చొప్పున తగ్గనుంది. స్థానిక పన్నులు, దూరాన్ని బట్టి ఇంధనాల రేట్లు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా ఉంటాయి. 2022 ఏప్రిల్ 6నుంచి పెట్రో ధరల్లో ఎలాంటి మార్పు లేదు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇటీవలే వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.100 తగ్గింపు ప్రకటన వెలువడింది. వారంలోనే పెట్రో ధరల తగ్గింపు ప్రకటన వెలువడటం గమనార్హం. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడితే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఫలితంగా ఓటర్లను ఆకట్టుకునే ప్రకటనలు చేయడానికి అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలోనే తాజా ప్రకటన వెలువడినట్టు చర్చ జరుగుతోంది.

దేశంలో పెరిగిన సగటు ఆయుర్దాయం

- 2022లో 67.7 ఏళ్లకు పెరుగుదల
- పెరిగిన తలసరి ఆదాయం
- ఐరాస మానవాభివృద్ధి సూచీ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 14: దేశంలో సగటు ఆయుర్దాయం గణనీయంగా పెరిగింది. 2021 సంవత్సరంలో 62.7 ఏళ్లుగా ఉన్న సగటు ఆయుర్దాయం 2022లో 67.7 ఏళ్లకు పెరిగింది. అలాగే, భారత్‌లో తలసరి ఆదాయం (జాతీయ స్థూల ఆదాయంపరంగా) 6.3 శాతం పెరిగి సుమారు రూ.5.76 లక్షల(6,951 డాలర్లు)కు చేరిందని ఐక్యరాజ్యసమితి మానవాభివృద్ధి సూచీ నివేదిక వెల్లడించింది. సగటు విద్యాభ్యాసం కూడా 12.6కు పెరిగిందని తెలిపింది. దీర్ఘకాల-ఆరోగ్యవంతమైన జీవితం, విద్య అందుబాటు, మంచి జీవన ప్రమాణంఅనే మూడు ప్రాథమిక మానవాభివృద్ధి అంశాల్లో సాధించిన పురోగతి ఆధారంగా మొత్తం 193 దేశాలకు సూచీని రూపొందించగా...భారత్ 0.644 స్కోరుతో అంతకు ముందు ఏడాదికంటే ఒక స్థానాన్ని మెరుగుపరచుకొని 134వ స్థానంలో నిలిచింది. ఇది మానవాభివృద్ధిలో మధ్యస్థ కేటగిరీ. 2021లో 191దేశాలకు రూపొందించిన సూచీలో భారత్ 0.633 స్కోరుతో 135వ స్థానంలో ఉంది. అలాగే, 1990లో భారత్ స్కోరు 0.434 మాత్రమే ఉండగా, 2022 నాటికి 48.4శాతం పెరుగుదల కనిపించిందని నివేదిక తెలిపింది. లింగ అసమానతలను తగ్గించడంలోనూ భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని నివేదిక తెలిపింది.

ఎన్నికల సంఘం కొత్త కమిషనర్లుగా..

సుఖ్‌బీర్ సంధూ, జ్ఞానేష్‌కుమార్!

- ఇద్దరూ 1988 బ్యాచ్ ఐఏఎస్‌లే
- కేరళ, ఉత్తరాఖండ్ కేడర్‌కు చెందినవారు


జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధూ

న్యూఢిల్లీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కమిషనర్లుగా మాజీ ఐఏఎస్ అధికారులు సుఖ్‌బీర్‌సింగ్ సంధూ జ్ఞానేశ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇటీవల ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీ గురువారం సమావేశమైంది. దీనిలో ఓ కేంద్ర మంత్రి, లోక్‌సభ లో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్‌చౌదరి సభ్యులు. కేంద్ర మంత్రి కోటాలో హోం మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. కమిషనర్ల నియామకం కోసం కేంద్రం న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఆధ్వర్యంలోని సెర్చ్ కమిటీ ప్రతిపాదిత పేర్లతో జాబితాను రూపొందించింది. ఈయన కూడా సమావేశానికి హాజరయ్యారు. జాబితాపై చర్చ అనంతరం పంజాబ్‌కు చెందిన సంధూ, కేరళకు చెందిన జ్ఞానేశ్‌లను ఎన్నికల సంఘం కమిషనర్లుగా ఎంపిక చేశారు. కమిషనర్‌గా ఉన్న అరుణ్ గోయల్ గత శుక్రవారం అనూహ్యంగా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. మరో కమిషనర్ అనూప్ చంద్ర పాండే ఫిబ్రవరిలో పదవీ విరమణ చేశారు. కాగా, ప్రభుత్వం నుంచి ప్రకటన రాకముందే.. ఢిల్లీలోని తన నివాసంలో అధిర్ మీడియా సమావేశం నిర్వహించి కొత్త కమిషనర్ల నియామకం వివరాలు తెలపడం గమనార్హం.

ఒకటే బ్యాచ్..

కేరళకు చెందిన జ్ఞానేశ్‌కుమార్, పంజాబ్‌కు చెందిన సుఖ్‌బీర్‌సింగ్ సంధూ 1988 బ్యాచ్ ఐఏఎస్‌లు. జ్ఞానేశ్ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ కార్యదర్శిగా, యూపీఏ ప్రభుత్వ హయాంలో 2007-12 మధ్య రక్షణ మంత్రిత్వ శాఖలో సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. సుఖ్‌బీర్ 2019-21 మధ్య ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా, నేషనల్ హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) చైర్మన్‌గానూ వ్యవహరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 3న లోక్‌పాల్ కార్యదర్శిగా నియమితులయ్యారు.

నేడు సుప్రీం కోర్టులో విచారణ

కేంద్ర ఎన్నికల ప్రధానకమిషనర్ (సీఈఐ), ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి ప్రధాన న్యాయమూర్తిని తప్పించడంపై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ఇటీవల దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఈ అంశంపై గతంలోనే మధ్యప్రదేశ్ మహిళా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి జయ ఠాకూర్, మరికొందరు సుప్రీంను ఆశ్రయించారు.

తుది జాబితా అడిగితే 212 పేర్లిచ్చారు

ఎన్నికల కమిషనర్ల ఎంపికకు అనుసరించిన ప్రక్రియపై అధీర్ పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఏకపక్షంగా ఎంపిక చేశారని చెప్పడం లేదని, అయితే.. లోపాలు ఉన్నాయన్నారు. కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. 'కుదించిన జాబితాను అడిగితే బుధవారం రాత్రి 212 మంది పేర్లిచ్చారు. భేటీకి 10 నిమిషాల ముందు ఆరుగురి పేర్లు చెప్పారు. వీరందరి పూర్తి నేపథ్యం గురించి సమాచారం ఇవ్వలేదు. అయినా ఇద్దరి నియామకం జరిగిపోయింది. భర్తీ ప్రక్రియలో లోపాలను ప్రశ్నిస్తూ, నిరసన వ్యక్తం చేశా. నేను ఎవరి పేర్లను సూచించలేదు' అని మండిపడ్డారు.

సీఏఏ వివక్షాపూరితం

- ఐరాస, ఆమ్నెస్టీ, అమెరికా అభ్యంతరాలు

వాషింగ్టన్, మార్చి 14: కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమలులోకి తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ఐక్యరాజ్యసమితి, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, అమెరికా ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేశాయి. సీఏఏ ప్రాథమికంగానే వివక్షతో కూడుకున్న చట్టమని, అంతర్జాతీయంగా భారత్ కట్టుబడి ఉన్న మానవహక్కుల ఒప్పందాలను ఇది ఉల్లంఘిస్తుందని.. 2019లో సీఏఏ చట్టాన్ని చేసినప్పుడే తమ ఆందోళనను వెలిబుచ్చామని ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ కార్యాలయం ప్రతినిధి తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల చట్టానికి అనుగుణంగా సీఏఏ ఉందా? అన్నదానిని పరిశీలిస్తున్నామన్నారు. అమెరికా ప్రభుత్వ ప్రతినిధి స్పందిస్తూ.. సీఏఏను ఏ విధంగా అమలు చేయబోతున్నారన్న దానిని నిశితంగా గమనిస్తున్నామని చెప్పారు. మతం ఆధారిత వివక్షను చట్టబద్ధం చేసే సీఏఏను ఒక చట్టంగా తీసుకురావటం సరైనది కాదని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అభిప్రాయపడింది. మరోవైపు, సీఏఏపై అఫ్గానిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం తొలిసారిగా స్పందిస్తూ.. చట్టం అందరికీ సమానంగా వర్తించాలని, సీఏఏ పరిధిలోకి ముస్లింలను కూడా తీసుకురావాలని పేర్కొంది. తమ దేశంలో హిందువులు, సిక్కుల వంటి మత మైనారిటీలపై ఎటువంటి వివక్ష, వేధింపులు లేవని తెలిపింది.

సీఏఏపై వెనక్కి తగ్గేది లేదు

- అమిత్‌షా వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 14: పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) వెనక్కి తీసుకునే ప్రసక్తి లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. సీఏఏను రాజ్యాంగ విరుద్ధం అంటూ విపక్షాలు చేస్తున్న వాదనలను ఆయన కొట్టివేశారు. ప్రజలను విపక్షాలు భయపెడుతున్నట్టు సీఏఏ నిబంధనల్లో నిర్బంధ శిబిరాల ప్రస్తావన ఎక్కడా లేదని గురువారం 'ఏఎన్ఐ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. విపక్షాలు పదేపదే ప్రస్తావించే ఆర్టికల్ 14కు భిన్నంగా సీఏఏ నిబంధనలను రూపొందలేదని పేర్కొన్నారు. "అధికారంలోకి వస్తే సీఏఏను రద్దు చేస్తామని అంటున్న 'ఇండియా' కూటమికి తాను అధికారంలోకి రాబోవడం లేదని స్పష్టంగా తెలుసు. సీఏఏను మోదీ ప్రభుత్వం తెచ్చింది. దానిని రద్దు చేయడం అసాధ్యం." అని అమిత్‌షా పేర్కొన్నారు.

రామ్‌లల్లా దర్శనం ఎంతో సులభం!

- మార్గదర్శకాలు విడుదల చేసిన అయోధ్య ఆలయ ట్రస్ట్

న్యూఢిల్లీ, మార్చి 14: అయోధ్యలో కొలువైన బాలరాముడి దర్శనానికి వెల్లువెత్తుతున్న భక్తులకు ఆలయ సందర్శనకు సంబంధించి శ్రీ రామ జన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. రోజూ సగటున లక్ష నుంచి లక్షన్నర మంది స్వామివారిని దర్శించుకుంటున్నారని, ఉదయం 6.30 నుంచి రాత్రి 9.30 వరకూ రామ్‌లల్లాను నేరుగా దర్శించుకోవచ్చని తెలిపింది. ఆలయంలోకి ప్రవేశించడం నుంచి నిష్క్రమించే వరకూ మొత్తం ప్రక్రియ సరళంగా, సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. భక్తులు 60 నుంచి 75 నిమిషాల్లోనే సాఫీగా దర్శనం చేసుకోవచ్చని వెల్లడించింది. సమయాన్ని ఆదా చేయడంలో భాగంగా భక్తులు తమ మొబైల్ ఫోన్లు, చెప్పులు, పర్సులు తదితరాలను ఆలయ ప్రాంగణం వెలుపలే వదిలి రావాలని కోరింది. స్వామికి సమర్పించడానికి పూలు, పూలదండలు, ప్రసాదాలు తీసుకురావద్దని సూచించింది. స్వామివారికి నిత్యం తెల్లవారుజామున 4గంటలకు మంగళహారతి, ఉదయం 6.15గంటలకు శృంగార హారతి, రాత్రి 10గంటలకు శయన హారతి ఇస్తారని, వీటికి హాజరయ్యేవారికి ఎంట్రీ పాస్ అవసరమని పేర్కొంది. దానిపై భక్తుల పేరు, వయసు, ఆధార్ కార్డు, మొబైల్ నంబరు, ప్రాంతం వంటి వివరాలు తప్పనిసరిగా ఉండాలి. ట్రస్ట్ వెబ్‌సైట్‌లో ఈ వివరాలు సమర్పించి ఉచితంగా పాస్‌లు పొందవచ్చని సూచించింది.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి చెందారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం నారాయణగూడెంలో లింగారెడ్డి (56), ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం కప్పర్లలో అక్షయ్ (29) పొలంలో విద్యుదాఘాతానికి గురై చనిపోయారు.

అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయండి

- నా కుటుంబంపై దాడులు చేయిస్తున్నారు
- నన్నూ జైల్లో చంపించే ప్రయత్నం
- తెలంగాణ హైకోర్టులో దస్తగిరి పిటిషన్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో షరతులు ఉల్లంఘించిన కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి (ఏ8) బెయిల్ రద్దు చేయాలంటూ.. అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి (ఏ4) తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను సాక్ష్యం చెప్పకుండా ఉండేందుకు అవినాశ్‌రెడ్డి అన్ని రకాలుగా ఒత్తిడి తెస్తున్నారని.. తన కుటుంబీకులపై దాడులకు పురిగొల్పడంతో పాటు తనను కూడా చంపించేందుకు యత్నిస్తున్నారని దస్తగిరి పిటిషన్‌లో వెల్లడించారు. గతేడాది మే 31న కోర్టు అవినాశ్‌కు బెయిల్ మంజూరు చేసిందని.. దాన్ని రద్దు చేయాలని అభ్యర్థించారు. అవినాశ్ బెయిల్ ఎందుకు రద్దు చేయాలో వివరిస్తూ పలు కారణాలను దస్తగిరి పిటిషన్‌లో పేర్కొన్నారు. 'మరో కేసులో నేను జైల్లో ఉండగా మరో నిందితుడు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి జైలు లోపలికి రూ.20 కోట్లు తీసుకొని వచ్చాడు. నిందితులకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పవద్దంటూ ప్రలోభానికి గురిచేశాడు. సాక్షిగా తప్పుకుంటే నా పిల్లలు, కుటుంబ భవిష్యత్తును అవినాశ్, జగన్ చూసుకుంటారని చెప్పాడు. తన మాటలపై నమ్మకం లేకపోతే నేరుగా అవినాశ్, జగన్‌తో ఫోన్‌లో మాట్లాడిస్తానన్నాడు. సాక్షిగా తప్పుకోకపోతే నీ కుటుంబం ఉండదు అని చైతన్య రెడ్డి బెదిరించాడు..' అని పిటిషన్‌లో వివరించారు.

బొమ్మరాశిపేటపై భూ మాఫియా!

నాటి ప్రభుత్వ అండతో చెలరేగారు

- ధరణి లొసుగుల ఆసరాతో అన్యాయాలకు పాల్పడ్డారు
- బాధిత రైతులకు అండగా ఉంటాం
- ధరణి కమిటీ సభ్యుల హామీ
- కేసీఆర్, జగదీశ్‌రెడ్డి, సంతోష్‌రావుల పేర్లు చెప్పి బెదిరింపులకు పాల్పడ్డారు
- కమిటీ సభ్యులకు రైతుల ఫిర్యాదు


రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కోదండరెడ్డి

మేడ్చల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ధరణి వల్ల తలెత్తిన తీవ్ర కష్టాలకు, సమస్యలకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట ప్రాంత రైతుల బాధలు ఓ నిదర్శనమని ధరణి కమిటీ పేర్కొంది. వారి ఇబ్బందులు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేసింది. ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని భూ మాఫియా వారి భూములను లాక్కొని ఇబ్బందులకు గురి చేసిందని, బాధిత రైతులకు అండగా నిలుస్తామని తెలిపింది. ధరణి కమిటీ సభ్యులు ఏ కోదండరెడ్డి, భూమి సునీల్‌కుమార్.. గురువారం బొమ్మరాశిపేటలో నిషేధిత జాబితా భూములను సందర్శించి రైతులతో మాట్లాడారు. వారి నుంచి విజ్ఞాపనపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారులు, రాజకీయ నాయకులు ధరణిలోని లొసుగులను ఆసరాగా చేసుకుని రైతులను ఇబ్బందులకు గురిచేశారని, నాటి ప్రభుత్వ నిర్లక్ష్యంతో రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయని విమర్శించారు. ప్రతీ రైతుకు భూ హక్కులు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారని.. సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారాలను ప్రభుత్వానికి సూచిస్తామన్నారు. ఇప్పటికే చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లతో చాలా సమస్యలు పరిష్కారమయ్యాయని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఇక్కడ ఎంపీగా ఉన్నారని, బొమ్మరాశిపేట రైతుల ఇబ్బందులపై ఎంపీగా అప్పటి ప్రభుత్వానికి ఆయన ఒక లేఖ కూడా రాశారని వారు గుర్తు చేశారు. 50 ఏళ్లుగా సాగు చేస్తున్న పొలాలను బ్లాక్ లిస్టులో ఎలా పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను కాజేయటానికి భూ మాఫియా యత్నించిందని.. దాదాపు 300 మంది రైతులు రెండేళ్లుగా సమస్యలు ఎదుర్కొంటున్నారని, సమస్యల పరిష్కారానికి బొమ్మరాశిపేటలో స్పెషల్ డ్రైవ్ పెట్టేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ఆ కలెక్టర్.. పురుగులా చూసేవాడు!

గతంలో ఇక్కడ పని చేసిన కలెక్టర్ అమోయ్‌కుమార్, లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన శామీర్‌పేట తహసీల్దార్ సత్యనారాయణలతోనే తమకు సమస్యలు ఎక్కువగా ఎదురయ్యాయని కమిటీ వద్ద రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను చెప్పుకొందామని కలెక్టర్ వద్దకు వెళితే పురుగును చూసినట్లు చూసేవాడని, తమను పోలీస్ స్టేషన్‌లో పెట్టించాడని బోరుమన్నారు. తహసీల్దార్ సత్యనారాయణ లంచాలు తీసుకొని ఓఆర్‌సీలు రద్దు చేయడమే కాకుండా కొంతమందికి రిజిస్ట్రేషన్లు చేశాడని ఆరోపించారు. అప్పటి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ సంతోష్‌రావుల పేర్లు చెప్పి తమను కొందరు బెదిరింపులకు గురిచేశారని వాపోయారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న కమిటీ సభ్యులు తహసీల్దార్ యాదగిరిరెడ్డిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కోదండరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. భూ వ్యవహారాల్లో తహసీల్దార్లకే ఎక్కువ అధికారాలు ఉండాలని ప్రభుత్వానికి తమ కమిటీ సూచిస్తుందన్నారు.

సాగర్ మరమ్మతును అడ్డుకోవద్దు

- కృష్ణాబోర్డు, సీఆర్‌పీఎఫ్‌కు ఎన్డీఎస్ఏ ఆదేశం
- డ్యాం రిపేరుపై తెలుగు రాష్ట్రాలకు సూచనలు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు రక్షణ అంశంతో ముడిపడి ఉన్న పనులు, అత్యవసరంగా చేపట్టే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్‌ఎం) పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోవద్దని కృష్ణాబోర్డు, సీఆర్‌పీఎఫ్ బలగాలను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) ఆదేశించింది. సాగర్ రక్షణను పరిశీలించడానికి వీలుగా కేంద్ర జలశక్తిశాఖ ఎన్‌డీఎస్ఏ కమిటీని వేయగా.. ఆ కమిటీ ఫిబ్రవరి 13న డ్యామ్‌ను పరిశీలించింది. కట్టను పరిశీలించే క్రమంలో ప్రధానంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఓ అండ్ ఎం పనులకు అడ్డంకులు ఏర్పడుతున్నట్లు గుర్తించింది. ఈ మరమ్మతులను అడ్డుకోవద్దని కృష్ణాబోర్డుతో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలకు స్పష్టం చేసింది. వానాకాలంలోపే, ప్రాజెక్టుకు వరద వచ్చి చేరేలోపే ఓ అండ్ ఎం పనులన్నీ పూర్తిచేయాలని నిర్దేశించింది. గేట్లను ఎత్తడానికి వీలుగా ఉన్న గ్యాంట్రీ క్రేన్ రైల్ ట్రాక్ దెబ్బతిన్నట్లు గుర్తించిన ఎన్‌డీఎస్ఏ.. సత్వరం దాని పనులు పూర్తిచేయాలని స్పష్టం చేసింది. డ్యామ్ కట్ట భాగం.. కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాలతో పాటు పలు భాగాలను ఎన్‌డీఎస్ఏ పరిశీలించింది. నివేదికను గురువారం తెలుగు రాష్ట్రాలకు పంపించింది.

డ్యామ్ సేఫ్టీ కమిటీ సిఫారసులు..

- కౌంటర్ వెయిట్‌ల వద్ద పిల్లర్లలో కొన్ని పగుళ్లు ఉన్నాయి. అన్ని పిల్లర్లను సమగ్రంగా పరిశీలించాలి.
- స్పిల్‌వే(నీరు జారే ప్రాంతం)లో రంధ్రాలు ఉన్నాయి. వాటిని కాంక్రీట్‌తో నింపాలి.
- స్పిల్‌వే దిగువ భాగంలో రాళ్లు బయటికి తేలి కనిపిస్తున్నాయి. ఆ రాళ్లను సరిచేసి, మరమ్మతులు చేయాలి.
- స్పిల్‌వే నుంచి నీరు జారి కింద పడే ప్రదేశం (ఫ్లిప్ బకెట్)లో భారీగా గుంతలున్నాయి. వాటికి వానాకాలంలోపే మరమ్మతులు చేయాలి.
- గ్యాలరీలో సీపేజీలను అంచనా వేయాలి. పునాది నుంచి వస్తున్న సీపేజీలకు కారణాలేంటో తేల్చాలి.
- గ్యాలరీలోకి వెళ్లే మార్గంలో మెట్లు సరిగ్గా లేవు. గ్యాలరీని పరిశీలించడానికి తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలి.
- కట్టలో జరిగే మార్పులపై ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చే రెసిస్టెన్స్ థర్మోమీటర్, ప్లంబ్ లైన్, వీ-నాచ్స్, స్ట్రెస్ మీటర్లు, అప్‌లిఫ్ట్ ప్రెషర్ సెల్స్‌లు ఉన్నా.. వాటిలో కొన్ని పనిచేయడం లేదు. అవన్నీ పనిచేసేలా చూసుకోవాలి.
- కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో భారీగా సీపేజీ ఉంది. దాని నివారణకు చర్యలు తీసుకోవాలి.
- కట్ట, కాలువల్లో గడ్డితో పాటు ఇతర వ్యర్థాలను తొలగించాలి.

నాది ఉత్తుత్తి నొక్కుడే!

- వారం తర్వాత ఖాతాల్లోకి ఈబీసీ నేస్తం డబ్బులు
- బనగానపల్లెలో బటన్ నొక్కుతూ సెలవిచ్చిన ఏపీ సీఎం జగన్



నంద్యాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మరో నాలుగురోజుల్లో ఎన్నికల కోడ్ వస్తుంది. ఆ తర్వాత తమ ప్రభుత్వం వస్తుందో రాదోనన్న అనుమానం. ఈ లోపు ప్రజలను ఎలా మభ్యపెట్టాలా అని ఆలోచించిన ఏపీ సీఎం జగన్.. ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు మూడో విడత బటన్ నొక్కే కార్యక్రమాన్ని ఎంచుకున్నారు. బనగానపల్లెలో గురువారం సభ ఏర్పాటు చేసి..... రూ.629కోట్లు జమ చేస్తున్నామంటూ ప్రచా రం చేశారు. తన పత్రికలో రూ.కోటిన్నర విలువైన ప్రకటనలు గుప్పిస్తూ ఇదే డబ్బా వాయించుకున్నా రు. దీంతో జగన్ బటన్ నొక్కగానే తమ ఖాతాల్లో డబ్బులు పడతాయని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూశారు. కానీ, లబ్ధిదారులకు ఆయన చావు కబురు చల్లగా చెప్పారు. ప్రస్తుతం బటన్ మాత్రమే నొక్కుతున్నానని,, డబ్బులు మరో వారంరోజుల తర్వాత పడతాయని చెప్పారు. ఖాతాల్లో డబ్బులు పడని ఈ వారం రోజులూ ఆంధ్రజ్యోతి, ఈనాడు వంటి పత్రికలు, చానళ్లు చూడవద్దంటూ ఉచిత సలహా కూడా ఇచ్చారు. దీంతో జగన్ తీరును చూసి లబ్ధిదారులు ముక్కున వేలేసుకున్నారు. కాగా, ఈబీసీ నేస్తం పథకం ద్వారా 4,19,583 ఓబీసీ అక్కాచెల్లెమ్మలకు స్వావలంబన కలిగిస్తున్నట్టు చెప్పారు. గత 58 నెలల్లో 99 శాతం హామీలను అమలు చేశామంటూ ప్రజలను మభ్యపెట్టే యత్నం చేశారు. పైగా మళ్లీ తను అధికారంలోకి రాకపోతే ప్రస్తుత పథకాలు, అందే డబ్బులు అన్నీ ఆగిపోతాయని ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేశారు. మిగతా పార్టీలన్నీ పచ్చి దగాకోరు పార్టీలని, తాను, తన పార్టీ మాత్రమే మంచి దని, అమాయకులమని వ్యాఖ్యానించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

హైకోర్టు హెచ్చరిక

తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ముంచుకువస్తున్న నీటి ఎద్దడి ముప్పును రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం గుర్తించి అధికార యంత్రాంగాన్ని హెచ్చరించడం సకాలంలో వెలువడిన మేలుకొలుపు. పోయిన వర్షాకాలంలో తగినంత వర్షపాతం లేనందువల్ల, ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయన్న సూచనల వల్ల, రానున్న రోజులలో మంచినీటి ఎద్దడి, విద్యుచ్ఛక్తి కొరత కూడా తెలంగాణను బాధించవచ్చునని భావిస్తున్నారు. జలసంరక్షణ చర్యలు తీసుకోవాలని, ఇంకుడుగుంతలు లేని నిర్మాణాల మీద చర్యలు తీసుకోవాలని, తెలంగాణ జల, భూ, వృక్ష చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు దీర్ఘకాలికంగా దుర్భిక్ష పరిస్థితులను, తాగునీటి ఎద్దడిని నివారించడానికి అనుసరించవలసినవి. సామాజిక బాధ్యతను నెరవేర్చని నిర్మాణ సంస్థలను, పౌరులను ఈ కొరతల సమయంలో అయినా మందలించడం అవసరం.

వర్షాభావ పరిస్థితుల కారణంగా దాదాపుగా దుర్భిక్షమనదగ్గ పరిస్థితి నెలకొన్నదని, అందువల్ల తీవ్రమైన నీటి ఎద్దడి ఎదురుకానున్నదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా అంగీకరించారు. నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల రైతులు వ్యవసాయ అవసరాల కోసం రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయమని డిమాండ్ చేస్తున్నా, సానుకూలంగా స్పందించగలిగే పరిస్థితులు లేవు. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో పోయిన ఏడాది ఇదే సమయంలో సుమారు 200 టిఎంసిల నీరు విడుదలకు అందుబాటులో ఉండగా, ఇప్పుడు 140 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. శ్రీశైలం రిజర్వాయర్‌లో పోయిన సంవత్సరం ఇదే సమయంలో 42 టిఎంసిలు విడుదలకు వీలుగా ఉండగా, ఇప్పుడు కేవలం 36 టిఎంసిలు మాత్రమే అందుబాటులో ఉంది. శ్రీశైలం నీటి విడుదల విద్యుత్ అవసరాలతో ముడిపడి ఉంటుంది. ఉభయ రాష్ట్రాలకు చెందిన జల అవసరాలను తీర్చవలసి వచ్చే ఆ రెండు రిజర్వాయర్ల నీటిని ఆచితూచి వినియోగించుకోవలసి ఉంది. జంటనగరాలకు మంచినీరు అందించే ఐదు ప్రధాన రిజర్వాయర్లలో నీటి అందుబాటు పోయిన సంవత్సరం కంటె రెండు టిఎంసిలు తక్కువగా ఉంది. ఇంకా తీవ్రమైన ఎండాకాలం ముందే ఉన్నది. నీటి అవసరాలు, ఉష్ణోగ్రతలు కలిసి చెరువులు త్వరత్వరగా ఖాళీ అవుతాయి. మార్చి మొదటి వారంలో ఒకరోజు 30 కోట్ల యూనిట్ల విద్యుత్ వినియోగాన్ని ఉత్తర, దక్షిణ తెలంగాణ డిస్కమ్‌లు నమోదు చేశాయి. బోర్ల వినియోగం, గృహ విద్యుత్ వినియోగం పెరిగిపోతున్నాయి. తగినంతగా విద్యుత్‌ను సమీకరించి, అవసరాలను తీర్చవచ్చును కానీ, నిర్వహణా క్రమంలో అయినా కొన్ని సరఫరా అంతరాయాలు లేకుండా ఉండవు. జలసంరక్షణలో దీర్ఘకాలికమైన అలక్ష్యానికి తోడు, ఇటీవలి వర్షాభావ పరిస్థితులను రాజకీయాలకు ఆపాదించడం వాంఛనీయం కాదు. తాము అధికారంలో ఉంటే పరిస్థితి ఇట్లా ఉండేది కాదని ప్రతిపక్ష నాయకుడు వ్యాఖ్యానించడం సరికాదు. చేయగలిగినంత చేస్తామని, కొద్దిపాటి అసౌకర్యాలను రైతాంగం, నగరపౌరులు అర్థం చేసుకోవాలని ప్రభుత్వం చెబుతున్నది.

ఎన్నికల సీజన్‌లో నీటికి కరెంటుకు కొరతలు కోతలు ఎదురు కావడం ప్రభుత్వాలకు పెద్ద పరీక్ష. బెంగుళూరు మహానగరంలో నీటి కటకట వల్ల ఐటి పరిశ్రమ ఆఫీసులు మూతబడే పరిస్థితి నెలకొన్నది. గ్రామీణ ప్రాంతాల పరిస్థితి కొంత మెరుగే కానీ, అక్కడా ఎంతో కాలం ఉదారంగా నీటివినియోగం కుదరదు. కర్ణాటకలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఈ నీటి ఎద్దడికి ముడిపెట్టి చూడడం సహజం. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం ఎలాగైనా కొరతలు తగ్గించాలని ప్రయత్నం చేయడమూ సహజం. రాజకీయమైన పోటీలో, ఉద్వేగపూరితమైన ప్రకటనలు కూడా వింటుంటాము. తమిళనాడుకు కావేరి నీరు ఒక్కచుక్క కూడా ఇచ్చేది లేదని కర్ణాటక నేతలు చేస్తున్న ప్రకటనలు, ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నమే. నిజానికి హైదరాబాద్‌లో లాగానే బాధ్యతారహితమైన పట్టణీకరణ, పర్యావరణ విలువలను ఖాతరు చేయని నిర్మాణాలు బెంగుళూరు పరిస్థితికి కూడా కారణాలు. దీర్ఘకాలికంగా బెంగుళూరు చూపిన నిర్లక్ష్యమే దాని ప్రస్తుత దుస్థితికి కారణమని తెలంగాణ హైకోర్టు భావించడం అందుకే.


పరిపాలనలో కానీ, విధాన నిర్ణయాలలో కానీ తాత్కాలిక వాదం పనికిరాదు. సుస్థిరమైన అభివృద్ధి విధానాలు, సమర్థవంతమైన వినియోగం ఉండేవిధంగా వివిధ వనరుల వాడకం, దీర్ఘకాలిక ప్రభావాల గురించిన అవగాహన ప్రభుత్వాలకు అవసరం. వరదలు, కరువులు వచ్చినప్పుడు మాత్రమే గుండెలు బాదుకుంటే ఉపయోగం లేదు. ప్రతి వర్షాకాలం మహానగరాలలో నివాసప్రాంతాలు మునిగిపోతున్నాయి. ప్రతి దుర్భిక్ష సందర్భంలోనూ నోళ్లు చేలూ ఎండిపోతున్నాయి. ఈ పరిస్థితి మారాలి. జవాబుదారీతనం లేని పట్టణీకరణను నియంత్రించాలి. అధికంగా నీరు, విద్యుత్ అవసరమయ్యే పంటలను నిరుత్సాహపరచాలి. రైతులైనా, వ్యాపారులైనా, సాధారణ పౌరులైనా తమ తమ బాధ్యతను తెలుసుకుని నేలను, నీటిని, అన్ని ప్రకృతి వనరులను సంరక్షించాలి.

పురావస్తు ప్రయాణంలో మన రామకథే వేరు!

ప్రతి దేశానికి విషమ పరీక్షలు ఉంటాయి. సుదీర్ఘ చరిత్ర కలిగిన భారత్‌కు అవి ఇంకా ఎక్కువ. చరిత్ర గతిని మార్చిన ఘటనలు ఎప్పుడు జరిగాయి? రాజ్య వ్యవస్థ ఎప్పుడు ప్రారంభమైంది? ఏ మతం ఎప్పుడు ఉనికిలోకి వచ్చింది? మత గ్రంథాల సంకలనం ఎప్పుడు జరిగింది? కులం ఎప్పుడు మొదలైంది? దేవాలయాలకు బీజం ఏ శతాబ్దిలో పడింది? వ్యవసాయం ఎప్పుడు ఆరంభమైంది? వేద కాలం నాటి ప్రముఖ దేవుళ్ల ప్రాభవం ఎప్పుడు కొడిగట్టింది? యజ్ఞయాగాదుల ప్రాధాన్యం ఎప్పుడు పోయింది? విగ్రహారాధన ఎప్పుడు మొదలైంది? కర్మ సిద్ధాంతానికి పునాదులు ఎప్పుడు పడ్డాయి? ఇలాంటి ప్రశ్నలన్నీ కాల నిర్ణయాన్ని కోరతాయి. అంటే.. ఏది ఎప్పుడు మొదలైందో.. ఆధునిక సామాజిక శాస్త్రాల ఆసరాతో నిర్ణయించటం అన్నమాట. అది సహేతుకంగా, చారిత్రక దృష్టితో జరిగితే తర్వాతి పరిణామాలు కాస్త తేలికగా అర్థం అవుతాయి.

మన చరిత్రలో కాల నిర్ణయమే ఒక విషమపరీక్ష. కీలక సంఘటనలను సంవత్సరాల వారీగా నమోదు చేయటం చాలా అరుదు. హర్షచరిత్ర ఆధారంగా అతని రాజ్య సరిహద్దులను తెలుసుకోలేం. పాలనా సంగతులను కచ్చితంగా పసిగట్టలేం. కావ్య రచనలు చేసిన రాజులు కూడా లౌకిక రచనలకు ప్రాధాన్యం ఇవ్వలేదు. కొన్నేళ్లనాటి సంప్రదాయాలను వేలయేళ్ల నాటివిగా భావించటం మనకు అలవాటు. కొబ్బరి కాయ లేని పూజలను ఊహించలేం. కాని అదెప్పుడు మనదేశంలోకి వచ్చిందో ఏ గ్రంథంలోనూ నిర్దిష్టంగా ఉండదు. మలేసియా నుంచి 2000 ఏళ్లనాడు ఇక్కడకు వచ్చిందనే అంచనాలు ఉన్నాయి. ఎక్కడ నుంచో వచ్చిన కొబ్బరికాయకు పూజా కార్యక్రమాల్లో అంత ప్రాధాన్యత ఎందుకు వచ్చిందన్న ప్రశ్నకు జవాబులు వెతకటానికి చారిత్రక దృక్పథం ఉండాలి. అన్నిటికీ మనమే మూలకర్తలమనే దుర్భ్రమను వదులుకునే విశాలత కావాలి. మన గురించి మనకు సమగ్రంగా అర్థం కావాలన్నా, మన సంప్రదాయాల పుట్టుపూర్వోత్తరాలు తెలియాలన్నా కాలనిర్ణయమే కీలకం. ఇప్పుడది కూడా రాజకీయాల్లో పావుగా మారిపోతోంది. హిందూ 'స్వర్ణయుగం'లో కాలనిర్ణయం చేయాల్సిన సంగతులే లేవనే వాతావరణం నెలకొంటోంది. పురావస్తుశాస్త్ర తవ్వకాల ఆధారంగా జరిగే కాలనిర్ణయాన్ని మసీదులకు, దర్గాలకు మాత్రమే పరిమితం చేసి, అక్కడ ఒకనాడు ఆలయాలు ఉండేవో లేవో తేల్చితే సరిపోతుందన్న వాదనలు బలపడుతున్నాయి. కోర్టుల్లో పిటిషన్లూ అందుకోసమే పడుతున్నాయి.

పురావస్తు తవ్వకాలతో అనేక దేశాల చరిత్రలు సమగ్రంగా తెలిశాయి. మహాకావ్యాల్లో వర్ణించిన సంఘటనల నిజానిజాలు వెల్లడయ్యాయి. మత గ్రంథాల్లో పేర్కొన్న ప్రళయాలపై కొత్త వెలుగులు ప్రసరించాయి. బైబిల్‌లో పేర్కొన్న ఘటనల ఆధారంగా ఆయా ప్రాంతాల్లో తవ్వకాలను చేపట్టి వాటిల్లో వాస్తవికత ఎంతో తెలుసుకోటానికి ప్రయత్నాలు జరిగాయి. మన దేశంలో అలాంటి ప్రయత్నాలు జరగలేదా? అంటే కొన్ని జరిగాయని చెప్పుకోవచ్చు. రామాయణ సంఘటనల గురించి జరిగిన ప్రయత్నం అందులో ఒకటి. 50 ఏళ్ల క్రితం ఆ దిశగా కృషిచేసిన వారిలో హెచ్.డి.సంకాలియా ఒకరు. పురావస్తు పరిశోధనల్లో సంకాలియాది అగ్రస్థానమనే చెప్పాలి. ఆయన రచనలు చదవకుండా భారత పురావస్తు విజ్ఞానం



చరిత్ర పునర్నిర్మాణానికి ఎన్నో శాస్త్రాల సహాయం కావాలి. వాటి నుంచి వచ్చిన విజ్ఞానం, విశ్లేషణా పద్ధతులతో మహాకావ్యాల పరిణామాలు స్పష్టంగా తెలుస్తాయి. ఆది గ్రంథాలపై అవగాహనా పరిధి పెరుగుతుంది. వాటి ప్రయాణాల్లో జరిగిన చిత్రవిచిత్రాలు మనసుల్లో నాటుకుంటాయి. మహాకవుల కల్పనా చాతుర్య లోతులూ కనపడతాయి. మొత్తంగా మన వివేచనా శక్తే విస్తరిస్తుంది.

గురించి ఓనమాలు తెలుసుకోలేం. 1972లో 'రామాయణ ఎ మిత్ ఆర్ రియాలిటీ' అన్న చిన్న పుస్తకాన్ని తీసుకువచ్చారు. ఆ తర్వాత మరో పదేళ్లకు పరిశోధనను విస్తరించి 'ద రామాయణ ఇన్ హిస్టారికల్ పర్స్‌పెక్టివ్' మరో గ్రంథాన్ని ప్రచురించారు. మహాకావ్యాన్ని సృష్టించిన మహాకవి సైతం తననాటి కాల ప్రభావం నుంచి తప్పించుకుని అన్నీ వర్ణనలూ చేయలేరన్న భావనతో రామాయణాన్ని సంకాలియా విశ్లేషించారు. దేశంలో నలుమూలల నుంచి సేకరించిన రామాయణ ప్రతులను (సంస్కృత, ప్రాంతీయ భాషల్లోనివి) పరిశీలించి, సరిపోల్చి బరోడాలో పండితులు మౌలికప్రతిని (క్రిటికల్ ఎడిషన్) రూపొందించారు. దానితో పాటు ఇతర భాషల్లోని రామాయణాలను సంకాలియా అధ్యయనం చేశారు. పురావస్తు శాస్త్ర ఆధారాలతో రామాయణంలోని సంఘటనల వాస్తవికతను అంచనా వేశారు. రామాయణ గాథలు ఎప్పటి నుంచో ఉన్నాయి. కానీ 1020 కంటే ముందునాటి రామాయణ ప్రాచీన ప్రతి ఏదీ దొరకలేదు. ఆ ప్రతి ప్రకారం చూస్తే రామాయణంలోని ప్రధాన వర్ణనలన్నీ క్రీ.శ. 500ల నాటికి నిశ్చిత రూపాన్ని సంతరించుకున్నాయి. ఆ తర్వాత కూడా చాలా విషయాలు రామాయణంలో చేరాయి. 'ద రామాయణ ట్రెడిషన్ ఇన్ ఏషియా' అన్న పుస్తకంలో ఈ విశేషాలన్నీ దొరుకుతాయి. సంస్కృతంలో లేని ఎన్నో ఉప కథలు తెలుగు రామాయణాల్లో చేరాయి. రాముడి పుట్టిన రోజును కూడా కొన్ని భిన్నంగా పేర్కొన్నాయి.



■ రాహుల్ కుమార్

సంకాలియా పరిశీలనలు చాలా ఉన్నా వాటిల్లో కొన్నిటిని మాత్రమే చెప్పుకోగలం. అవేంటో చూద్దాం.. రామాయణంలో అయోధ్య, కిష్కింధ, లంకా నగరాల గురించి వర్ణనలు వివరంగా ఉన్నాయి. త్రికూట పర్వతం మీద లంక ఉంది. అది సాగరంలో ఉన్నట్టు వర్ణించారు. లంక చుట్టూ రక్షణ ప్రాకారం, కందకాలు ఉన్నాయి. లోపల తోరణ ద్వారాలూ ఉన్నాయి. ప్రాకారం, తోరణాలను స్వర్ణమయంగా వర్ణించారు. ఏడెనిమిది అంతస్తుల భవనాలు ఉన్నట్టు కూడా పేర్కొన్నారు. భవన స్తంభాలూ బంగారంతో చేసినవే. వాటికి ముత్యాలూ కూడా పొదిగారు. అశోకవనానికీ ప్రాకారం ఉంది. వేయి స్తంభాల మందిరమూ అందులో ఉంది. ఇలాంటి ఛాయలున్న నగరం ప్రపంచంలో ఏ తవ్వకాల్లోనూ బయటపడలేదు. లంకా వర్ణనను కాల్పనిక సృష్టిగానే భావించినా దానికీ నిజ జీవితంలో ఏదైనా ఆధారం ఉండాలి కదా? కుషాణులు-గుప్తుల కాలంనాటి నగరాలను ప్రేరణగా తీసుకుని ఊహలకు పదునుపెట్టి లంక, కిష్కింధలను ఎక్కడికో తీసుకు వెళ్లారు. బళ్లారి ప్రాంతంలో కాకుండా వింధ్య పర్వత అటవీ ప్రాంతంలోనే కిష్కింధ ఉండేది. ఇక కిష్కింధ నగరం చిత్రణ కూడా అన్ని హద్దులూ దాటింది. రాజ పథాలు, విపణి వీధులు, కైలాసాన్ని అంటే భవనాలు, స్వర్ణ సింహాసనాల్లాంటివి బోలెడున్నాయి. కిష్కింధ వాసులు సవరులై ఉండొచ్చు. భోపాల్ చుట్టుపక్కల సహజంగా ఉండే గుహల్లోనే వారు జీవించేవారు. కొన ప్రాణంతో ఉన్నప్పుడు వాలి అన్నమాటలు చూస్తే కిష్కింధ వర్ణన ఎంత అసహజమో అర్థం అవుతుంది. అడవుల్లో ఆహారాన్ని ఏరుకుంటూ బతికే నన్ను ఎందుకు చంపావు? అంటూ వాలి రాముడిని ప్రశ్నిస్తాడు. చెట్లకొమ్మలను, రాళ్లను మాత్రమే వానరులు ఆయుధాలుగా వాడారు. విల్లంబులు చేపట్టలేదు. మానవ నిర్మిత ఆయుధాలేవి వారు వాడలేదు. వాలి భౌతికకాయాన్ని ఆర్యకర్మలతో దహనం చేసినట్లు వర్ణించారు. గోదావరి నది ఇవతల ప్రాంతంలో శవాలను పూడ్చిపెట్టటమే అనాది సంప్రదాయం. దీని ప్రకారం చూసినా కిష్కింధ బళ్లారి ప్రాంతంలో ఉందని భావించలేం.

అయోధ్య పరిసర భౌగోళిక వర్ణన కాస్త సమంజసంగా ఉంది. సరయూనది, సమీప నగరాల ప్రస్తావనలు ఇందుకు ఉదాహరణలు. కానీ నగర జీవితాన్ని వాస్తవికంగా వర్ణించారని చెప్పలేం. అద్భుత శక్తులున్న దేవుళ్లు, రుషులు, మనుషుల విన్యాసాలకే ఆనాటి సాహిత్యంలో చోటు ఎక్కువ. రామాయణంలో ప్రస్తావనకు వచ్చిన ఆయుధాలన్నీ ఇనుంతో తయారైనవే. ఇనుం వాడకం క్రీ.పూ. 1000కు కాస్త అటూ ఇటూగా మొదలైంది. కైకేయిది ఆయస(ఇనుం) హృదయమన్న వ్యాఖ్యను చూస్తే ఇనుం వాడకం బాగా స్థిరపడిందని తెలుస్తుంది. రామాయణానికి స్పష్టరూపం ప్రధానంగా ఈ యుగంలోనే ఏర్పడింది. రాముడి వనవాస వార్త విని కౌసల్య మూర్ఛబోయి పడిపోతుంది. అప్పుడు ఆమె శరీరానికి దుమ్ముధూళి అంటుకుందన్న వర్ణనను చూస్తే ఆనాటి ఇళ్లు మట్టితో కట్టినవిగా భావించొచ్చు. సీత ధరించిన పట్టు వస్త్రం ప్రస్తావన బట్టి ఆ వర్ణన ఎప్పుడు చేరిందో మనకు తెలుస్తుంది. క్రీస్తుశకం తొలినాళ్లలోనే పట్టు వస్త్రాలు చైనా నుంచి వచ్చాయి. రామ అనే అక్షరాలున్న ఉంగరాన్ని హనుమంతుడికి రాముడు ఇచ్చిన సంఘటన కూడా ఒక కాలాన్ని చెబుతుంది. అక్షరాలు, గుర్తులు ఉండే ఉంగరాల వాడకం ఇండో-గ్రీకు పాలకుల కాలంలోనే వాడకంలోకి వచ్చాయి. సాల వృక్షాల ప్రస్తావన రామాయణంలో చాలా కీలకం. వీటి ఆధారంగా లంక, దండకారణ్య స్థల నిర్ధారణలను చేయగలం. ఏడు సాలవృక్షాలను చీల్చుకు వెళ్లిన రామబాణ ప్రయోగం అందరం విని ఉంటాం. దేశ వృక్ష జాతుల చరిత్రను పరిశీలిస్తే సాల వృక్షాలు చోటానాగ్‌పూర్ పీఠభూమిలో తప్ప మరెక్కడా ఉండని విషయం తెలుస్తుంది. లంకగా పేర్కొన్న ప్రాంతం కూడా చోటానాగ్‌పూర్ ప్రాంతంలోనే ఉండొచ్చు. జబల్‌పూర్‌కు దగ్గరలో ఉండేదే లంకా ప్రాంతం! అక్కడి సహజ తటాకాన్నే సముద్రంగా భావించి కల్పనచేసి ఉండొచ్చు. రామేశ్వరం దగ్గర సేతు నిర్మాణం కూడా కల్పనే! సేతు నిర్మాణం కోసం వానరులు తెచ్చిపడేసినట్లు పేర్కొన్న వృక్ష జాతులు ఆ ప్రాంతంలో ఎప్పుడూ లేవు. పెద్దరాళ్లు దొరికే అవకాశమూ రామేశ్వరంలో లేదు. అసలు వింధ్యను రాముడు దాటాడన్న విషయాన్ని భౌగోళికంగా నిర్ధారించలేం. రావణుడు గోండు జాతికి చెంది ఉండొచ్చు. ఇక్ష్వాకు వంశం తన పాలనను విస్తరించే క్రమంలో రావణుడితో గొడవవచ్చి ఉంటుంది. ఆ గొడవే సీతాపహరణకు కారణం కావొచ్చు. బహుభార్యాత్వం ఉన్న చోట వారసత్వ తగాదాలు సహజం. రాముడి వనవాసం అట్లా సంభవించిందే. రామాయణ మూల కథను అయోధ్య పరిసర ప్రాంతాల్లో స్థానిక కవులు గానం చేసేవారు. వాల్మీకి ఆ కథను మహాకావ్యంగా మలచాడు.

చరిత్ర పునర్నిర్మాణానికి ఎన్నో శాస్త్రాల సహాయం కావాలి. వాటి నుంచి వచ్చిన విజ్ఞానం, విశ్లేషణా పద్ధతులతో మహాకావ్యాల పరిణామాలు స్పష్టంగా తెలుస్తాయి. ఆది గ్రంథాలపై అవగాహనా పరిధి పెరుగుతుంది. వాటి ప్రయాణాల్లో జరిగిన చిత్రవిచిత్రాలు మనసుల్లో నాటుకుంటాయి. మహాకవుల కల్పనా చాతుర్య లోతులూ కనపడతాయి. మొత్తంగా మన వివేచనా శక్తే విస్తరిస్తుంది.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

బెంగళూరు 'జల' పాఠాలు

కొన్ని సంవత్సరాల క్రితం మేము (సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్) ప్రచురించిన 'ఎక్స్‌క్రీటా మేటర్స్ ఇన్ బెంగళూరు' అనే నివేదిక విడుదల సందర్భంగా ఆ మహానగర నీటి సరఫరా, వ్యర్థ పదార్థాల నిర్వహణకు బాధ్యులైన ఉన్నతాధికారులతో సంబంధిత అంశాలపై చురుగ్గా చర్చించాను. ముఖ్యంగా ఆ నగరంలో నీటి సరఫరా నిర్వహణ విషయమై మా మధ్య తీవ్ర వాద ప్రతివాదాలు జరిగాయి. మా పరిశోధనలో బెంగళూరు నగరంలో నీటి సరఫరా వ్యయాలు భరించలేని విధంగా ఉన్నాయని, అంతేకాకుండా ప్రస్తుతమున్న సరఫరా సదుపాయాలు సుదీర్ఘ కాలం స్థిరంగా నిర్వహించలేని విధంగా ఉన్నట్టు వెల్లడయిందని నేను చెప్పాను. నా అభిప్రాయంతో ఆ ఉన్నతాధికారులు (సివిల్ ఇంజనీర్లు) ఏకీభవించలేదు. వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న కావేరీ నది నుంచి పైప్‌లైన్స్ ద్వారా నగరానికి నీటిని తీసుకువస్తున్నామని, కలవరపడాల్సిన అవసరమేమీ లేదని వారు వాదించారు. సరే, ఇప్పుడు ఈ హైటెక్ సిటీ తీవ్ర నీటి ఎద్దడితో సతమతమవుతోంది. ఈ సమస్య మరింతగా విషమించనున్నది. మరి భారతదేశ అత్యంత అధునాతన నగర నీటి సరఫరా బాధ్యత నిర్వహిస్తున్న ప్రాజ్ఞులు, తాము అమలుపరుస్తున్న నీటి సరఫరా పథకాలపై పునరాలోచించి, వాటికి ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందిస్తారా? బహుశా..! అని మాత్రమే అనుకోవల్సి వున్నది.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

మహానగరాలలోని ప్రజలకు, పరిశ్రమలకు అవసరమైన నీటిని (బాగా ఖర్చుతో కూడిన) అధునాతన ఇంజనీరింగ్ పరిష్కారాల ద్వారా సమృద్ధిగా సరఫరా చేయవచ్చన్న విధానకర్తల కలలు కరిగిపోతున్నాయి; నిర్దేశిత విధానాలకనుగుణంగా పథకాలు రూపొందించి, అమలుపరిచే ప్రభుత్వాధికారుల కృషి ఫలించడం లేదు. ఈ విపత్కర పరిస్థితికి బెంగళూరు నగరం అద్దం పడుతోంది. ఈ జల సంక్షోభానికి ఆ నగరం మొదటిదీ కాదు, చివరిదీ కాబోదు.

బెంగళూరు మహానగరానికి సుదూర గతంలో అనేక సరస్సుల నుంచి నీటి సరఫరా జరుగుతూ ఉండేది. నగర పరిధిలోని ఆ సరస్సులన్నిటినీ వాన నీటిని భద్రపరిచేందుకు, వరదలను నివారించేందుకు సృష్టించారు. కాలక్రమేణా నగరం విస్తరించింది. జనాభా పెరిగింది. నగర నీటి అవసరాలను సరస్సులు తీర్చలేని పరిస్థితి వచ్చింది. దీంతో 1974లో కావేరీ నదీ జలాల సరఫరా పథకాన్ని రూపొందించారు. ఈ పథకంలో భాగంగా తొలుత కావేరీ నది నుంచి నీటిని 490 మీటర్ల ఎత్తుకు పంపింగ్ చేస్తారు. అక్కడ నుంచి 100 కిలోమీటర్లకు పైగా ఆ నీటిని రవాణా చేసి నగర ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. నగర ఇంజనీర్లతో నేను జరిపిన చర్చల్లో ఆ ఇంజనీరింగ్ అద్భుతం నాల్గవ దశను అమలు పరచడంలో నిమగ్నమై ఉన్నారని అర్థమయింది. నేను ముందే చెప్పినట్టు నగరంలో సంభావ్య నీటి కొరత గురించి కలవరపడేందుకు సరైన కారణమేదీ వారికి కనిపించలేదు మరి.

ఇంజనీర్లు కొన్ని వాస్తవాలను నిర్లక్ష్యం చేస్తున్నారని కూడా నేను నిష్కర్షగా చెప్పాను. అవి: (1) బెంగళూరు నగరంలోనూ, పరిసర ప్రాంతాలలోనూ భూగర్భ జలాల వినియోగం అంతకంతకూ పెరుగుతోంది. దీన్నిబట్టి నీటి సరఫరా సరైన విధంగా, సంపూర్ణంగా జరగడం లేదనేది స్పష్టమయింది; (2) నగరం భౌగోళికంగా విస్తరిస్తోంది. ఈ విస్తరణతో పాటు జనాభా కూడా పెరుగుతోంది. గతంలో ఎన్నడో నిర్మించిన మురికి నీటిపారుదల వ్యవస్థలు విస్తరిస్తోన్న నగరం, పెరుగుతోన్న జనాభా అవసరాలకు అనుగుణంగా లేవు; (3) ఉత్పాదితమవుతోన్న మురుగునీరు, వ్యర్థ పదార్థాలను శుద్ధి చేయడం లేదని నగర పాలనాధికారులే ఒప్పుకుంటున్నారు. దీనివల్ల నగరంలోని సరస్సులు, చెరువులు, వివిధ నీటి వనరులు కలుషితమై పోతున్నాయి.

నేను ఎత్తి చూపిన ఈ వాస్తవాలను కూడా ఆ ఇంజనీర్లు సీరియస్‌గా తీసుకోలేదు. అవేమీ పెద్ద సమస్యలు కావని, కాబోవనే ధీమాను వారు వ్యక్తం చేశారు. భవిష్యత్తు అంతా చక్కగా ఉంటుందని పరిపూర్ణ ఆశాభావం వారిలో నిండుగా కనిపించింది. రోజుకు 720 మిలియన్ లీటర్ల (ఎమ్ఎల్‌డి) మురుగు నీటిని శుద్ధి చేసే సామర్థ్యం నగర పాలనా వ్యవస్థకు ఉన్నదని వారు ఘనంగా చెప్పుకున్నారు. అత్యంత అధునాతన సాంకేతికతలు తమకు అందుబాటులో ఉన్నాయని, అవి పెద్ద ఎత్తున ఉత్పాదితమవుతోన్న వ్యర్థ పదార్థాలను పూర్తిగా శుద్ధి చేయగలుగుతాయని వారు గొప్పగా చెప్పారు.

సరే, ప్రస్తుత పరిస్థితులకు వద్దాం. 2010 సంవత్సరంలో బెంగళూరు నగర దినసరి అవసరాలు 1,125 మిలియన్ లీటర్లు కాగా ఇప్పుడది రోజుకు 2600 మిలియన్ లీటర్లకు పెరిగింది. ఈ అవసరాలలో సగ భాగాన్ని కావేరీ నది తీరుస్తోంది. మిగతా సరఫరాలకు భూగర్భ జలాలపై ఆధారపడుతున్నారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే నగర నీటి అవసరాలు పూర్తిగా తీరడం లేదు. దీంతో నగర వాసులు నీటిని సమకూర్చుకునేందుకు బోర్‌వెల్స్‌ను స్వయంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. వర్షపాతంలో అస్థిరత్వం బాగా పెరిగిపోవడంతో కొత్తగా ఏర్పాటు చేసుకున్న నీటి వనరులు శీఘ్రగతిన ఎండిపోతున్నాయి. అయినా ప్రాజ్ఞులైన నగర ఇంజనీర్లు సంక్షోభాన్ని అర్థం చేసుకున్నట్టుగా లేదు. వారు ఇంకా తమ పాత కలలే కంటున్నారు. త్వరలో ప్రారంభమవనున్న కావేరీ ప్రాజెక్టు ఐదవ దశతో నీటి సరఫరాకు సంబంధించిన సమస్త సమస్యలు పరిష్కారమై పోతాయని నగర చీఫ్ ఇంజనీర్ ఎంతో నమ్మకంగా చెప్పారు.

మురుగునీటి వ్యవస్థల కథ కూడా నీటి సరఫరా నిర్వహణకు భిన్నంగా లేదు. మురుగునీటి శుద్ధికి అవసరమైన సదుపాయాలను నిర్మించారు. బెంగళూరు నగరానికి రోజుకు 1,167.50 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసే సామర్థ్యం ఉన్నదని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు 2021 నివేదిక పేర్కొంది. ఉన్న సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడం కూడా 75 శాతం మేరకు మెరుగుపడింది. అయితే ఉత్పాదితమవుతున్న మురుగు నీరు, దాని శుద్ధి చేయగల సామర్థ్యం మధ్య అంతరం అంతకంతకూ పెరుగుతోంది. ప్రస్తుత నీటి అవసరాలు పూర్తిగా తీరుతాయని భావిస్తే ఉత్పాదితమయ్యే మురుగు నీరు రోజుకు 2000 మిలియన్ లీటర్లుగా ఉంటుంది. అంటే అందులో సగానికి పైగా శుద్ధి చేయబడనిదిగా ఉండిపోతుంది. ఈ సమస్య నదిగమించేందుకు నగర అధికారుల మధ్య చాలాసార్లు చర్చలు జరిగాయి. అయినా పరిస్థితులు ఒక దశాబ్దం క్రితం ఎలా ఉన్నాయో ఇప్పుడూ అలానే ఉన్నాయి!



మహానగరాలలోని ప్రజలకు, పరిశ్రమలకు అవసరమైన నీటిని అధునాతన ఇంజనీరింగ్ పరిష్కారాల ద్వారా సమృద్ధిగా సరఫరా చేయవచ్చన్న విధానకర్తల కలలు కరిగి పోతున్నాయి; నిర్దేశిత విధానాల కనుగుణంగా పథకాలు రూపొందించి, అమలుపరిచే ప్రభుత్వాధికారుల కృషి ఫలించడం లేదు. ఈ విపత్కర పరిస్థితికి బెంగళూరు నగరం అద్దం పడుతోంది. ఈ జల సంక్షోభానికి ఆ నగరం మొదటిదీ కాదు, చివరిదీ కాబోదు. రేపు మీ నగరమూ ఓ బెంగళూరు కావచ్చు సుమా!

మహా నగరాల నీటి సరఫరా ప్రణాళికల్లో ఇదొక నిజమైన సంక్షోభం. పెరుగుతున్న అవసరాలను, అందుకనుగుణంగా మార్పులు చేసేందుకు గల అవకాశాలను అవగాహన చేసుకోవడంలో మన అసమర్థత, అశక్తతే అసలు సంక్షోభం సుమా! వాస్తవమేమిటంటే బెంగళూరులో వర్షాలు బాగానే కురుస్తున్నాయి. ఆ వాననీటిని సంరక్షించి, భూగర్భ జలాలను పునశ్శక్తిమంతం చేయగల సరస్సులు కూడా నగరంలో చాలా పెద్ద సంఖ్యలో ఉన్నాయి.

ప్రతి వాన బొట్టును కాపాడుకుని, తీవ్ర నీటి కొరత కాలంలో ఉపయోగించుకోవాలి. అప్పుడు మాత్రమే నగర మురుగునీటి పారుదల వ్యవస్థను సక్రమంగా, సమర్థంగా నిర్వహించుకోవచ్చు. అయితే ఇదెలా సాధ్యం? మురుగునీటిని పైప్‌లైన్ల ద్వారా రవాణా చేయడం కాకుండా వ్యర్థ పదార్థాలన్నిటినీ ట్యాంకర్ల ద్వారా సేకరించి శుద్ధి చేసి పునర్వినియోగించుకోవాలి. అయితే ఇందుకు మన నీటి వ్యవస్థల నిర్వహణ ఇంజనీర్లు తమ పగటి కలలకు స్వస్తి చెప్పి వాస్తవికంగా ఆలోచించాలి. లక్ష్యాలు, వాటి సాధనా మార్గాలపై పునరాలోచన చేయాలి. పథకాలను పునః రూపొందించి, పటిష్ఠంగా అమలుపరచాలి. ఏమైనా ఇది నేటి బెంగళూరు కథ. రేపు ఇదే మీ నగర కథ కూడా కావచ్చు సుమా!

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

ప్రజాస్వామిక పాలనలో తొలి వంద రోజులు

'అధికారమున్నదని హద్దుపద్దు లేక
అన్యాయమార్గాల నార్జింపబూనిన
అచ్చి వచ్చే రోజులంతమైనాయి
అచ్చి వచ్చే రోజులంతమైనాయి'

ప్రజా కవి కాళోజీ నారాయణరావు పలుకులతో రాష్ట్ర గవర్నర్ తెలంగాణ ప్రజాస్వామిక శాసనసభను ఉద్దేశించి చేసిన ప్రసంగం అక్షర సత్యం. రాచరికపు పోకడలు, నియంతృత్వ ధోరణులకు తెలంగాణ ప్రజలు చరమగీతం పాడి నేటికి వంద రోజులైంది. ఈ వంద రోజుల్లో గణనీయమైన మార్పు. ఊహించని పరిణామాలు. ప్రజా మన్ననలు పొందిన ప్రభుత్వమిది. ఈ పరిపాలన అవతలి వాళ్లకు అంతగా రుచించకపోవచ్చు. లేదా జీర్ణించుకోలేకపోవచ్చు. ప్రజాస్వామిక స్ఫూర్తి వారికి నచ్చకపోవచ్చు. వారి కట్టుకున్న కోటలు బీటలు వారడం, వారు నిర్మించుకున్న ముళ్ల కంచెలు ఊడపీకేయడం వంటి పరిణామాలు వారు కలలో కూడా ఊహించి ఉండకపోచ్చు. రాచరికపు ఆనవాళ్లు ఒక్కొక్కటిగా చెరిపేస్తుంటే కొందరు దిక్కు తోచక మాట్లాడుతుండవచ్చు. కానీ వంద రోజుల ప్రజాస్వామిక పాలనలో తెలంగాణలో మార్పు స్పష్టంగా కనబడుతోంది.

పాలనలో పసిబిడ్డ అనేక విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుందనడంలో సందేహం లేదు. ఎందుకంటే, అధికారం చేపట్టిన తర్వాత ఈ ప్రజా ప్రభుత్వ పనితీరును బేరీజు వేయాలంటే ముఖ్యంగా మూడు కీలకమైన అంశాలను గమనించాల్సిన అవసరం ఉంది. పాలనను గాడిలో పెట్టడం, ఇచ్చిన హామీలను నెరవేర్చడం, రాష్ట్ర ప్రగతికి బాటలు వేయడం. కొత్తగా అధికారం చేపట్టిన ఏ ప్రభుత్వానికైనా ఈ మూడు అంశాలే కీలకం. ఇప్పుడు తెలంగాణకు కూడా. పాలనను గాడిలో పడాలంటే ముందు ప్రభుత్వం ఎలా పనిచేసిందో చెప్పాల్సిన బాధ్యత ఉంటుంది. నిర్ణయాలు పారదర్శకంగా ప్రజల ముందు ఆవిష్కరించాల్సిన అవసరం ఉంటుంది. అలా కాకుండా ప్రభుత్వంలో ఏం జరుగుతుందో వాస్తవాలను చెప్పకుండా రహస్యంగా ఉంచడం ప్రజలను వంచించినట్టే.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ మిగులు రాష్ట్రం. దశాబ్దకాలం కూడా తిరగకముందే దాదాపు ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పుల్లో కూరుకుపోయింది తెలంగాణ. ప్రజా ప్రభుత్వం ఏర్పడే వరకు రాష్ట్ర అప్పుల కుప్ప అంతా గడీకే పరిమితమైన నిగూఢ రహస్యం. పాలన గాడిలో పెట్టే క్రమంలో వాస్తవాలేంటో ప్రజల ముందు పెట్టడం ప్రభుత్వ బాధ్యత. ఇంత కాలం రాజుగారి కోటలో ఏం జరిగిందో తెలియాల్సిన అవసరం లేదనడానికి ఇదేం రాచరికపు వ్యవస్థకాదు. పరిపాలనను చక్కదిద్దాలంటే ఇలాంటి ఎన్నో అంశాలను వెలికితీయాల్సిన అవసరం ఉంటుంది. అందుకే ఆర్థిక లోతుల్లోకి వెళ్లి దశాబ్దకాలపు అప్పుల కుప్పల గురించి శ్వేతపత్రం ద్వారా ప్రభుత్వ ఖజానా స్థితిగతుల గురించి ప్రజల ముందు ఆవిష్కరించింది. పరిమితులు, పరిధులు దాటి ప్రజలను మభ్యపెట్టిన తీరును ఎప్పుడైతే పారదర్శకంగా బయటపెట్టిందో గత ఘనకార్యాలను చూసి ప్రజలంతా నివ్వెరపోయారు. నీటి పారుదల రంగంలోనూ ప్రాజెక్టులు, నీటి హక్కులపై రాష్ట్ర వాటాలతో పాటు ఆర్థిక అవకతవకలు, అక్రమ పద్ధతులు, అవలక్షణాలు ఇంకా ఎన్నెన్నో. ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేయాలంటే ఇలాంటి అనేక అంశాల్లో పారదర్శకత పాటించాలన్న స్పష్టమైన వైఖరిని ప్రజా ప్రభుత్వం తీసుకుంది. అందులో ఎలాంటి సందేహం లేదు.

ఇక రెండో అంశం. ఇచ్చిన హామీలు. ముఖ్యంగా సంక్షేమ పథకాలు. అణగారిన, బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ పెద్దపీట వేసింది. కీలకమైన ఆరు గ్యారెంటీలను ప్రజల ముందు వినిపించింది. సంక్షేమ పథకాల అమలులో మహిళలకే ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వాలని భావించింది. అధికారంలోకి రాగానే ఆడబిడ్డల ఆత్మగౌరవమే నినాదంగా సంక్షేమ ఫలాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించడమే ఎజెండాగా పనిచేస్తోంది. సంక్షేమ పథకాలు మహిళలకు అందించడం ద్వారానే వాటి ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉంటాయన్నది అందరూ అంగీకరించే విషయమే. పైగా ప్రమాణాలుంటాయి. పారదర్శకతా ఉంటుంది.



కేసీఆర్ పాలన దశాబ్ద కాలంలో ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు ఏనాడైనా గడీ మెట్లెక్కాయా? ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారందరినీ ఆహ్వానించి ఆప్యాయంగా పలకరించి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. స్వయం ఉపాధికి దోహదం చేసే ఐటీఐలను గత పాలకులు నిర్వీర్యం చేస్తే, టాటా టెక్నాలజీస్ సహకారంతో స్కిల్ సెంటర్లుగా మార్చే వినూత్న ప్రక్రియ ఫలితాలు రానున్న రోజుల్లో మన కళ్లముందు కనపడనున్నాయి.

జీవితాల్లో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ సంసారాలను నెట్టుకొస్తున్న అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పదవీ స్వీకార ప్రమాణం చేసిన తర్వాత తొలి సంతకం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకోలేదు. అది ఎందుకూ పనికి రాదు. దాన్ని ప్రైవేటుపరం చేస్తామని గతంలో మాట్లాడిన వారే మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినప్పుడు పరిహాసమాడింద్రు. రెండు రోజులు కూడా ఆగలేదు. ఈ పథకాన్ని నవ్వులపాలు చేయాలన్న కుంచిత స్వభావాన్ని ప్రదర్శించింద్రు. అవతలి వాళ్ల విషయాలను పక్కనపెడితే, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలే కుటుంబ ఆర్థిక భారం మోస్తున్న తీరు మనమంతా చూస్తున్నదే. అందుకే వారికి ఆర్థిక భారాన్ని తగ్గించడానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందీ ప్రజా ప్రభుత్వం. దీన్ని కూడా అపహాస్యం చేయాలని చూశారు. లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరే గృహజ్యోతి విషయంలోనూ కొందరు దొరలు కోడి గుడ్డు మీద ఈకలు పీకాలని చూశారు.

తాటాకు చప్పుళ్లకేం గానీ... ఆడబిడ్డల ఆత్మగౌరవం నిలబెట్టాలన్న సంకల్పాన్ని వెరవకుండా ముందుకు తీసుకెళుతూ రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించడానికి మహాలక్ష్మి పథకాన్ని ప్రజా ప్రభుత్వం ప్రారంభించింది. ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రివర్గం చేతుల మీదుగా భద్రాద్రి రాముడి సాక్షిగా ఇండ్లు లేని వారికి ఇంటి స్థలం, కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు ఇచ్చే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్నీ ప్రారంభించింది. ఆడబిడ్డల ఆత్మగౌరవం కాపాడటమే కాదు. నారీ శక్తిని అర్థం చేసుకున్నారు కాబట్టే ఈ రోజు ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళల చేతుల్లో పెడుతున్నారు. 63 లక్షలున్న మహిళా శక్తిని కోటి మందిని చేసి ఆ కోటి మందిని కోటీశ్వరులను చేయాలన్న మహిళా ప్రగతికి విధాన పత్రం విడుదల చేసిందీ ప్రజా ప్రభుత్వం. ఇలాంటి వాటిల్లో ప్రభుత్వం ఎక్కడా ఆర్భాటాలకు పోలే. ఇవన్నీ ఇచ్చిన హామీల్లో భాగమే కదా. పైగా ఇవేవో ఆశామాషీగా చేసినవి కాదు. బడ్జెట్‌లో వీటన్నింటికీ నిధుల కేటాయింపు చేసింది. ఇవేకాదు. పేదోడికి పెద్దరోగమొస్తే అండగా నిలబడాలని ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచిందీ వాస్తవమే కదా. అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందాలన్న లక్ష్యంతో కుల గణనకు అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేసిందీ ప్రభుత్వం.

రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అడుగులు పడుతున్న కొద్దీ ఒక్కొక్కటిగా ఆచరణలోకి వస్తున్నాయి. ఆరు అంశాలే కాదు 36 అంశాలూ ఆయన ఎజెండాలో ఉన్నాయి. ఒక్కో అడుగు ముందుకు వేయడం ఖాయం. గత పాలకులు చేసిన అప్పులకు వేల కోట్ల వడ్డీలూ కడుతున్నరు. అంచనాలకు మించి ఇది అదనంగా పడిన భారం. అందుకే ఆర్థిక క్రమశిక్షణ తెచ్చే ప్రయత్నాల్లో ఉన్నరు. ఒక వైపు పరిస్థితులను చక్కదిద్దుతూనే మెజారిటీ రైతులకు 'భరోసా' ఇచ్చారు. దశాబ్ద కాలంలో ఒక్క రైతును కలవని పాలన నుంచి రైతు సంఘాల ప్రతినిధులను పిలిచి మాట్లాడి రైతు కమిషన్ ఏర్పాటు చేశారు. భరోసాతో పాటు బీమా ఇస్తమన్నరు.

లీకుల మీద లీకులతో గ్రూప్-IV నుంచి గ్రూప్-I వరకు ప్రతి రిక్రూట్‌మెంట్‌నూ అపహాస్యం చేస్తూ నిరుద్యోగ యువకుల జీవితాలతో ఆడుకున్న గత చేదు అనుభవాల నుంచి బయట పడేయడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. గడిచిన మూడు నెలల కాలంలో వివిధ శాఖల్లో ప్రభుత్వం 28,942 పోస్టులకు అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చిన విషయం గుర్తుంచుకోవాలి. కొన్నింటికి మా హయాంలోనే నోటిఫికేషన్ ఇచ్చామంటున్నరు. గత హయాంలో ఇచ్చినవి, వచ్చినవి లీకులు, లీకేజీలు మాత్రమే. ఎన్నికలొచ్చే సమయంలో ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తే ఏమవుతుందో ప్రజల తీర్పుతో అవతలి పక్షం ఇప్పటికీ గ్రహించినట్టు లేదు. రిక్రూట్‌మెంట్లంటే కుటుంబ సభ్యులకే పదవులివ్వాలనే సంస్థాన పాలనకు చరమగీతం పాడి, నిరుద్యోగ యువకులకు విద్యా, ఉద్యోగ, ఉపాధి కల్పనా రంగాల్లో ప్రజా ప్రభుత్వం స్పష్టమైన ఎజెండాతో ముందుకు పోతోంది. మూడు నెల్లలోపే మెగా డీఎస్సీ ప్రకటించింది. వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీల భర్తీ ప్రక్రియ చేపట్టింది. దశాబ్ద కాలంలో ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు ఏనాడైనా గడీ మెట్లెక్కాయా? వారందరినీ ఆహ్వానించి ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. స్వయం ఉపాధికి దోహదం చేసే ఐటీఐలను గత పాలకులు నిర్వీర్యం చేస్తే, టాటా టెక్నాలజీస్ సహకారంతో స్కిల్ సెంటర్లుగా మార్చే వినూత్న ప్రక్రియ ఫలితాలు రానున్న రోజుల్లో కళ్లముందు కనపడనున్నాయి.

చెప్పుకుంటూ పోతే అనేకమున్నాయి. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఒకవైపు పాలనను గాడిలో పెడుతూ మరోవైపు సంక్షేమ ఫలాలను అందిస్తూనే తెలంగాణ ప్రగతికి బాటలు వేస్తున్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధించడానికి ఓఆర్ఆర్ అంతర్భాగం అర్బన్ ఏరియా, ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య భాగం సెమీ అర్బన్ ఏరియాగా, ఆర్ఆర్ఆర్ ఆవలి నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు గ్రామీణ తెలంగాణగా రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం మెగా మాస్టర్ ప్లాన్ రూపకల్పన కోసం అంతర్జాతీయ కన్సల్టెన్సీని నియమించారు. మెగా మాస్టర్ ప్లాన్ ప్రకటించే ముందు ప్రజలు, ప్రజా సంఘాల అభిప్రాయాలను సేకరించి అందుకు అనుగుణంగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేసే 'వైబ్రెంట్ తెలంగాణ 2050'కు నాంది పలకడానికి కార్యాచరణ సిద్ధమవుతోంది.

● బోరెడ్డి అయోధ్య రెడ్డి
తెలంగాణ ముఖ్యమంత్రి సీపీఆర్ఓ

(ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు వంద రోజులు)

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.1 కనిష్ఠం 24.6

ప్రధాని పర్యటనకు భారీ ఏర్పాట్లు

● నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు



రోడ్‌షో ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా ఇనుప బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

హైదరాబాద్ సిటీ/మల్కాజిగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రధాని పర్యటన నేపథ్యంలో అధికారులు భారీస్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో శుక్రవారం రోడ్‌షో నిర్వహించనున్న నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా ఇనుప బారీకేడ్ల(గడ్డర్లు)ను ఏర్పాటు చేస్తున్నారు. ఆ ప్రాంతంలో 144 సెక్షన్‌తో పాటు, నో ఫ్లయింగ్ జోన్‌గా పోలీసులు ప్రకటించారు. డ్రోన్ కెమెరాలను నిషేధించారు. కాగా, మోదీ రోడ్‌షోకు నగరానికి చెందిన 60 డివిజన్ల నుంచి సుమారు రెండు లక్షల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు బీజేపీ శ్రేణులు చెబుతున్నాయి.

ఈ ప్రాంతాల్లో ఆంక్షలు

ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా శుక్ర, శనివారాల్లో నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని హైదరాబాద్, రాచకొండ కమిషనర్లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ శుక్రవారం సాయంత్రం బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో దిగి, అక్కడి నుంచి మల్కాజిగిరిలో నిర్వహించే రోడ్‌షోలో పాల్గొంటారు. మీర్జాలగూడ నుంచి మల్కాజిగిరి చౌరస్తా వరకు 1.5 కిలోమీటర్ల మేర రోడ్ షో సాగనుంది. అనంతరం రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. శనివారం ఉదయం ప్రధాని రాజ్‌భవన్ నుంచి బేగంపేట విమానాశ్రయానికి వెళ్తారు.

- రోడ్‌షో జరిగే ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి షో ముగిసే వరకూ వాహనాలను అనుమతించరు.
- మెట్టుగూడ నుంచి మల్కాజిగిరి వైపు వచ్చే వాహనాలను శాంతినగర్ టి.జంక్షన్

మిగతా 8వ పేజీలో..

ఎల్‌బీ స్టేడియం పరిసరాల్లో..

సీఎం రేవంత్‌రెడ్డి ఇఫ్తార్ విందు సందర్భంగా శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు ఎల్‌బీ స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయి. ఏఆర్ పెట్రోల్ పంప్, బషీర్‌బాగ్, బీజేఆర్ స్టాచ్యూ, సుజాత స్కూల్, ఖాన్ లతీఫ్‌ఖాన్ బిల్డింగ్, తదితర ప్రాంతాల్లో సాధారణ ట్రాఫిక్, ఆర్టీసీ బస్సులను అనుమతించకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో పంపుతారు.

బై.. బై ఫ్రెండ్స్..



పరీక్ష రాసిన అనంతరం సికింద్రాబాద్‌లో విద్యార్థినుల సందడి



నిజాంపేటలోని ఓ కళాశాల హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్తూ..

ఇంటర్ పరీక్షలు ముగిశాయి. చివరిరోజు పరీక్ష రాసిన అనంతరం బయటకు వచ్చిన విద్యార్థులు హాయ్.. బై.. చెప్పుకుంటూ సరదాగా గడిపారు. అనంతరం హాస్టల్ విద్యార్థులు లగేజీ తీసుకుని ఇళ్లకు పయనం అయ్యారు. దీంతో నగరంలోని రెసిడెన్షియల్ హాస్టళ్లు, గురుకులాలు ఖాళీ అవుతున్నాయి.

- హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

37 నిమిషాల్లో.. ఎల్‌బీనగర్ టు జూబ్లీహిల్స్



● గ్రీన్ చానల్ ద్వారా గుండె తరలింపు

కొత్తపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ చానెల్ ద్వారా గురువారం కేవలం 37 నిమిషాల్లో ఎల్‌బీనగర్ గ్లోబల్ ఆస్పత్రి నుంచి జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రికి 'గుండె'ను తరలించి రాచకొండ ట్రాఫిక్ పోలీసులు తమ ఘనతను చాటుకున్నారు. ట్రాఫిక్ డీసీపీ-2 వి. శ్రీనివాసులు వివరాలు తెలిపారు. వైద్య నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక బాక్స్‌లో ఉంచిన సజీవ 'గుండె'ను అంబులెన్స్ ద్వారా తరలించారు. ఎల్‌బీనగర్ గ్లోబల్ ఆస్పత్రి నుంచి ఉదయం 9.19 గంటలకు అంబులెన్స్ బయలుదేరి 9.56 గంటలకు జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రికి చేరుకుంది. సాగర్ రింగ్ రోడ్డు, ఎల్‌బీనగర్ చౌరస్తా, కామినేని ఫ్లై ఓవర్, అల్కాపురి, నాగోల్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, హబ్సిగూడ, తార్నాక, రైల్ నిలయం, బేగంపేట, పంజాగుట్టల మీదుగా ప్రయాణించి 37 నిమిషాల్లో అపోలో ఆస్పత్రికి చేరుకుంది. సజీవ అవయవాన్ని గమ్యస్థానానికి చేర్చడంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కూడా సహకరించారు.

భూముల ఆక్రమణలపై కలెక్టర్ సీరియస్..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో జరుగుతున్న ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పరిధిలోని భూములను పరిరక్షించేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఖాళీగా ఉంటే కబ్జా..! శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన కలెక్టర్.. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) హేమంత్ కేశవ్ పాటిల్‌ను ఆదేశించారు. దీంతో ఆయన పలు మండలాల్లో పర్యటించారు. నగరంలో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కాపాడేందుకు బాధ్యతగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

పాఠశాలల మరమ్మతు పనులు చేపట్టాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

హైదరాబాద్ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలల మరమ్మతుపనులను వెంటనే చేపట్టాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. రేపటిలోగా పెండింగ్ బిల్లుల వివరాలు తెలియజేయాలని ఆయన సూచించారు. మల్లేపల్లిలోని ఉర్దూ మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో కలిసి కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి పిల్లలతో ముచ్చటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠా లు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధనలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు మంజూరయ్యాయి, ఎంత ఖర్చు చేశారనే వివరాలపై నివేదిక ఇవ్వాలని సూచించారు. రాత్రివేళల్లో పాఠశాలల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రోహిణి, మల్లేపల్లి కార్పొరేటర్ జాఫర్ ఖాన్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే, నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జాఫర్‌ఖాన్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సునీత, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సునీత, తదితరులు పాల్గొన్నారు.

Shaan-e Ramazan
షాన్-ఎ రమజాన్

ఇఫ్తార్: 6:31
(శుక్రవారం సాయంత్రం)
సహర్: 5:02
(శనివారం ఉదయం)

గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ 74 ఎంయూలు

హైదరాబాద్ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో విద్యుత్ వినియోగం రికార్డుస్థాయిలో పెరుగుతోంది. రెండురోజులుగా 74 మిలియన్ యూనిట్లు నమోదవుతోంది. ఉష్ణోగ్రతలు ఇదే తరహాలో ఉంటే నెలాఖరు నాటికి 80 మిలియన్ యూనిట్లకు చేరుతుందని విద్యుత్‌శాఖ అంచనా వేస్తోంది. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లపై అధికలోడ్ పడకుండా చర్యలు మొదలుపెట్టింది. ఈమేరకు ఉన్నతాధికారులతో కలిసి టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. డిమాండ్ ఏస్థాయిలో పెరిగినా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సీఎండీ ఆదేశించారు. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరడం, ఏసీలు, కూలర్ల వినియోగం పెరగడంతో విద్యుత్ వినియోగం అధికమవుతోందని అధికారులు చెబుతున్నారు. గురువారం అత్యధికంగా గోషామహల్‌లో 40.7, బేగంపేటలో 40.2, కార్వాన్‌లో 40 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



కార్యాలయం మెరుగులకు రూ.కోట్లలో ఖర్చు

గతంలో తార్నాక నుంచి అమీర్‌పేటకు హెచ్‌ఎండీఏ

- అప్పుడు ఇంటీరియర్‌కు రూ.13 కోట్లు వ్యయం చేసిన సంస్థ
- ఇప్పుడది ఖాళీచేసి పైగా ప్యాలెస్‌కు తరలింపు
- నానక్‌రాంగూడలోని టీఎస్‌బీపాస్ ఆఫీసు అందాలకూ రూ.3.5 కోట్లు ఖర్చు
- అక్కడి నుంచి తాజాగా మాసబ్‌ట్యాంక్‌కు మార్పు
- అక్కడా రూ.3 కోట్లతో ఇంటీరియర్ పనులకు ప్రతిపాదనలు

తార్నాకలోని హెచ్‌ఎండీఏ కార్యాలయాన్ని అమీర్‌పేటలోని స్వర్ణ జయంతి కాంప్లెక్స్‌కు మార్చినప్పుడు ఆఫీసు ఇంటీరియర్ డిజైన్లకు రూ. 13కోట్లు వ్యయం చేశారు. తాజాగా అమీర్‌పేట నుంచి పైగా ప్యాలెస్‌కు కార్యాలయాన్ని తరలించనుండడంతో ఇప్పుడెన్ని కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుందోనన్న సందేహాలు ఏర్పడుతున్నాయి.

హైదరాబాద్ సిటీ, మార్చి13 (ఆంధ్రజ్యోతి) పేదోడి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మాత్రమే కేటాయిస్తుండగా, హెచ్‌ఎండీఏలో అధికారుల, ఉద్యోగుల చాంబర్ల కోసం రూ. కోట్లు వెచ్చిస్తున్నారు. స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లోని ఇంటీరియర్ కోసం చేసిన వ్యయంతో ఏకంగా ఏడంతస్తుల భవనమే నిర్మించొచ్చు అని గతంలో అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. తార్నాకలోని హెచ్‌ఎండీఏ కార్యాలయాన్ని మూడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఆదేశాల మేరకు అమీర్‌పేటలోని హెచ్‌ఎండీఏకు చెందిన కమర్షియల్ కాంప్లెక్స్‌గా ఉన్న స్వర్ణ జయంతి కాంప్లెక్స్‌కు తరలించారు. కాంప్లెక్స్‌లోని 2, 3, 4, 5, 7 అంతస్తులను కేటాయించారు. ఆయా విభాగాలకు అంతస్తుల వారీగా రూ. కోట్లు వెచ్చించి ఇంటీరియర్‌ను మెరుగుపరిచారు. అధికారుల చాంబర్లను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. అందుకు సుమారు రూ.13 కోట్లు వ్యయం చేశారు. ఇప్పుడు ఆ భవనాన్ని వదిలి పైగా ప్యాలెస్‌కు తరలిపోవాల్సి వస్తోంది. గతంలో పైగా ప్యాలెస్‌లోనే 22ఏళ్ల పాటు హెచ్‌ఎండీఏ కార్యాలయం కొనసాగింది. తిరిగి యథాస్థానానికి తరలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పుడు అక్కడ కూడా ఇంటీరియర్ కోసం ఎన్ని కోట్లు చేస్తారో అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ట్యాంక్‌బండ్ వెంట ఉన్న బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు (బీపీపీ) ఆఫీసును కూడా పైగా ప్యాలెస్‌కు తరలించే అవకాశాలు ఉన్నాయి.

టీఎస్‌బీపాస్ కూడా అంతే

హెచ్‌ఎండీఏకు అనుబంధ సంస్థగా ఉన్న హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్)

మిగతా 8వ పేజీలో..

అధికారుల చాంబర్ల కోసం అంత ఖర్చా..?

గత ప్రభుత్వంలో హెచ్‌ఎండీఏకు చెందిన ఆఫీసులకే గాకుండా వివిధ శాఖల ఉన్నతాధికారుల చాంబర్లకు కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. సాధారణంగా 1500 అడుగుల విస్తీర్ణం ఉండే డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని ఇంటీరియర్ సహా తీర్చిదిద్దేందుకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వ్యయం అవుతుంది. కానీ, అప్పటికే నిర్మించిన భవనాల్లోని కార్యాలయం చాంబర్ల ఇంటీరియర్లకు అంతకంటే ఎక్కువే ఖర్చు చేశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నదని కొత్త ప్రభుత్వంలోని పెద్దలే చెబుతున్న తరుణంలో ఇప్పుడు కూడా ఆఫీసు చాంబర్లకు రూ. కోట్లు వ్యయం చేయడంపై ఆలోచించాలన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దుబారా వ్యయాన్ని తగ్గించాలని హెచ్‌ఎండీఏలోని అధికారులు, ఉద్యోగులే కోరుతున్నారు.

భూవివాదంలో జోక్యం..

- 36 మందిపై కేసు... ఐదుగురికి రిమాండ్
- పరారీలో మాజీ సీఎం బంధువు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

8

సెల్‌ఫోన్ కోసం హత్య

● నిందితుల అరెస్టు.. ఇందులో ఒకరు మైనర్



వివరాలు వెల్లడిస్తున్న చిలకలగూడ పోలీసులు

అడ్డగుట్ట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ కోసం ఓ యువకుడిని హత్య చేశారు. ఈ నెల 7న జరిగిన ఈ ఘటనలో పోలీసులు నలుగురు నిందితులతో పాటు బాలుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గంగాధర్, ఏసీపీ జయపాల్ రెడ్డి వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లా సంజావుల మండలం, అలవకొండ గ్రామానికి చెందిన సంజీవ్‌గౌడ్ కుమారుడు అనిల్‌కుమార్‌గౌడ్(21) సికింద్రాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటూ చర్లపల్లిలోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 7న స్నేహితుడు నవీన్‌ను కలిసి కాచిగూడలో రేపల్లె రైలు ఎక్కి సికింద్రాబాద్‌కు వస్తున్నాడు. రైలులో డోర్ పక్కన నిలబడి సెల్‌ఫోన్‌లో మెసేజ్‌లు చేస్తున్నాడు. అదే సమయంలో చిలకలగూడ చౌరస్తా సమీపంలోని రైలుపట్టాల పక్కనే వారాసిగూడ మహ్మద్‌గూడకు చెందిన సంకు రాహుల్(19), కాపరి సూరజ్ కుమార్(21), దూద్‌బావికి చెందిన మాదన రవితేజ(19), చింతకుంట ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణ(19) తోపాటు 16 ఏళ్ల బాలుడు దుడ్డుకర్రలు పట్టుకుని నిలబడ్డారు. రైలులో డోర్ పక్కన నిలబడి ఉన్న అనిల్‌కుమార్ చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను కర్రతో కొట్టారు. సెల్‌ఫోన్ కింద పడిపోయింది. రైలు మెల్లగా కదులుతుండడంతో అనిల్ కిందకు దిగి సెల్‌ఫోన్ ఇవ్వమని వారిని బతిమలాడాడు. ససేమిరా అన్న రాహుల్ అనిల్‌ను కత్తితో పొడిచి చంపేశాడు. ఆ తర్వాత రాహుల్ స్నేహితుడి ద్వారా ద్విచక్ర వాహనం తెప్పించుకుని, సూరజ్‌కుమార్ సాయంతో అనిల్ మృతదేహాన్ని తీసుకెళ్లి చిలకలగూడ రైల్వేక్వార్టర్ సమీపంలోని చెత్త డంపింగ్‌యార్డులో పడేశారు. ఈ నెల 8న పోలీసులు మృతదేహాన్ని గుర్తించి గాంధీ ఆస్పత్రికి తరలించారు. సీఐ అనుదీప్, ఎస్సైలు రమేష్‌గౌడ్, బాలరాజు, ఆంజనేయులు, కిషోర్, కృష్ణ, కానిస్టేబుళ్లు ఒక బృందంగా ఏర్పడి కేసు విచారణ చేపట్టారు.

నిందితులను పట్టించిన బైక్

అనిల్‌కుమార్ మృతదేహాన్ని చిలకలగూడ చౌరస్తా నుంచి రైల్వేక్వార్టర్ వద్దకు బైక్‌పై తీసుకు వస్తున్న ఫొటోలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఆ బైకు నెంబర్ ఆధారంగా పోలీసులు నిందితులను పట్టుకున్నారు.

చిన్న వయస్సులో నేరాల బాట

అనిల్‌కుమార్ హత్యకేసులో నలుగురు స్నేహితులతోపాటు 16 ఏళ్ల బాలుడు ఉండడం విశేషం. ఇతడి వయస్సు చిన్నదైనా మెదడులో హైటెక్ నేరాల ఆలోచనలు ఉండడాన్ని గమనించి తాము ఆశ్చర్యపోయామని డీసీపీ తెలిపారు. ఈ బాలుడిని జువైనల్ హోంకు తరలించిన తర్వాత న్యాయమూర్తికి లేఖ రాస్తామన్నారు.

వీడియోకాల్ మాట్లాడుతూ ఆత్మహత్య

● ప్రియుడు లైవ్‌లో ఉండగానే ఉరి వేసుకున్న యువతి ● ప్రియుడి వేధింపులే కారణమని అనుమానాలు



సాహితీ(ఫైల్)

చాదర్‌ఘాట్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ వేట కోసం నగరానికి వచ్చిన ఓ యువతి తన ప్రియుడితో వీడియో కాల్ మాట్లాడుతూనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ లేడీస్ హాస్టల్‌లో బుధవారం అర్ధరాత్రి తర్వాత ఈ ఘటన జరిగింది. ప్రియుడి వేధింపులే యువతి బలవన్మరణానికి కారణమనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు, బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామానికి చెందిన సుంకరి సాహితీ (26) ఎంబీఏ పూర్తి చేసింది. రెండు నెలల క్రితం హైదరాబాద్ వచ్చిన సాహితీ.. చైతన్యపురిలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తోంది. ములుగు జిల్లాకే చెందిన చిడెం హరీష్, సాహితీ కొన్నాళ్లు ప్రేమలో ఉన్నారు. హరీష్ తండ్రి చిడెం మోహన్‌రావు ములుగు జిల్లా వెంకటాపురం మండలం ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షునిగా ఉన్నారు. తమ కుటుంబాల మధ్య ఉన్న స్నేహంతో దగ్గరైన హరీష్, సాహితీ ప్రేమికులుగా మారారు ఇటీవల వీళ్ల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో హరీష్ ఆమెను తరచూ వేధింపులకు గురి చేస్తున్నాడు. సాహితీ ఉంటున్న హాస్టల్ దగ్గరకు స్నేహితులతో కలిసి వచ్చి ఆమెను ఇబ్బంది కూడా పెట్టాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 11 గంటల నుంచి ఒకటిన్నర గంటల వరకు సాహితీ, హరీష్ వీడియో కాల్‌లో మాట్లాడుకున్నారు. ఈ కాల్ కొనసాగుతుండగానే సాహితీ తన హాస్టల్ గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. హరీష్ వెంటనే సాహితీ స్నేహితులను అప్రమత్తం చేయగా.. వారు గది తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లేసరికి సాహితీ ప్రాణాలు కోల్పోయింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. హరీష్ వేధింపుల గురించి అతని తండ్రికి చెబితే ఏం చేసుకుంటారో చేసుకోండంటూ సాహితీని ఫోన్‌లో బెదిరించాడని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలి మేనమామ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రేమ పేరుతో చిడెం హరీశ్ వేధింపులు తాళలేకే తమ మేనకోడలు సాహితి చనిపోయిందని, పోలీసులు స్పందించి విచారణ చేపట్టి అతడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

జూపార్కులో ఏసీబీ దాడులు

● రూ.5వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్

మదీన, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ పెన్షన్ ఫైల్‌లో పేరు మార్చడానికి జూపార్కులోని సీనియర్ అసిస్టెంట్ రూ.5వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సైదాబాద్‌కు చెందిన ఆజం షరీఫ్ తండ్రి గతంలో జూపార్కులో పనిచేస్తుండేవాడు. కొన్నాళ్ల క్రితం ఆయన మృతిచెందారు. దీంతో ఆయన భార్యకు పెన్షన్ వస్తుండేది. ఇటీవల ఆమె కూడా మృతిచెందింది. అయితే అవివాహిత చెల్లెలు పేరు మీద పెన్షన్ మంజూరు చేయాలని ఆజం షరీఫ్ దరఖాస్తు చేసుకున్నాడు. పేరు మార్చేందుకు సీనియర్ అసిస్టెంట్ రమేశ్ డబ్బులు డిమాండ్ చేయడంతో ఆజం షరీఫ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు గురువారం సాయంత్రం ఆజం షరీఫ్.. రమేష్‌కు డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని స్కూటీలోనుంచి డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గతంలో కూడా ఏసీబీ దాడులు

సుమారు ఎనిమిదేళ్ల క్రితం జూపార్కులో ఏసీబీ దాడులు జరిగాయి. అప్పటి క్యురేటర్ గోపీ రవి ఓ కాంట్రాక్టర్ వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. తాజాగా ఓ ఉద్యోగి ఫ్యామిలీ పెన్షన్ ఫైల్‌లో పేరు మార్చడానికి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.



ఎస్.రమేశ్

బీసీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్

హైదరాబాద్ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకుంటున్న బీసీ అభ్యర్థులకు రూ.1500 చొప్పున బుక్ ఫండ్ లేదా స్టడీ మెటీరియల్‌ను అందించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎస్‌జీటీ కేటగిరీలో 7వేల మంది, స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 3వేల మందికి సాయం అందిస్తామని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 14 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు www.tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మరిన్ని వివరాలకు 040-240711778, 040-27077929 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



స్టీల్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్

వేసవిలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

● రాజేంద్రనగర్‌లో స్టీల్ వాటర్ ట్యాంకర్ ప్రారంభం

రాజేంద్రనగర్, మార్చి1 4 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని, అందుకోసం స్టీల్ వాటర్ ట్యాంకర్‌లను ఉపయోగిస్తున్నామని రాజేంద్రనగర్ డివిజన్ వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, మేనేజర్ రాంనర్సింహ్మారెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ ఫిల్టర్‌బెడ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్టీల్ వాటర్ ట్యాంకర్‌ను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేసవిలో ప్రజలకు నీటి అవసరాలు తీర్చడానికి అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాజేంద్రనగర్ డివిజన్‌లో తొమ్మిది ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. హనుమాన్‌నగర్, ఉప్పర్‌పల్లి వాంబే కాలనీలకు ఉచిత నీటి సరఫరా చేస్తున్నామని, మిగతా ప్రాంతాలకు బుకింగ్ ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. డొమెస్టిక్ అవసరాలకు రూ. 500లు, కమర్షియల్ అవసరాలకు రూ. 850 చొప్పున వసూలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ సిబ్బంది పెండ్యాల సాయిమల్లిక్, వాటర్ ట్యాంకర్ నిర్వాహకుడు మజ్జిగ నరేశ్‌యాదవ్ పాల్గొన్నారు.



కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కార్ల్ మార్క్స్‌కు ఘన నివాళి

రాజేంద్రనగర్, మార్చి14(ఆంధ్రజ్యోతి): మానవ చరిత్రలో అత్యంత ప్రభావశీలమైన వ్యక్తిగా కార్ల్‌మార్క్స్ నిలిచారని, ఆయన అర్థశాస్త్రంలో చేసిన కృషి ఎంతో గొప్పదని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జె.రుద్రకుమార్ పేర్కొన్నారు. గురువారం రాజేంద్రనగర్ మండలం కాటేదాన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్ల్ మార్క్స్ 141 వర్ధంతిని నిర్వహించారు. సీఐటీయూ నాయకులు కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జి.కురుమయ్య, సీఐటీయూ నాయకులు ఎన్.పార్వతీ, బచ్చలకూర స్వామి, భాస్కర్, ప్రవీణ్, సచిన్, బాలరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం 'సీఏఏ'

● ఎంపీజే తెలంగాణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్



పురానీహవేలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) భారత దేశ ప్రజల అభీష్టానికి ఏమాత్రం ప్రతిబింబం కాదని, కేంద్ర ప్రభుత్వం ప్రతి విషయంలోనూ ఇష్టానుసారం వ్యవహరిస్తోందని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్ గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. సరిగ్గా ఎన్నికలు సమీపిస్తుండగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకురావడం భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, నాలుగేళ్ల క్రితం ఈ చట్టాన్ని ప్రతిపాదించినప్పుడు దేశంలో సర్వత్రా నిరసనలు వెల్లువెత్తాయని అన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దేశంలో మతపరమైన వైషమ్యాలను రేకెత్తించి, ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు యత్నించడం మంచిది కాదన్నారు. ఈ చట్టం భారత ప్రజాస్వామిక వ్యవస్థకు, రాజ్యాంగ సూత్రాలకు విఘాతం కలిగించేదిగా ఉందన్నారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఇప్పటికే దేశంలో 200 కంటే ఎక్కువ చోట్ల కేసులు నమోదయ్యాయని, న్యాయశాస్త్ర కోవిదులు, మేధావులు ఈ చట్టం వల్ల తలెత్తే ప్రమాదకర సమస్యల పట్ల ఆందోళనను వ్యక్తం చేశారని ఆయన గుర్తుచేశారు.

వన్ నేషన్-వన్ పోల్' భారత ఫెడరలిజానికి చరమగీతం

● మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన

హైదరాబాద్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): 'వన్ నేషన్-వన్ పోల్' విధానం భారత ఫెడరలిజానికి చరమగీతంగా మారుతుందని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. తరుచుగా జరిగే ఎన్నికల కారణంగా అధికారంలో కొనసాగుతున్న పార్టీలు ప్రజల సమస్యలపట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తూ పని చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. వన్‌నేషన్-వన్‌పోల్‌లో పలు రాజ్యాంగపరమైన సమస్యలు ఉన్నాయన్నారు. ప్రధానంగా ఒక్కసారి ఎన్నికైతే అయిదేళ్ల పాటు ప్రజలను పట్టించుకోవలిసిన అవసరం ఉండదనే భావన ఏర్పడుతుందని ఇది భారత సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. భారత దేశం అంతా ఒకే పార్టీ గుత్తాధిపత్యంలోకి చేరుతుందని ఒవైసీ గురువారం ఎక్స్‌లో పేర్కొన్నారు.

శుభాకాంక్షలు



షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలు చౌహాన్‌ను గురువారం బేగంబజార్‌కు చెందిన సామాజిక వేత్త ఉదయ్‌సింగ్ చౌహాన్, సైతాన్‌సింగ్ చౌహాన్, గోపాల్‌సింగ్ చౌహాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌స్పెక్టర్‌కు సీతారాముల చిత్రపటాన్ని అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

అఫ్జల్‌గంజ్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి)

అభినందనలు



ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన సినీనటుడు అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డిని గురువారం ఆయన నివాసంలో తెలంగాణ రాష్ట్ర మేరు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాల్కం శ్రీనివాస్ మేరు, ఆదిమూల శంకర్, పాల్కం వినయ్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రశేఖర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

-అఫ్జల్‌గంజ్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి)

నకిలీ వస్తువులు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

● బేగంబజార్‌లోని దుకాణాలపై పోలీసుల దాడి
● రూ.4.17 లక్షల విలువ చేసే కాస్మొటిక్ వస్తువుల స్వాధీనం
● రూ. 4 లక్షల విలువ చేసే నకిలీ మిరియాలు కూడా

అఫ్జల్‌గంజ్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నకిలీ కాస్మొటిక్, నకిలీ మిరియాలు విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. షాహినాథ్‌గంజ్ పోలీసులు బుధవారం రాత్రి బేగంబజార్‌లో ఓ దుకాణంపై దాడి చేసి రూ.4.17 లక్షల విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన నకిలీ కాస్మొటిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఇన్‌స్పెక్టర్ ఎల్ బాలు చౌహాన్ వివరాలను వెల్లడించారు. బేగంబజార్ ఫిల్‌ఖానాకు చెందిన తబీర్ అహ్మద్ లష్కర్(37) '7స్టార్ కాస్మొటిక్' పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా వివిధ పేరొందిన కంపెనీలకు చెందిన నకిలీ బేబీ లిప్‌బామ్, కాజల్, లిపిస్టిక్ వంటివి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయమైన సమాచారం మేరకు ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, షాహినాథ్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా '7స్టార్ కాస్మొటిక్' దుకాణంపై బుధవారం రాత్రి దాడులు నిర్వహించి నకిలీ కాస్మొటిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కాపీ రైట్ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో షాహినాథ్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలు చౌహాన్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎన్.నాగార్జున, కవియుద్దీన్, పి.నాగరాజు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ కాస్మొటిక్స్.. నిందితుడు అహ్మద్ లష్కర్

బొప్పాయి విత్తనాలను మిరియాలుగా మార్చి..

అఫ్జల్‌గంజ్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి విత్తనాలను నల్ల మిరియాలుగా మార్చి బహిరంగా మార్కెట్లో విక్రయిస్తున్న వ్యాపారిని షాహినాథ్‌గంజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.4 లక్షల విలువ చేసే నకిలీ నల్ల మిరియాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంబజూజార్ జోషివాడకు చెందిన వినోద్‌కుమార్ గెహ్లాట్ కొంతకాలంగా బేగంబజార్‌లో హోల్‌సెల్ కిరణా దుకాణం నడుపుతున్నాడు. అధిక డబ్బు సంపాదన కోసం బొప్పాయి పండు విత్తనాలను మిరియాలుగా మార్చి వాటికి రంగువేసి మార్కెట్‌లో విక్రయిస్తూ పోలీసుల కళ్లుగప్పి తప్పించుకొని తిరుగుతున్నాడు. విశ్వసనీయమైన సమాచారం అందడంతో ఈస్ట్‌జోన్, షాహినాథ్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా బేగంబజార్‌లో ఉన్న వినోద్ ట్రేడింగ్ కంపెనీ దుకాణంపై బుధవారం రాత్రి దాడి చేశారు. 700 కేజీల బొప్పాయి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై 420, 336, 272, 273 సెక్షన్ కింది కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో షాహినాథ్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలు చౌహాన్, ఎస్.అనంత చారి, పి.సాయిరాం, టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.



నకిలీ మిరియాల బస్తాలతో కూడిన ఆటోతో పాటు నిందితుడు

చేతి రెండువేళ్లు తెగిన కార్మికుడికి న్యాయం చేయాలి

రాజేంద్రనగర్, మార్చి14(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో చేతి రెండు వేళ్లు తెగిపోయిన కార్మికుడికి చట్టపరంగా రావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించి అతడికి న్యాయం చేయాలని సీఐటీయూ కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియా కన్వీనర్ భాస్కర్ డిమాండ్ చేశారు. బాధితుడికి న్యాయం చేయాలని గురువారం శ్రీరాం కాలనీలో శ్రీవారి స్పైసెస్ ఫుడ్ లిమిటెడ్ పరిశ్రమ ఎదుట సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ కాటేదాన్ ఇండస్ట్రీయల్ ఏరియా కన్వీనర్ భాస్కర్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాజేంద్రనగర్ మండల అధ్యక్షుడు బచ్చలకూర స్వామి, కోశాధికారి ఎన్.పార్వతీ మాట్లాడుతూ, రెండు రోజుల క్రితం పరిశ్రమలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు శేఖర్‌కు రెండు చేతివేళ్లు తెగిపోయాయని వారు గుర్తు చేశారు. ఆ సమయంలో ప్రాథమిక వైద్యం అందించి, రెండు రోజుల వేతనం ఇచ్చిన పరిశ్రమ యాజమాన్యం తర్వాత నుంచి పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీలో కార్మికుల రక్షణకు ఎలాంటి భద్రతలు పాటించకపోవడంతోనే ప్రమాదం జరిగిందని వారన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కూడా లేదన్నారు. కార్మికశాఖ అధికారులతోపాటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్పందించి బాధితుడికి న్యాయం చేయాలని వారు కోరారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పరిశ్రమ ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.



బాధితుడుతో కలిసి కంపెనీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/7fZyVxz లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలి

కార్వాన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి సూచించారు. గురువారం కార్వాన్ నియోజక వర్గం, గుడిమల్కాపూర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను గురువారం కిషన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర వంశీ, ముఖేశ్ ముదిరాజ్ పాల్గొన్నారు.



పార్టీ కండువాలు కప్పుతున్న పులిపాటి రాజేశ్‌కుమార్

కాంగ్రెస్‌లో పలువురి యువకుల చేరిక

మదీన, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఆరు గ్యారెంటీ స్కీమ్‌లు, పాతబస్తీకి మెట్రో రైలు తీసుకురావడం పట్ల ఆకర్షితులైన యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్ అన్నారు. గురువారం ఫలక్‌నుమా డివిజన్‌కు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జి.కన్నయ్యలాల్, సయ్యద్‌షా ముజాహిద్ హుస్సేని, మహ్మద్ ఇక్బాల్, ఆబేద్ అలీ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ప్రభుత్వ హైస్కూల్‌కు వాటర్ ప్యూరిఫయర్

● అందజేసిన జోయా లూకాస్

కార్వాన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నం మాసాబ్‌ట్యాంక్‌లోని రెడ్‌క్రాస్ ప్రభుత్వ హైస్కూల్‌కు వాటర్ ప్యూరిఫయర్ ప్లాంట్‌కోసం బేగంపేట్‌కు చెందిన జోయాలూకాస్ ప్రతినిధులు రూ.3.50 లక్షల చెక్కును అందజేశారు. గురువారం ముఖ్య అతిథిగా హాజరైన గ్రేటర్ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ జోయాలూకాస్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమవంతుగా సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, సనోజ్, అజిత్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న జోయా లూకాస్ ప్రతినిధులు

ఘనంగా కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు

నార్సింగ్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, హైదర్షాకోట్ మాజీ సర్పంచ్ పూలపల్లి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం నాయకులు చింతల ఎట్టయ్య, నర్సింగ్‌రావు ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో పూలపల్లి కృష్ణారెడ్డి కేక్‌కట్ చేసి ఆయనకు తినిపించారు. కార్యక్రమంలో గ్రామ, మండల నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



కృష్ణారెడ్డికి కేక్ తినిపిస్తున్న నాయకులు

విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాలను పెట్టుకోవాలి



విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

రవీంద్రభారతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాలను పెట్టకొని వాటి సాధన కోసం కృషి చేయాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సూచించారు. గురువారం రవీంద్రభారతిలో శ్రీసాయి చంద్ర ఎడ్యుకేషనల్, కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు, పేదవిద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు మాదారి తిరుపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వకుళాభరణం కృష్ణమోహన్‌రావు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులు, పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీసాయిచంద్ర ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విభిన్నమైన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. దివ్యాంగులకు సరైన ప్రోత్సాహం లభిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు.

ఈ సందర్భంగా ప్రముఖ డెంటల్ డాక్టర్ ఓ.నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. డా.కుసుమ భోగరాజు, దైవజ్ఞశర్మ, జీఎస్.కుమారస్వామి, డా.సునీల్, దుర్గారామ్, వి.సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు ప్రముఖ గాయని ఆమని నేతృత్వంలో సంగీత విభావరి నిర్వహించారు. చక్కటి గీతాలపనతో గాయకులు అలరించారు.

విద్యార్థినితో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

● పాఠశాల కార్యదర్శిని అరెస్ట్ చేసిన పోలీసులు

చాంద్రాయణగుట్ట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఓ పాఠశాల ఉపాధ్యాయుడు పక్కదారి పట్టాడు. విద్యార్థునులతో అసభ్యకరంగా ప్రవరిస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడు. పాతబస్తీలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 14 ఏళ్ల బాలిక చదువుకుంటున్నది. బుధవారం భోజన విరామ సమయంలో భోజనం చేసి క్లాస్‌రూమ్‌కు వెళ్తుండగా పాఠశాల కార్యదర్శి బాలికను స్టాఫ్ రూమ్‌లోనికి పిలిచి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తప్పించుకుని ఇంటికి వెళ్లి జరిగిన విషయం తల్లిదండ్రులకు తెలిపింది. బాలిక తల్లిదండ్రులు బుధవారం ఛత్రినాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు. పాఠశాల కార్యదర్శి చంద్రప్రకాశ్‌వర్మను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నటనలో జీవించి మెప్పించడం అభినందనీయం

● పడమట సంధ్యారాగం యూనిట్‌కు అభినందన సత్కారం

రవీంద్రభారతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నటనలో జీవించి మెప్పించడం అభినందనీయమని, అలాంటి నటులను సత్కరించుకోవడం సంతోషకరమని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పేర్కొన్నారు. అభినందన సంస్థ ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతి ప్రధాన వేదికపై వివిధ తెలుగు టీవీ చానల్స్, సీరియల్స్‌లోని నటీనటులతో పాటు పడమట సంధ్యారాగం సీరియల్ యూనిట్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు హాజరై నటీనటులను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టెలివిజన్ తెలుగు సీరియల్ కుటుంబ కళాంశాలు ప్రేక్షకుల ఆదరణ పొందడం అభినందనీయమని అన్నారు. ఉత్తమ నటీనటులను సత్కరించుకోవడం సంతోషకరమని అన్నారు. పడమటి సంధ్యారాగం సీరియల్ మాత్రమే కాదని ప్రజల హృదయాలను స్పృశించి మధుర జ్ఞాపకాలను విగులుస్తున్న ధారావాహిక అని కొనియాడారు. టీవీ సీరియల్‌లు.. సినిమాల కన్నా మించి ప్రజాధారణ పొందుతున్నాయని పేర్కొన్నారు. విశిష్ఠ అతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ ఉత్తమ నటన కనబరచిన నటీనటులను సత్కరించుకోవడం ఆనందకరమని అన్నారు. కార్యక్రమంలో బండారు సుబ్బారావు, ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు ప్రముఖ గాయకుడు డి.ఏ.మిత్ర నేతృత్వంలో సంగీత విభావరి నిర్వహించారు. అభినందన సంస్థ సభ్యులచే కోలాటం ప్రదర్శన నిర్వహించారు. కళాకారులను సంస్థ అధినేత్రి డా.భవాని సత్కరించి అభినందించారు.



నటీనటులను సత్కరిస్తున్న అతిథులు

పర్యాటకు రంగంలో డ్రైవర్ల పాత్ర కీలకం

● టూరిజానికి బ్రాండ్ అంబాసిడర్లుగా క్యాబ్ డ్రైవర్లు
● ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ జయదేవ్



శిక్షణా శిబిరంలో క్యాబ్‌డ్రైవర్లు

శంషాబాద్ రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగంలో క్యాబ్ డ్రైవర్లది కీలక పాత్ర అని, టూరిజానికి వారు బ్రాండ్ అంబాసిడర్లు అని ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం లో 'అతిథి దేవోభవ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది క్యాబ్‌డ్రైవర్లకు రెండు సెషన్లలో ప్రయాణికులు, పర్యాటకుల పట్ల పాటించే మర్యాదలు, పరిశుభ్రత, సీపీఆర్ తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జయదేవ్ మాట్లాడుతూ దేశంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందాలంటే క్యాబ్/ఆటోడ్రైవర్ల పాత్ర చాలా కీలకమని అన్నారు. అతిథి దేవో భవ కార్యక్రమం కింద దాదాపు 200 మంది క్యాబ్ డ్రైవర్లకు శిక్షణ అందించినట్లు ఆయన తెలిపారు. క్యాబ్ డ్రైవర్లకు సీపీఆర్ కిట్లను అందజేశారు. టూరిజం కమిటీ చైర్‌పర్సన్ రాఖీ కంకారియా, తెలంగాణ ప్రభుత్వ పర్యాటక శాఖ, జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు, అపోలో హాస్పిటల్స్, కోఠారి గ్రూప్, సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా, ఐఐహెచ్ఎం త్రిపుర కన్‌స్ట్రక్షన్ సంస్థల భాగస్వామ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు జయదేవ్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, జీఎంఆర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా

డాక్టర్ నరేంద్ర కుమార్



హైదరాబాద్ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఏ.నరేంద్రకుమార్‌ను నియమించారు. ఆయన గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ నరేంద్ర కుమార్ నిలోఫర్ ఆస్పత్రిలో పీడియాట్రిక్ సర్జరీ ప్రొఫెసర్‌గా సేవలు అందించారు. అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పదోన్నతి పొంది ఆయన వనపర్తిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయి వెళ్లారు. డిసెంబర్ 2021 నుంచి ఈ రోజు వరకు అక్కడ ఆయన సేవలు అందించారు. గురువారం ఉస్మానియా మెడికల్ కాలేజీ వచ్చిన ఆయన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు, నిలోఫర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నరేంద్రకుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు



సమీక్షా సమావేశంలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పక్కన పోలీసు అధికారులు

చెక్‌పోస్టులు, సున్నిత ప్రాంతాల్లో

సీఆర్‌పీఎఫ్ బలగాల మోహరింపు

హైదరాబాద్ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చెక్ పోస్టులు, సున్నిత ప్రాంతాలలో సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించి మద్యం, డబ్బు, డ్రగ్స్ పంపిణీని అరికట్టాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి అదనపు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బందోబస్తు, ఎన్నికల ఏర్పాట్లపై పోలీస్ అధికారులు, వికారాబాద్ జిల్లా ప్రభుత్వ అధికారులతో గచ్చిబౌలిలోని కమిసనరేట్‌లో గురువారం సీపీ అవినాష్ మహంతి సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్‌లు, వికారాబాద్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో ఫస్టియర్ ఫలితాలివ్వాలి

● జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌కు రిజిస్ట్రార్ ఆదేశం

హైదరాబాద్ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఫస్టియర్, సెకండియర్, థర్డ్‌ఇయర్ సెమిస్టర్ పరీక్షలు పూర్తయి రెండు నెలలవుతున్నా ఫలితాలు ఇవ్వకపోవడంపై వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జేఎన్‌టీయూలో ఫలితాల కోసం ఎదురుచూపులు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సింహారెడ్డిని, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిని తన చాంబర్‌కు పిలిపించిన రిజిస్ట్రార్.. మూడు రోజుల్లోగా ఫలితాలు వెల్లడించాల్సిందేనని, లేనిపక్షంలో బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది కొరతను సాకుగా చూపి ఫలితాలను నిలిపివేయడం ఏంటని కళాశాల అధికారులను ఆయన ప్రశ్నించారు. ఎవరైనా సిబ్బంది అకస్మాత్తుగా మానేస్తే, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోలేకపోతే ఎలాగని అధికారుల తీరును తప్పుపట్టారు.

వారం రోజుల్లో జీతాల సమస్య పరిష్కారం

అడ్డగుట్ట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు 'మూడు నెలల నుంచి జీతాల్లేవ్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో ప్రభుత్వం స్పందించింది. గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఉద్యోగులకు కేవలం రెండు నెలల జీతాలు మాత్రమే రాలేదని, వారం రోజుల్లో ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహిళా సాధికారతే లక్ష్యం

● మంత్రి సీతక్క
● రవీంద్రభారతిలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



పురస్కారగ్రహీతలు జమీల నిషత్, అరిపిన జయలక్ష్మి, బీనా కేశవరావు, అరుణ భిక్షు, ముక్తేవి భారతిలను సత్కరిస్తున్న మంత్రి సీతక్క

రవీంద్రభారతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మహిళా సాధికారితే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గురువారం రవీంద్రభారతిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలను లక్ష నగదు, శాలువాతో మంత్రి సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నారని తెలిపారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడం కోసం ప్రత్యేక నిధితో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళా కమిషన్‌ను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. సభ వేదికపై కళాకారిణి మత్తెడ సారమ్మ ప్రదర్శించిన డప్పు ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మంత్రి సీతక్కతోపాటు దివ్యాంగులు మత్తెడ సారమ్మతో కలిసి డ్యాన్స్ చేసి అలరించారు.

అవార్డుగ్రహీతలు వీరే

తానిపర్తి చికిత, కుడుముల లోకేశ్వరి, డా.ముక్తేవి భారతి, దేవనపల్లి వీణ వాణి, సరయ జబీన్, డా.సరోజన బండ, బిన కేశవరావు, గుర్జాల సరోజ, జమీల నిషత్, అరిపిన జయలక్ష్మి, డి.భాగ్య, అరుణ బిక్షు, సునీల ప్రకాష్, బండి రాములమ్మ, గొరిగె నీల, మత్తడి సారవ్వ, సీహెచ్ పుష్ప, సఫా, ఎన్జీఓ, శక్తి టీం లకు మహిళా దినోత్సవ పురస్కారాలను ప్రదానం చేశారు.

'కాంటినెంటల్'లో బాలుడికి అరుదైన గొంతు శస్త్రచికిత్స



బాలుడితో ఆస్పత్రి చైర్మన్ గురియున్‌రెడ్డి

హైదరాబాద్‌సిటీ,రాయదుర్గం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఓ బాలుడికి మూగబోయిన గొంతుకు కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు అరుదైన సర్జరీని విజయవంతంగా నిర్వహించి ప్రాణంపోశారు. పల్నాడు జిల్లా నకిరేకల్లు గ్రామానికి చెందిన 9ఏళ్ల మహ్మాద్ మూడో తరగతి చదువుతున్నాడు. గతనెల 29న పాఠశాలలో తోటి పిల్లలతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఇనుప రాడ్డుపై పడ్డాడు. దీంతో రాడ్డు గొంతుకు బలంగా గుచ్చుకోవడంతో శ్వాసనాళం, స్వరపేటిక పూర్తిగా చితికి శ్వాసపీల్చుకోవడం, మాట్లడడం ఇబ్బందిగా మారింది. స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. దీంతో ఆ బాలుడిని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు శ్వాసతీసుకోవడానికి తాత్కాలికంగా కృత్రిమ పైపు అమర్చారు. ఆ తర్వాత ఆ బాలున్ని కుటుంబ సభ్యులు నగరంలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ దుష్యత్ వైద్యబృందం బాలుడిని పరీక్షించి లెరింగో ట్రికిల్ రీకన్‌స్ట్రక్షన్ సర్జరీ చేయాలని నిర్ణయించింది. అరుదైన ఈ సర్జరీ ఇటీవల జరిగిన సందర్భాలు చాలా తక్కువ ఉన్నాయని, ఇది స్పెషల్ కేసుగా తీసుకుని చికిత్స అందించినట్లు తెలిపారు. బాలుడి శ్వాసనాళానికి విజయవంతంగా శస్త్రచికిత్స చేసి అతని గొంతుకు మళ్లీ ప్రాణం పోశారు.

కీర్తి పురస్కారాలకు 46 మంది ఎంపిక

హైదరాబాద్ సిటీ, మార్చి14 (ఆంధ్రజ్యోతి): 2022 సంవత్సరానికి ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 46 ప్రముఖులను కీర్తి పురస్కార గ్రహీతలుగా ఎంపిక చేసినట్లు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ భట్టు రమేష్ తెలిపారు. యూనివర్సిటీ నాంపల్లి ప్రాంగణంలో ఈనెల 20, 21 తేదీల్లో జరిగే ప్రత్యేక ఉత్సవంలో పురస్కార గ్రహీతలకు ఒక్కొక్కరిని 5,116నగదుతో సత్కరిస్తామని పేర్కొన్నారు. కీర్తి పురస్కారాలకు పీ.శ్రీహరిదాసు (ఆధ్యాత్మికం సాహిత్యం), ఆచార్య చల్ల శ్రీరామచంద్రమూర్తి (ప్రాచీన సాహిత్యం), దాట్ల దేవదానం రాజు (సృజనాత్మక సాహిత్యం), జాలది రత్నసుధీర్ (కాల్పనిక సాహిత్యం), జీవీ రత్నాకర్ (అనువాద సాహిత్యం), గుర్రం సీతారాములు (అనువాదం), షేక్ మహబూబ్ జాన్ (బాల సాహిత్యం), నామని సుజనాదేవి (ఉత్తమ రచయిత్రి), రంగరాజు పద్మజ (ఉత్తమ రచయిత్రి), పెరుగు రామకృష్ణ (రచన కవితా), మేడిచర్ల ప్రభాకర్‌రావు (పద్య రచన), కె.బాలస్వామి (పద్య రచన), చొప్పదండి సుధాకర్(కథ), కె.శ్రీదేవి (నవల), డి.మోహన్‌రావు (హస్య రచన), దాస్యం సేనాధిపతి (వివిధ ప్రక్రియలు), ఏ.శివప్రసాద్- బైపాస్ (ఉత్తమ నాటక రచయిత), మోహన్ సేనాపతి (ఉత్తమ నటుడు), లలితరాజ్ (ఉత్తమనటి), గరికపాటి కాళిదాస్ (నాటక రంగంలో కృషి), పి.రామ్మోహన్‌రావు (జనరంజక విజ్ఞానం), శ్రీనివాస్‌రాజు (పరిశోధన), ఎం.గోనేనాయక్ (భాష), బూదాటి వెంకటేశ్వర్లు (సాహిత్య విమర్శ), రఘురామ శర్మ (అవధానం), కొల్లపురం విమల (మహిళా అభ్యుదయం), కొడాలి వెంకటేశ్వరరావు(లలిత సంగీతం), ప్రసన్నకుమారి (శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు), ఎం.భిక్షునాయక్ (జానపద గాయకులు), ఎస్కే బాబూజీ (జానపద కళలు), కె.వెంకట సంతోష్‌బాబు (జీవిత చరిత్ర), బుర్ర మధుసూదన్‌రెడ్డి (పత్రికా రచన), ఆర్‌ఎల్‌వీ రమేష్ (ఆంధ్రనాట్యం), ఎస్పీ భరత్ (కూచిపూడి నృత్యం), జీవీఎన్ రాజు (వ్యక్తిత్వ వికాసం), షరీఫ్ గోరా (హేతువాద ప్రచారంలో కృషి), చేగోని రవికుమార్ (గ్రంథాలయ సమాచార విజ్ఞానం), అనుముల శ్రీనివాస్ (గ్రంథాలయ కర్త), మాడిశెట్టి గోపాల్ (సాంస్కృతిక సంస్థ నిర్వహణ), బీవీ సత్య నగేష్ (ఇంద్రజాలం), మృత్యుంజయ (కార్టూనిస్టు), నూనె వెంకటయ్య (జ్యోతిష్యం), సీ.రామనాథశర్మ (ఉత్తమ ప్రధానోపాధ్యాయులు), గౌరి వేముల (చిత్ర లేఖనం-మహిళ), తగుళ్ల గోపాల్ (వచన కవిత, యువకవి), ఎస్‌వీ రఘువీర్ ప్రతాప్ (తెలుగు గజల్)లు ఎంపికయ్యారు.

వాతావరణ మార్పులకు మీడియా ప్రాధాన్యమివ్వాలి

● మానవాళికి ప్రమాదకరంగా పట్టణీకరణ: 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్
● వాతావరణ మార్పులపై జర్నలిస్టులకు రెండ్రోజుల శిక్షణ



కరదీపిక ఆవిష్కరణలో కె.శ్రీనివాస్, జెన్నిఫర్ లార్సన్, శ్రీనివాస్‌రెడ్డి, విరాహత్ అలీ, భీమారావు

బర్కత్‌పుర, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణీకరణ నేటి మానవాళికి ప్రమాదకరంగా మారిందని, హైదరాబాద్ కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయిందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ అన్నారు. వాతావరణంలో మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు వంటి అంశాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వాతావరణ మార్పులపై అధ్యయనం చేసి అవగాహన పెంచుకోవాలని విలేకరులకు సూచించారు. ఈ మేరకు టీయూడబ్ల్యూజే, వ్యూస్ స్వచ్ఛంద సంస్థ, యూఎస్ కాన్సులేట్ ఆధ్వర్యంలో 'వాతావరణ మార్పులు' అంశంపై జర్నలిస్టులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మీడియా రంగం తాత్కాలికమైన అంశాలకు, రాజకీయ అంశాలకు ఇచ్చినంత ప్రాధాన్యం వాతావరణ మార్పులకు ఇవ్వడం లేదన్నారు. మానవాళి మనుగడను ప్రశ్నార్థకంలో పడేస్తూ.. దీర్ఘకాలికంగా అంతర్లీనంగా కొనసాగుతున్న మార్పులను, భవిష్యత్‌లో జరగబోయే విపత్తులను గుర్తించలేకపోతున్నామని పేర్కొన్నారు. వాతావరణ మార్పులపై మాట్లాడినా, ఉద్యమించిన వారిని కొన్నివర్గాలు అభివృద్ధి వ్యతిరేక శక్తులుగా చూడడం సరికాదన్నారు. మనుషుల మనుగడతో ముడిపడి ఉన్న ప్రకృతి వైపరీత్యాలపై సున్నితంగా ఆలోచించి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గతంలో మరో ఊటీగా పేరొందిన హైదరాబాద్‌లో ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని గుర్తు చేశారు. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, మానవ తప్పిదాలే ప్రకృతి వైపరీత్యాల రూపంలో మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయని అన్నారు. వాతావరణ మార్పులను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మీడియాకు ఉందని అభిప్రాయపడ్డారు. యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ మాట్లాడుతూ వాతావరణ మార్పులపై మీడియా రంగం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 'వ్యూస్' సంస్థ రూపొందించిన వాతావరణ మార్పుల కరదీపకను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె విరాహత్ అలీ, వ్యూస్ ఈడీ భీమారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన సినీ ప్రముఖులు

హైదరాబాద్, మార్చి14(ఆంధ్రజ్యోతి): సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని పలువురు సినీ ప్రముఖులు గురువారం కలిశారు. సీనియర్ దర్శకుడు కె. రాఘవేంద్రరావు మంత్రిని కలిసి సినిమా పరిశ్రమలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను వివరించారు. కళాకారులకు అవార్డులు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయం పరిశ్రమలో సహృద్భావ వాతావరణం తీసుకొచ్చిందని రాఘవేంద్రరావు ఆనందం వ్యక్తం చేశారు. 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు, శివబాలాజీ కూడా మంత్రిని కలిశారు. సినీ కళాకారుల ఇబ్బందులు, అవసరాలను, ప్రభుత్వం తరఫున అందించాల్సిన సహకారం గురించి చర్చించారు.

రూ.7.55లక్షల కోట్లకు చేరిన ఎస్‌బీఐ డిపాజిట్లు

● ఎస్‌ఎల్‌బీసీ ఆధ్వర్యంలో 40వ త్రైమాసిక సమీక్షా సమావేశం

హైదరాబాద్ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎస్‌బీఐ బ్రాంచుల్లో డిపాజిట్లు ఈ ఏడాదిలో రూ. 72,795 కోట్లు పెరిగి రూ. 7.55లక్షల కోట్లకు చేరుకున్నాయని ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్ తెలిపారు. తెలంగాణ స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) ఆధ్వర్యంలో గురువారం 40వ త్రైమాసిక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ మాట్లాడుతూ ఎస్‌బీఐ తెలంగాణ వ్యాప్త శాఖల ద్వారా రూ.624 కోట్ల విద్యా రుణాలు, గృహ రుణాలను పంపిణీ చేసిందన్నారు. అంతేకాకుండా రూ.85,799.65 కోట్లను సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విభాగానికి పంపిణీ చేసిందన్నారు. ప్రధానమంత్రి ముద్రా యోజన పథకం కింద రూ.7,895 కోట్లను మంజూరు చేసి వార్షిక లక్ష్యాలలో 74 శాతం సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ ఎఫ్‌ఐడీడీ డీజీఎం జగదీష్ కుమార్, నాబార్డ్ జీఎం పి.టి.ఉషా, ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్, ఎస్‌బీఐ జీఎం దేబాశిష్ మిత్రా తదితరులు పాల్గొన్నారు.

43 తప్పుడు బర్త్ సర్టిఫికేట్లు జారీ చేసినట్లు నిర్ధారణ
ఫలక్‌నుమా సర్కిల్ సీనియర్ అసిస్టెంట్ అరెస్ట్

మదీన, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా సర్కిల్‌లో బర్త్ సర్టిఫికేట్ల జారీలో అవకతవకలకు పాల్పడ్డ సీనియర్ అసిస్టెంట్‌ను చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. సీనియర్ అసిస్టెంట్‌ను బల్దియా ఉన్నతాధికారులు ఇప్పటికే విధుల్లోనుంచి తప్పించారు. వివరాలిలా ఉన్నాయి. ఫూల్‌బాగ్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయం సర్కిల్-10లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ కొన్నేళ్లుగా మీ సేవ కేంద్రాల నిర్వాహకులతో కుమ్మక్కై తప్పుడు బర్త్ సర్టిఫికేట్లు జారీ చేస్తున్నాడు. బర్త్ సర్టిఫికేట్ల జారీలో గందరగోళం జరుగుతున్నట్లు సమాచారం తెలుసుకున్న జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం అధికారులు ఈనెల 5న ఫలక్‌నుమా సర్కిల్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. సత్యనారాయణ అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించారు. సుమారు 43 బర్త్ సర్టిఫికేట్లకు సంబంధించిన వివరాలు అందుబాటులో లేనట్లుగా గుర్తించారు. దీనికి బాధ్యుడైన అతన్ని మార్చి 5నే సస్పెండ్ చేశారు. దీనిపై మరింత లోతుగా విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వై.శ్రీనివాస్‌రెడ్డి చాంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సత్యనారాయణను అదుపులోకి తీసుకుని విచారించి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ కె.గురునాథ్ తెలిపారు.

భూవివాదంలో జోక్యం..

● 36 మందిపై కేసు.. ఐదుగురికి రిమాండ్ ● పరారీలో మాజీ సీఎం బంధువు ● ఆలస్యంగా వెలుగులోకి ఘటన



వివాదానికి కారణమైన భూమి

ఆదిభట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఓ భూవివాదం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. భూ వివాదంలో సర్దుబాటు కోసం వచ్చి ప్రహరీని ధ్వంసం చేసిన 36 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మిగతా వారి కోసం గాలిస్తున్న విషయం హాట్‌టాపిక్‌గా మారింది. వివరాల్లోకి వెళితే..

జక్కిడి సురేందర్‌రెడ్డికి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 32లో 2.15 గుంటల భూమి ఉంది. సురేందర్‌రెడ్డి దాదాపు కోటి రూపాయలకు ఆ భూమిని 2013లో చామ సురేష్‌కు జీపీఏ చేశాడు. అయితే, డబ్బులు తిరిగి చెల్లించిన తర్వాత మళ్లీ భూమిని తనపేరున చేసేలా ఒప్పందం చేసుకొన్నాడు. రెండు నెలల తర్వాత ఆ భూమిని సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న చామ సురేష్.. సురేందర్‌రెడ్డి ఎంతకీ డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో పాటు ఓఎస్ఆర్ గ్రూప్ సంస్థకు విక్రయించాడు. ఈ విషయం తెలుసుకున్న సురేందర్‌రెడ్డి తరచూ ఓఎస్ఆర్ గ్రూప్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌తో గొడవకు దిగుతూ భూ హద్దులు తొలగించడం వంటి చర్యలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో సురేందర్‌రెడ్డితో పాటు అతడి సోదరులపై కేసులు సైతం నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి బంధువు కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావును సురేందర్‌రెడ్డి కలిసి భూ వివాదంలో జోక్యం చేసుకోవాలని కోరాడు. సర్దుబాటు చేయడానికి కొంత డబ్బు చెల్లిస్తానని 2021లో ఒప్పందం కుదుర్చుకుని, అందులో కొంత అడ్వాన్స్‌గా (దాదాపు రూ.2 కోట్లు మాట్లాడుకోగా.. అడ్వాన్స్‌గా రూ.40 లక్షలు) ఇచ్చినట్లు సమాచారం. అయితే, ఒప్పందం కుదుర్చుకొని రెండేళ్లు గడిచినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో కన్నారావుపై సురేందర్‌రెడ్డి ఒత్తిడి పెంచారు. దాంతో ఈనెల 3న తెల్లవారుజామున కల్వకుంట్ల కన్నారావు అతడి సహాయకుడు డేనియల్, శివలతో పాటు సుమారుగా నలభై మంది వరకు వచ్చి.. భూమి వద్ద కాపలాగా ఉన్న వాచ్‌మన్, సెక్యూరిటీ గార్డులపై దాడి చేశారు. వాచ్‌మన్ కోసం వేసిన గుడిసెను తగలబెట్టి, ఎక్స్‌కవేటర్ సాయంతో ప్రహరీని కూల్చివేశారు. డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌తోపాటు ఓనర్‌ను, మరో ముగ్గురు కలిపి మొత్తం అయిదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జక్కిడి సురేందర్‌రెడ్డి, హరినాథ్, కన్నారావులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు పర్యవేక్షణలో పన్నెండు మందితో కూడిన మూడు పోలీసు బృందాలు వారికోసం గాలిస్తున్నాయి. ప్రస్తుతం వారి సెల్‌ఫోన్ సిగ్నల్స్ కర్నాటక రాష్ట్రం బెంగళూరులో చూపిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, పరారీలో ఉన్న జక్కిడి సురేందర్‌రెడ్డి, హరినాథ్, కన్నారావులను పట్టుకున్నాక పూర్తి వివరాలు మీడియాకు వెల్లడిస్తామని ఆదిభట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు.

తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలి

● వారం రోజుల్లో ప్రభుత్వ నిర్ణయం ప్రకటించాలి..




సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

పంజాగుట్ట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో, కేసీఆర్ పదేళ్ల పాలనలో ఉద్యమకారులు, ప్రజలపై పెట్టిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. వారం రోజుల్లో ప్రభుత్వం తన నిర్ణయం ప్రకటించాలని, లేనిపక్షంలో ఇందిరాపార్కు వద్ద ఆమరణ దీక్షలు చేపడతామని వారు హెచ్చరించారు. లౌకిక ప్రజాస్వామిక ఐక్య కార్యాచరణ వేదిక, తెలంగాణ ప్రజాస్వామ్య రక్షణ వేదికల ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రజా ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులపై అన్యాయంగా, అక్రమంగా పెట్టిన కేసులని, ప్రభుత్వం తల్చుకుంటే గంటలోనే వీటిని ఉపసంహరించుకోవచ్చని ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. కేసుల ఉపసంహరణపై వారం రోజుల్లో ప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రకటించాలని, లేనిపక్షంలో ఇందిరాపార్కు వద్ద నిరాహారదీక్షలు, అవసరమైతే ఆమరణదీక్ష చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇబ్బందులు తీరుతాయనుకుంటే, నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందనుకుంటే ప్రశ్నించే వారిపై కేసులు పెట్టిన వ్యక్తిని టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా తెచ్చారని ఆరోపించారు. ఉద్యమకారులపై కేసులు ఎత్తివేస్తే ప్రభుత్వంపై ఆర్థిక భారం పడదని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రభుత్వ తీరును ఎండగడుతూ గత ఏడాది చేపట్టిన బస్సుయాత్రలో కేసీఆర్ పోటీచేసిన గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాలలో రెండుచోట్లా తనపై కేసులు పెట్టారన్నారు. తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలోను, పలు సందర్భాల్లోనూ పెట్టిన కేసులు ఇప్పటికీ కొనసాగుతుండడం దారుణమని, అనేకమందితో పాటు తాము కూడా బాధితులమేనని అన్నారు. పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపు తమను కేసుల నుంచి విముక్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి మరో కేసీఆర్‌లా మారుతుంటే చూస్తూ ఊరుకోమని తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం ప్రతినిధి సతీష్ కమల్ అన్నారు. తమపైన గత, ప్రస్తుత ప్రభుత్వాలు పలు కేసులు పెట్టాయని సీపీఎం(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.గోవర్ధన్ అన్నారు.

సమావేశంలో వివిధ సంఘాల నాయకులు, ఉద్యమకారులు పృథ్వీరాజ్ యాదవ్, కరుణాకర్ దేశాయ్, సోగరా బేగం, ఖలీదా పర్వీన్, తుకారం, కామేశ్వరరావు, నాగేశ్వరరావు, స్నేహ రెడ్డి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

బైక్ ఇవ్వాలని మేనత్త, మామపై కత్తితో దాడి

● పరారీలో బాలుడు
● గంజాయి మత్తులో చేశాడని అనుమానం



చిరంజీవి, ప్రియ

వనస్థలిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తన ద్విచక్రవాహనం తనకు తిరిగి ఇవ్వాలని మేనత్త, మామపై బాలుడు కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన ఓ బాలుడు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రినగర్ బ్యాంక్‌కాలనీలో తల్లితో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజుల కిందట తల్లి గుంటూరుకు వెళ్లడంతో బాలుడు ఒక్కడే ఉంటున్నాడు. ఇతడి బాగోగులను బాలాపూర్‌లో నివాసముంటున్న మేనమామ పి.చిరంజీవి(43), మేనత్త ప్రియ(42) చూస్తున్నారు. ప్రతీవారం బాలుడి వద్దకు వచ్చి ఖర్చులకు డబ్బులు ఇచ్చి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో బాలుడికి తల్లి కొనిచ్చిన బైక్‌ను మేనమామకు ఇచ్చాడు. గురువారం మధ్యాహ్నం తిరిగి బైక్ ఇవ్వాలని బాలుడు మేనమామ, మేనత్తతో బ్యాంక్‌కాలనీలో గొడవపడ్డాడు. కర్రతో కొట్టాడు. కూరగాయలు కోసే కత్తితో చిరంజీవిపై దాడి చేశాడు. అడ్డుకోబోయిన ప్రియ ముఖం, చేయిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. గమనించిన స్థానికులు సంఘటన స్థలానికి రావడంతో బాలుడు పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు చిరంజీవి, ప్రియలను వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి కోసం గాలిస్తున్నారు. గంజాయి మత్తు లోనే బాలుడు దాడికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



నిర్వాహకులకు లైసెన్సు ఇస్తున్న డాక్టర్ మీనాక్షి రామన్ సుందరం

'గ్లిమినో'కు డీఆర్‌ఆర్ ధాన్ 48 వరి రకాల విక్రయ లైసెన్సు

రాజేంద్రనగర్, మార్చి14(ఆంధ్రజ్యోతి) : రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్‌ఆర్) డీఆర్‌ఆర్ ధాన్ 48 వరి రకానికి సంబంధించిన టెక్నాలజీ లైసెన్సును గురువారం తెలంగాణకు చెందిన గ్లివినో కంపెనీ నిర్వాహకులు విక్రమ్ ఆదిత్యకు అందజేసింది. ఈ సందర్భంగా ఐఐఆర్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ మీనాక్షి రామన్ సుందరం మాట్లాడుతూ, డీఆర్‌ఆర్ ధాన్ 48 వరి రకం తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్నందు వల్ల టైప్ -2 డయాబెటిస్‌తో బాధపడే వ్యక్తులు తీసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఈ వరి రకం తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌తో పాటు అధిక జింక్ కలిగి ఉంటుందన్నారు. ఎండాకు తెగులును తట్టుకునే శక్తి కలిగి ఉంటుందన్నారు. గ్లిమినో కంపెనీ ఈ లైసెన్సు తీసుకోవడం ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలలో ఆసక్తి గల వినియోగదారులకు డీఆర్‌ఆర్ ధాన్ 48 రకం వరి బియ్యాన్ని విక్రయించుకోవచ్చన్నారు.

రూ7.74 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): యూట్యూబ్ వీడియోలు లైక్, సబ్‌స్క్రైబ్ చేస్తే డబ్బులు ఇస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు యువతి నుంచి రూ.7.74లక్షలు కాజేశారు. నగరానికి చెందిన యువతికి వాట్సాప్‌లో ఇంట్లోనే కూర్చొని సంపాదించేందుకు పార్ట్ టైం జాబ్ పేరుతో సందేశం వచ్చింది. స్పందించి సంప్రదిస్తే, వారు టెలీగ్రామ్ గ్రూప్‌లో జాయిన్ చేశారు. కొంతమొత్తం పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని నవిమ్మించి మొదట కొంతమొత్తం చెల్లించారు. ఎక్కువ లాభాలు రావాలంటే ఎక్కువ డబ్బులు పెట్టాలని చెప్పి రూ. 7.74లక్షలు కాజేశారు. తర్వాత స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కార్యాలయం మెరుగులకు రూ.కోట్లలో ఖర్చు


(5వ పేజీ తరువాయి)

నానక్‌రాంగూడలో ఉండేది. రూ.3.50 కోట్లు వెచ్చించి హెచ్‌జీసీఎల్‌లోని టీఎస్‌బీపాస్ కార్యాలయాన్ని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. గతంలో మున్సిపల్ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఇదే కార్యాలయంలో సమావేశాలు నిర్వహించేవారు. ఐటీ కారిడార్‌లో అనువుగా ఉన్న హెచ్‌జీసీఎల్ కార్యాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సైతం సమావేశాలకు వినియోగిస్తున్నారు. దీంతో నానక్‌రాంగూడలోని హెచ్‌జీసీఎల్ కార్యాలయాన్ని, అర్బన్ ఫారెస్ట్ విభాగాన్ని పైగా ప్యాలెస్‌కు తరలిస్తున్నారు. టీఎస్‌బీపాస్‌ను ఇప్పటికే మాసబ్‌ట్యాంక్‌లోని మున్సిపల్ శాఖ సముదాయానికి తరలించారు. అక్కడ కూడా ఇంటీరియర్ డిజైన్‌కు రూ.3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది.

ప్రధాని పర్యటనకు భారీ ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి) నుంచి లాలాపేట, మౌలాలి వైపు పంపుతారు.

● నేరేడ్‌మెట్, సఫిల్‌గూడ నుంచి మల్కాజిగిరి వైపు వచ్చే వాహనాలను ఆనంద్‌బాగ్ క్రాస్ రోడ్స్ నుంచి ఉత్తమ్‌నగర్, ఓటీసీ, సికింద్రాబాద్ వైపు మళ్లిస్తారు. ● జడ్‌టీసీ జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను మౌలాలి, ఈసీఐఎల్, నేరేడ్‌మెట్ వైపు పంపుతారు. ● బేగంపేట విమానాశ్రయం నుంచి పీఎన్‌టీ జంక్షన్, సీటీఓ, సంగీత్, మెట్టుగూడ, మల్కాజిగిరి, లాలాపేట, తార్నాక, గ్రీన్‌ల్యాండ్స్, మోనప్ప జంక్షన్, రాజ్‌భవన్, వీవీస్టాచ్యూ పరిసరాల్లో సందర్భాన్ని బట్టి వాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుంది.



పాపాలు చేస్తే...

"కాశీ మోక్షదాయిని ఎలా అయింది?" అనే నా ప్రశ్నకు.. శ్రీ మహా విష్ణువుకు పరమశివుడు ఇచ్చిన వరమే దానికి కారణమని శ్రీ రామశాస్త్రి చక్కని వివరణ ఇచ్చారు. ఆయన కాశీలో తొమ్మిదినెలలపాటు నివసించడానికి వచ్చారు. భార్యాసమేతంగా వచా ఆంధ్రాశ్రమంలో ఉంటున్నారు. ఆయన సమాధానం నాకు సంతృప్తి కలిగించినా... నా మనసులో ఇంకా ఏదో సందేహం మెదులుతూనే ఉంది. కాశీలోనే మోక్షం ఎందుకు లభిస్తుంది? మరే నగరమూ మోక్షదాయని కాదా?... ఈ సందేహంతోనే కాశీ అంతటా తిరుగుతున్నాను. నాతోపాటు నా సహోద్యోగి అమిత్ కూడా ఉన్నాడు. మేము అస్సీ ఘాట్‌కు వెళ్ళాం. కాశీ ముముక్షు భవన్‌లో ప్రవేశించాం. దాని మేనేజర్ మనీష్ పాండేని అమిత్ తీసుకొచ్చాడు. ఆయన ఆ ప్రాంగణమంతా మాకు చూపిస్తూ... మొదట ఈశ్వర మఠానికి తీసుకువెళ్ళారు. అది సన్యాసులకోసం ఉద్దేశించినది. వారికి ఉచిత భోజన, వస్త్ర, వసతి సదుపాయం ఉంది. వైద్యం కూడా ఉచితం. ధ్యానం, జపం చేసుకోవడానికి సాధనా కేంద్రం సైతం ఉంది. మోక్షం కోసం కాశీలో బసచేసే దంపతుల కోసం కూడా నలభై గదులతో రెండతస్తుల భవనం ఉంది. అరవై అయిదేళ్ళు పైబడినవాళ్ళకే అక్కడ ప్రవేశం. సన్యాసులతో కలిసి ప్రస్తుతం మూడు వందల మంది అక్కడ ఉంటున్నారు.



గులాబ్ బాయి అనే మహిళను కలిశాం. ఆమె మధ్యప్రదేశ్‌లోని ఇటార్సీ నుంచి వచ్చారు. వయసు తొంభై రెండేళ్ళు. ముప్పై రెండేళ్ళ కిందట భర్తతో కలిసి కాశీ చేరుకొని... అక్కడే నివసిస్తున్నారు. ఆమె భర్తకు అయిదేళ్ళ క్రితం మోక్షం ప్రాప్తించింది. ఆయన మరణిస్తూ "నీ ప్రాణాలు పోయేవరకూ ఇక్కడే ఉండు" అని చెప్పారట. ఆయన సైన్యంలో పని చేసేవారు. పింఛన్ ద్వారా తన జీవితం గడుస్తోందనీ, తనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారనీ, వారు అప్పుడప్పుడు తనను కలవడానికి వస్తారనీ గులాబ్ బాయి చెప్పారు.

అక్క రామకోటి అనే వ్యక్తిని కలుసుకున్నాం. ఆయనది హైదరాబాద్. అసలు పేరు సత్యనారాయణ. ఆయన రామకోటి రాస్తారు. అక్కడ ఉన్నవారితో రాయిస్తారు. "అందరం కలిసి 130 కోట్ల రామనామాలు రాశాం" అని చెప్పారు. అందుకే అందరూ ఆయనను రామకోటి అని పిలుస్తారు.

అనంతరం మేనేజర్ మనీష్ తన కార్యాలయంలోకి తీసుకు వెళ్ళి... మాకు టీ, బిస్కెట్లు ఇచ్చారు.

"ఈ ముముక్షు భవనాన్ని ఎవరు, ఎప్పుడు కట్టించారు?" అని అమిత్ అడిగాడు.

"దీనికి ఆద్యుడు ఘనశ్యామ దత్త. మోక్షగాములకు ఆశ్రయం కల్పించాలనే ఆలోచన ఆయనకు కదిలింది. స్వామి ఈశ్వరానంద తీర్థ సమక్షంలో సన్యాసం స్వీకరించి... ఘనశ్యామానందతీర్థగా మారారు. బిర్లా కుటుంబానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త రాజా బల్దేవ దాస్ బిర్లాను ఆయన కలిసి... తన ఆలోచన పంచుకున్నారు. బల్దేవ్‌దాస్ అయిదెకరాల భూవిని వెంటనే దానం చేసి, దానిలో 150 గదులతో భవనాన్ని నిర్మించి ఇచ్చారు. అలా 1920లో కాశీ ముముక్షు భవన్ అవతరించింది" అని చెప్పారు మనీష్.

"ముముక్షువు అంటే ఏమిటి? కాశీలోనే ముముక్షు భవనాలు ఎందుకు ఉన్నాయి?" అని అడిగాను.

"సనాతన హిందూ ధర్మం ప్రకారం నాలుగు పురుషార్థాలున్నాయి... ధర్మార్థ కామ మోక్షాలు. వీటిని నాలుగు దశల్లో సాధించవచ్చు. అవి: బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం. వైదిక ధర్మాన్ని అనుసరించి మోక్షానికి సరైన మార్గం సన్యాసం. మోక్షాన్ని కోరుకొనే వ్యక్తిని 'ముముక్షువు' అంటారు. ప్రాచీన కాలంలో సన్యాస జీవితాన్ని అడవుల్లో గడిపేవారు. ఆధునిక కాలంలో అది అసంభవం. కాశీ దైవభూమి. మోక్షాన్ని పొందాలనుకొనేవారి కోరికను తీర్చే పవిత్ర భూమి. సంసారికి కూడా మోక్షాన్ని ప్రసాదించే పుణ్య క్షేత్రం. కొందరు సన్యాసాన్ని స్వీకరించకుండానే మోక్షాన్ని కోరుకుంటారు. దానికోసం వారు అంతరంగంలో ఉన్న సమస్త కోరికలను త్యజించాలి. కాశీ ప్రవాసంలో అంతరంగ సన్యాసం లభిస్తుందని హిందువుల ప్రగాఢ విశ్వాసం. కాశీవాసం మోక్షానికి సరళమార్గమని నమ్మకం. అందుకే కాశీలో ముముక్షు భవనాలు వెలిశాయి" అని అన్నారు మనీష్.

"కాశీలో మరణిస్తే ముక్తి లభిస్తుందా?" అని అడిగాడు అమిత్. అతను హెడ్ కానిస్టేబుల్. యూనిఫారంలో ఉన్నాడు. కానీ ధార్మిక విషయాల్లో అతనికి చాలా అభిరుచి ఉంది. ఆధ్యాత్మిక పుస్తకాలు బాగా చదువుతాడు.

అతనివైపు మేనేజర్ ఆశ్చర్యంగా చూశారు. తిరిగి నా వైపు చూశారు. 'నా ప్రశ్న కూడా అదే' అన్నట్టు ఆయనకు సూచించాను.

అప్పుడు ఆయన "కాశ్యాం మరణం ముక్తిః... అన్నారు పూర్వులు. కాశీలో చితాగ్ని నిత్యం... అహర్నిశలూ, అన్ని కాలాల్లో మండుతూనే ఉంటుంది. అది మరణ భయాన్ని పోగొడుతుంది. ఇక్కడ మరణం జీవనలీలగా మిగిలిపోతుంది. కాశీకి 'మహాశ్మశానం' అనే పేరు కూడా ఉంది. ఇక్కడ భస్మమయ్యేది శరీరం ఒక్కటే కాదు... శరీరంతో ముడిపడి ఉన్న అన్ని వాసనలూ భస్మమవుతాయి. దానితో కలిసి ఉన్న గుణాలన్నీ బూడిదవుతాయి. ఆ బూడిదే పరమశివుని నుదుట విభూతి అవుతుంది. అంటే శరీరం శివైక్యం చెందిందన్నమాట. ***మరణం మంగళం యత్ర విభూతిశ్చ విభూషణం - ఔషధం జాహ్నవీతోయం వైద్యో నారాయణో హరిః- కౌపీన్ యత్ర కౌశేయం సా కాశీ కేన్ మీయతే...*** అంటే... ఎక్కడ మరణం మంగళమయమో, ఎక్కడ చితాభస్మం అలంకారమో, ఎక్కడ గంగాజలం ఔషధమో, ఎక్కడ వైద్యుడు నారాయణుడో, ఎక్కడ గోచీ పట్టువస్త్రంతో సమానమో... అటువంటి కాశీని దేనితో పోల్చగలం?.. అని అర్థం" అంటూ వివరించారు.

"మరి ముక్తి ఎలా సాధిస్తారు? సాధన ద్వారానా?" అని అడిగాను.

"కష్టపడి సాధించడానికి ముక్తి అనేది పదార్థమా? ముక్తి అంటే భవబంధాల నుంచి స్వేచ్ఛ పొందడం. అన్నిటితోనూ ఉంటూ... అన్నిటికీ అతీతంగా ఉండడం. సౌభాగ్యంలో వైరాగ్యం, వైరాగ్యంలో సౌభాగ్యం, సంసారంలో సన్యాసం. కాశీ మట్టి విలక్షణమైనది. ఇక్కడి వాళ్ళలో నిశ్చింత కనిపిస్తుంది. కోట్లు గడించాలనే అత్యాశ ఉండదు. ఆ రోజుకు దొరికితే తృప్తి. ఆ తరువాత రెట్టింపు ఇస్తానన్నా రిక్షావాడు కూడా కదలడు. సంపన్నులు సంగీత కార్యక్రమాల్లో, సామాన్యులు జానపద కళల్లో సాయంత్రం సంతోషంగా గడుపుతారు"అని ఆయన చెప్పారు.

"పాపాలు చేసి కాశీ వచ్చినవాళ్ళకు మోక్షం వస్తుందా?" అని ప్రశ్నించాను.

ముముక్షు భవన్‌లో అన్నదాన సత్రం ఉంది. ఆయుర్వేద, హోమియో ఆసుపత్రులున్నాయి. రోజూ రెండువందలమందికి ఉచిత చికిత్స అందిస్తారు.ఆ తరువాత అక్కడి కళాశాలకు, సంస్కృత ప్రాథమిక పాఠశాలకు వెళ్ళాం. సంస్కృత కళాశాలలో ఉచిత విద్య, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. వసతి గృహంలో అరవై మంది విద్యార్థులున్నారు. బయటినుంచి రెండువందల మంది విద్యార్థులు వస్తారు. అనంతరం ముముక్షు భవన్ ప్రాంగణంలోని యజ్ఞశాలను, గుడిని సందర్శించాం. కొందరు సన్యాసులు, వృద్ధులు భజనలు చేస్తూ, భక్తి పారవశ్యంలో ఉన్నారు.

"అవును. కాశీలో ప్రవేశించగానే పాపాలన్నీ ప్రక్షాళన అవుతాయని 'కూర్మపురాణం' చెబుతోంది. మనిషి పాపరహితుడవుతాడు" అన్నారు.

"కాశీలో ఉండి పాపాలు చేస్తే?" అని అడిగాడు అమిత్.

"***కామక్రోధేన్ లోభేన్ గ్రస్తా యే భువి మానవాః- నిష్క్రమంతేనరా దేవీ దండనాయక మోహితాః...*** అని 'మత్స్యపురాణం' చెబుతోంది. అటువంటి వారిని దండపాణి (కాశీ క్షేత్రంలోని ఒక దేవత) కాశీ నుంచి బహిష్కరిస్తాడు. అంటే ఏదో నెపం మీద వారిని కాశీ నుంచి వెళ్ళగొడతాడు. లేదంటే కాశీలోనే అతణ్ణి శిక్షిస్తాడు. కాలభైరవుడు ఆ శిక్ష అమలు చేస్తాడు. వాటిని 'భైరవ యాతనలు' అంటారు. కాశీలో యముడికి అధికారం ఉండదు. పాపం చేసినవారికి శిక్ష పూర్తయ్యాక ముక్తి లభిస్తుంది" అని వివరించారు మేనేజర్. ఆయనకు ధన్యవాదాలు చెప్పి బయలుదేరాం.

• కిల్లాడ సత్యనారాయణ, లక్నో



విశ్వ సృష్టికర్త అయిన అల్లాహ్ సమస్త జీవరాశుల కోసం ఏడాదిలోని పదకొండు నెలలను కేటాయించాడు. ఒక్క రంజాన్ మాసాన్ని మాత్రం తనదిగా నిర్దేశించుకున్నాడు. అందుకే సంప్రదాయికమైన ఇస్లాం ఆరాధనల్లో అత్యధిక భాగాన్ని ఈ నెలలోనే నిర్వహించాల్సి ఉంటుంది. ఆత్మ ప్రక్షాళనకు రంజాన్ అవకాశం అందిస్తుంది. దైవారాధనలో పునరంకితం కావడానికి, వ్యక్తి తన జీవితంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రేరేపించుకోవడానికి, క్రమశిక్షణను అలవరచుకోవడానికి, దైవప్రసన్నతను, దేవుడి కరుణను పొందడానికి అనువైన మాసం ఇది. అలాగే విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని, విశ్వాసుల్లో పరస్పర ఆత్మీయతా భావాన్ని పొంపెందించే మాసం. ఈ నెలలో వయసుతో నిమిత్తం లేకుండా విశ్వాసులందరూ ఆరాధనల్లో నిమగ్నమవుతారు. దేవునిపై విశ్వాసాన్ని మరింత పటిష్టపరచుకుంటారు. పేదలకు ఉన్న హక్కును ధనవంతులకు గుర్తు చేసి... జకాత్, ఫిత్రా లాంటి ధర్మాలను నిర్వర్తింపజేసే నెల... రంజాన్. నిరుపేదల ఆకలి బాధను సంపన్నులకు అనుభవపూర్వకంగా... రోజాల (ఉపవాసాల) ద్వారా తెలియజేసే నెల. ఈ మాసం చివర్లో వచ్చే పర్వదినాన్ని 'ఈదుల్ ఫిత్ర్' అని వ్యవహరిస్తారు.

ఆత్మప్రక్షాళనకు అవకాశం

సందేశం

అంతిమ దివ్య గ్రంథమైన ఖుర్‌ఆన్ అవతరించి, మానవాళికి తన బోధనామృతాన్ని అందజేసిన మాసం రంజాన్. అది మానవాళి అందరికీ మార్గదర్శకమైన, సత్యాసత్య విచక్షణను కలిగించే గ్రంథం. ఇబ్రహీం ప్రవక్తకు సహీఫాలు, మూసా ప్రవక్తకు తౌరాత్ గ్రంథం, దావూద్ ప్రవక్తకు జబూర్ గ్రంథం, ఈసా ప్రవక్తకు ఇంజీల్ గ్రంథాలను ఆ దైవం ప్రసాదించిది కూడా ఈ మాసంలోనే.

అదే విధంగా రంజాన్ ఉపవాసాల నెల. స్వర్గానికి ఎనిమిది ద్వారాలు ఉంటాయనీ, వాటిలో ఒకటి కేవలం ఉపవాసులకే ప్రత్యేకించినదనీ పవిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. యంత్రానికైనా విరామం కావాలి. అప్పుడప్పుడు దాని భాగాల్లో పేరుకున్న మలినాలను తొలగించి, శుభ్రపరచాలి. మానవ శరీరంలోని జీర్ణవ్యవస్థకు విశ్రాంతి ఇచ్చి, దానికి క్రమబద్ధతను చేకూర్చే ఆరాధనే రోజా (ఉపవాసం). ఆ ఉపవాస విధిని ఆచరిస్తూ, దానధర్మాలు చేస్తూ... దైవచింతనలో విశ్వాసులు నిమగ్నం కావాలి. తోటివారితో సోదరభావాన్ని పెంపొందించుకోవాలి. దీని వల్ల అరిషడ్వర్గాలు అదుపులోకి వస్తాయి. జీవితం శాంతిమయమవుతుంది. భగవంతుని కటాక్షం లభిస్తుంది.

• మహమ్మద్ వహీదుద్దీన్



వ్యవసాయ ఉత్పత్తులపై జీఎస్టీ మినహాయింపు

» రైతు రుణమాఫీ.. ఎమ్మెస్పీకి చట్టబద్ధత

» ఐదు 'కిసాన్ న్యాయ్' గ్యారెంటీలు ప్రకటించిన రాహుల్



నాసిక్, మార్చి 14: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వరుసగా హామీలు గుప్పిస్తున్నారు. మహిళలకు ఐదు గ్యారెంటీలు ప్రకటించిన మరుసటి రోజే రైతుల కోసం 'కిసాన్ న్యాయ్' పేరిట మరో ఐదు గ్యారెంటీలను ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో తమను గెలిపిస్తే రైతు రుణ మాఫీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వ్యవసాయ ఉత్పత్తులపై జీఎస్టీ మినహాయిస్తామని చెప్పారు. గురువారం జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఎన్సీపీ అధినేత శరద్‌పవార్, శివసేన(యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్‌తో కలిసి ఆయన మహారాష్ట్ర నాసిక్‌లో రైతుల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం ఎమ్మెస్పీ(కనీస మద్దతు ధర)కి చట్టబద్ధత కల్పిస్తామన్నారు. రైతు రుణ మాఫీ చేసేందుకు, రుణమాఫీ మొత్తాన్ని అంచనా వేసేందుకు శాశ్వత 'వ్యవసాయ రుణమాఫీ కమిషన్'ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పంట నష్టం జరిగితే 30 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో ఇన్సూరెన్స్ డబ్బు జమ అయ్యేలా పంట బీమా పథకంలో మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల ప్రయోజనార్థం కొత్త దిగుమతి- ఎగుమతి విధానాన్ని తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు.

18 ఓటీటీలపై నిషేధం

» అశ్లీల కంటెంట్‌ను ప్రసారం చేస్తున్న

19 వెబ్‌సైట్లు, 10 యాప్‌లపైనా కొరడా

న్యూఢిల్లీ, మార్చి 14: ప్రభుత్వ హెచ్చరికలను లెక్క చేయకుండా అశ్లీల కంటెంట్‌ను ప్రసారం చేస్తున్న ఆన్‌లైన్ వేదికలపై కేంద్రం కొరడా ఝుళిపించింది. 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, 19 వెబ్‌సైట్లు, 10 యాప్‌లు, 57 సోషల్ మీడియా ఖాతాలపై నిషేధం విధించినట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రకటించింది. నిషేధిత యాప్‌లలో ఏడు గూగుల్ ప్లే స్టోర్‌లో, మరో మూడు యాపిల్ యాప్ స్టోర్‌లో ఉన్నాయి. సృజనాత్మక ముసుగులో అశ్లీలత, అసభ్య పదజాలం వంటి వాటిని ప్రసారం చేయకుండా నిషేధించాల్సిన బాధ్యత ఆయా వేదికలపై ఉందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. పలుమార్లు హెచ్చరించినప్పటికీ వాటిలో మార్పు రాకపోవడంతో 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లతోపాటు పలు వెబ్‌సైట్లు, యాప్‌లను నిషేధించినట్టు ప్రకటించారు.

రాజ్యసభ సభ్యురాలిగా సుధామూర్తి ప్రమాణం

న్యూఢిల్లీ, మార్చి 14: రాజ్యసభకు ఎంపికైన ఇన్ఫోసిస్ మాజీ ఛైర్మన్ నారాయణమూర్తి సతీమణి సుధామూర్తి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ తన చాంబర్‌లో సుధామూర్తితో ప్రమాణం చేయించారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, నారాయణమూర్తి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు సుధామూర్తిని రాజ్యసభకు నామినేట్ చేసిన సంగతి తెలిసిందే.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/xqNPEutలో చదవండి.

2029లో జమిలి!

(మొదటి పేజీ తరువాయి)

కూడిన 18,626 పేజీల భారీ నివేదికను కోవింద్ గురువారమిక్కడ రాష్ట్రపతిభవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి అందజేశారు. ఆయన వెంట ప్యానెల్ సభ్యులైన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఆర్థిక సంఘం మాజీ ఛైర్మన్ ఎన్‌కే సింగ్, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ సుభాష్ కశ్యప్, రాజ్యసభలో మాజీ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్, కేంద్ర న్యాయ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్, న్యాయకోవిదుడు హరీశ్ సాల్వే, మాజీ సీవీసీ సంజయ్ కొఠారీ కూడా ఉన్నారు. ఏకకాలంలో ఎన్నికలు జరపడం వల్ల అభివృద్ధి వేగమవుతుందని.. ప్రజాస్వామిక పునాదులను బలోపేతం చేస్తుందని కమిటీ తన నివేదికలో అభిప్రాయపడింది. 'ఇండియా అంటే భారత్' ఆకాంక్షలు నెరవేర్చడానికి తోడ్పడుతుందని తెలిపింది. దేశంలో ఏటా పలు ఎన్నికల కారణంగా ప్రభుత్వం, వ్యాపారాలు, ఉద్యోగులు, కోర్టులు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులపైనా.. అన్నిటికీ మించి పౌరసమాజంపైన పెనుభారం పడుతోందని పేర్కొంది. ఒక దేశం-ఒకే ఎన్నిక విధానం అమలు కోసం చేపట్టే ఏ రాజ్యాంగ సవరణకూ రాష్ట్రాల ఆమోదం తీసుకోవలసిన అవసరం లేదని స్పష్టం చేసింది. కమిటీ కీలక సిఫారసులివీ..

ప్రభుత్వం కూలిపోతే..

- సార్వత్రిక ఎన్నికల్లో త్రిశంకు సభ ఏర్పడి లేదా అవిశ్వాస తీర్మానం నెగ్గి ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి లేకపోయినా.. ఏ కారణంగానైనా ప్రభుత్వం కుప్పకూలినా కొత్తగా లోక్‌సభ ఎన్నికలు జరపాల్సి వస్తుంది. అప్పుడు దాని పదవీకాలం.. మునుపు ఎన్నికలు జరిగిన లోక్‌సభటర్మ్ పూర్తయ్యే వరకే ఉంటుంది.
- రాష్ట్రాల శాసనసభలకు తాజా ఎన్నికలు జరిగితే.. (అవి రద్దయితే తప్ప) వాటి పదవీకాలం లోక్‌సభ పూర్తి టర్మ్ వరకు కొనసాగుతుంది. ఉదాహరణకు ఒక రాష్ట్రప్రభుత్వం తన రెండో ఏట అవిశ్వాస తీర్మానంలో ఓడిపోయి కూలిపోతే వెంటనే ఎన్నికలు నిర్వహించి కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఆ ప్రభుత్వం మిగతా మూడేళ్లు మాత్రమే కొనసాగుతుంది.
- ఈ మార్పులకు సంబంధించిన నియమావళిని అమల్లోకి తీసుకురావడానికి రాజ్యాంగంలోని 83వ అధికరణ (పార్లమెంటు ఉభయ సభల పదవీకాలాన్ని నిర్వచిస్తుంది), 172వ అధికరణ (రాష్ట్రాల శాసనసభల పదవీకాలానికి సంబంధించినది)లను సవరించాల్సి ఉంటుంది. లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిపేందుకు వీలుగా రాజ్యాంగంలో 82ఏ అధికరణను చేర్చాలి. అయితే స్థానిక ఎన్నికలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నందున ఆ మేరకు చేసే సవరణకు రాష్ట్రాల అనుమతి తప్పనిసరి.



రాష్ట్రపతి ముర్మును కలిసిన రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని బృందం

ఒకే ఓటరు జాబితా..

- లోక్‌సభ, శాసనసభ, స్థానిక సంస్థల ఎన్నికలకు పౌరులందరికీ ఒకే ఓటరు జాబితా, ఓటరు గుర్తింపు కార్డు ఉండాలి. స్థానిక ఎన్నికలు నిర్వహించే రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లతో సంప్రదింపులు జరిపి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) వీటిని తయారు చేయాలి. ఇందుకోసం 325వ అధికరణను సవరించాలి.
- ఏకకాలంలో అన్ని ఎన్నికలు జరిపే విధానం పునరుద్ధరణకు.. చట్టబద్ధమైన యంత్రాంగాన్ని/వ్యవస్థను ప్రభుత్వం రూపొందించాలి.
- 82ఏ అధికరణను తీసుకొచ్చిన తర్వాత ఏర్పడిన అసెంబ్లీల పదవీకాలం లోక్‌సభ పదవీకాలంతోనే ముగుస్తాయి. అంటే 2024 జూన్‌లో ఈ అధికరణ చేరిస్తే తర్వాత ఏ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా 2029లో లోక్‌సభ పదవీకాలంతోపాటే ఆ సభల పదవీకాలం ముగుస్తుంది. అంటే 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎన్నికలు జరిగే అసెంబ్లీల కాల పరిమితి ఐదేళ్ల పూర్తి కాలం ఉండదన్న మాట.
- సార్వత్రిక ఎన్నికల తర్వాత జరిగే తొలి పార్లమెంట్ సమావేశంలోనే 82ఏను చేర్చేందుకు రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేయాలి. ఈ నోటిఫికేషన్ తేదీని అపాయింటెడ్ డేట్‌గా భావిస్తారు. ఈ తేదీ తర్వాత ఎన్నికలు జరిగే అసెంబ్లీల పదవీకాలం లోక్‌సభ పదవీకాలంతోనే ముగుస్తుంది. అప్పటి నుంచి దేశంలో లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలి.
- 82ఏ ప్రకారం సార్వత్రిక ఎన్నికల సమయంలో ఏ అసెంబ్లీకైనా ఎన్నికలు నిర్వహించలేకపోతే ఆ అసెంబ్లీ ఎన్నికలను తర్వాతి తేదీలో నిర్వహించాలని ఎన్నికల కమిషన్ రాష్ట్రపతికి సిఫారసు చేయవచ్చు.

191 రోజులు విస్తృత సంప్రదింపులు..

2023 సెప్టెంబరు 2న కోవింద్ సారథ్యంలోని ప్యానెల్ ఏర్పాటైంది. నాటి నుంచి 191 రోజులపాటు నిర్విరామంగా నిపుణులు, సంబంధిత భాగస్వాములతో విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపిందని ఓ అధికార ప్రకటనలో పేర్కొన్నారు. లోతైన పరిశోధనలు చేపట్టినట్లు తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తితో.. సిఫారసులు చేసిందని.. చాలా తక్కువ రాజ్యాంగ సవరణలు చేసే విధంగా వాటిని రూపొందించిందని పేర్కొన్నారు. కాగా.. తమకు మొత్తం 21,558 ప్రతిస్పందనలు రాగా.. వాటిలో 80 శాతం మంది జమిలి ఎన్నికలను సమర్థించారని ప్యానెల్ తెలిపింది.

సమర్థన.. అభ్యంతరం..

సంప్రదింపుల సందర్భంగా 'ఒకదేశం-ఒకే ఎన్నిక' విధానాన్ని ఎవరెవరు సమర్థించారు.. ఎవరు వ్యతిరేకించారో ప్యానెల్ తన నివేదికలో పేర్కొంది. ఈ విధానాన్ని నలుగురు సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు సమర్థించారని తెలిపింది. జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్ఏ బోబ్డే, జస్టిస్ యూయూ లలిత్ లిఖితపూర్వకంగా తమ అభిప్రాయాలను కోవింద్ ప్యానెల్‌కు అందజేశారు.హైకోర్టుల మాజీ ప్రధాన న్యాయమూర్తు(సీజే)లలో 9 మంది ఈ విధానం వల్ల ప్రయోజనాలను ప్రస్తుతించగా.. మూడు హైకోర్టుల మాజీ సీజేలు మాత్రం గట్టిగా వ్యతిరేకించారు. తమ తమ అభ్యంతరాలను ప్యానెల్‌కు తెలియజేశారు. లోక్‌సభ, శాసనసభలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల రాజకీయ జవాబుదారీతనాన్ని దెబ్బతీస్తుందని ఢిల్లీ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ ఏపీ షా అభిప్రాయపడ్డారు. పనితీరుపై సమీక్ష లేకుండా ప్రజాప్రతినిధులకు ఐదేళ్ల పదవీకాలాన్ని స్థిరపరిస్తే వారి పనితీరుపై సమీక్షకు ఆస్కారం ఉండదని.. ప్రజాస్వామిక విలువలనే ఇది సవాల్ చేస్తుందని తెలిపారు. 'ఒక దేశం-ఒకే ఎన్నిక' ఆలోచన ప్రజాస్వామిక విలువలకు అనుగుణంగా లేదని కలకత్తా హైకోర్టు మాజీ సీజే జస్టిస్ గిరీశ్ చంద్ర గుప్తా అన్నారు. ఈ పద్ధతి భారత సమాఖ్య స్వరూపాన్ని నాశనం చేస్తుందని మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీబ్ బెనర్జీ స్పష్టం చేశారు. తరచూ మధ్యంతర ఎన్నికల వల్ల ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం కల్పిస్తోందన్నారు. అయితే అవినీతిని, అసమర్థతను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ నిధులతో ఎన్నికలు నిర్వహించేలా సంస్కరణ తీసుకురావడం బాగుంటుందని ఆయన సూచించారు. ప్యానెల్ సంప్రదించిన నలుగురు భారత ఎన్నికల మాజీ ప్రధాన కమిషనర్లు కూడా ఏకకాలంలో ఎన్నికలకు మొగ్గుచూపారు. ప్రస్తుత, మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల(ఎస్ఈసీ)లో ఏడుగురు సైతం దీనిని సమర్థించారు.

జర్మనీ/జపాన్ విధానం మేలు: కశ్యప్

ప్యానెల్ సభ్యుడైన సుభాష్ కశ్యప్ జర్మనీ విధానం మేలని సూచించారు. జర్మన్ పార్లమెంటు బుందస్టాక్ చాన్స్‌లర్ (ప్రధాని)ని నియమిస్తుంది. ఆయన/ఆమెపై విపక్షాలు అవిశ్వాస తీర్మానం తెస్తే.. అదే బ్యాలెట్‌పై ప్రత్యామ్నాయ చాన్స్‌లర్‌గా తమ అభ్యర్థి ఎవరో సూచించాల్సి ఉంటుంది. దాని ఆధారంగానే దేశాధ్యక్షుడు చాన్స్‌లర్‌ను నియమిస్తాడు. జపాన్‌లో కూడా ప్రధానమంత్రిని పార్లమెంటు (నేషనల్ డైట్) నియమిస్తుంది. తర్వాత చక్రవర్తి ఆమోదిస్తాడు. ఈ రెండు విధానాల్లో ఒకటి అనుసరించాలని, దీనివల్ల దేశానికి మేలు కలుగుతుందని కశ్యప్ సూచించినట్లు నివేదిక తెలిపింది.


ఏడు దేశాల విధానాల అధ్యయనం..

కోవింద్ ప్యానెల్ దక్షిణాఫ్రికా, జర్మనీ, స్వీడన్, బెల్జియం, ఇండోనేసియా, జపాన్, ఫిలిప్పైన్స్ దేశాల ఎన్నికల విధానాలపై అధ్యయనం చేసింది. 'దక్షిణాఫ్రికాలో జాతీయ అసెంబ్లీ, ప్రొవిన్షియల్ (ప్రాంతీయ) అసెంబ్లీలకు పౌరులు ఏకకాలంలో ఓటేస్తారు. అయితే ఈ దేశంలో మున్సిపల్ ఎన్నికలు మాత్రం విడిగా జరుగుతాయి. స్వీడన్‌లో దామాషా ఎలక్టొరల్ వ్యవస్థ అమల్లో ఉంది. పార్లమెంటు (రిక్స్‌దాగ్), కౌంటీ కౌన్సిళ్లు, మున్సిపల్ కౌన్సిళ్లకు ఏకకాలంలో ఎన్నికలు జరుగుతాయి. వివిధ రాజకీయ పార్టీలకు వచ్చిన ఓట్ల శాతం ఆధారంగా వాటికి పార్లమెంటు, మండళ్లలో సీట్లు కేటాయిస్తారు. ఈ ఎన్నికలు ప్రతి నాలుగేళ్లకు సెప్టెంబరు రెండో ఆదివారం జరుగుతాయి. మున్సిపల్ కౌన్సిళ్లకు మాత్రం ప్రతి ఐదేళ్లకోసారి సెప్టెంబరు రెండో ఆదివారం రోజే నిర్వహిస్తారు' అని నివేదికలో వివరించారు. దేశంలో ఏకకాలంలో ఎన్నికలు జరగాలన్న ప్రతిపాదనలు గతంలో పలు నివేదికలు, అధ్యయనాల్లో వెలుగుచూశాయని ప్యానెల్ తెలిపింది.

రాజ్యాంగాన్ని నాశనం చేసేందుకే..: కాంగ్రెస్

జమిలి ఎన్నికలు నిర్వహించాలన్న సిఫారసుపై కాంగ్రెస్ మండిపడింది. 'ఒక దేశం-ఇక ఎన్నికలు ఉండవు' అని ఎద్దేవా చేసింది. జమిలి ఎన్నికలతో బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని సంపూర్ణంగా నాశనం చేయాలని మోదీ ప్రభుత్వం చూస్తోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం నాశిక్‌లో విమర్శించారు. 'ప్రధాని మోదీ లక్ష్యం స్పష్టంగా ఉంది.. ఆయన ఎక్కడకు వెళ్లినా లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ. అంటే 400 ఎంపీ స్థానాలతో స్పష్టమైన మెజారిటీ ఇవ్వాలని కోరుతున్నారు. ప్యానెల్ నివేదికతో రహస్యం బట్టబయలైంది' అని ధ్వజమెత్తారు.

అనుకున్న సమయానికే..



ప్రభాస్ హీరోగా నటిస్తున్న సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'కల్కి 2898 ఏడీ'. పాన్ ఇండియా చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్ర ప్రసాద్, దీపికా పదుకొనే, దిశా పటానీ వంటి భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. అశ్వినీదత్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సమ్మర్ స్పెషల్‌గా మే 9న ప్రేక్షకులను కనువిందు చేస్తుందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే సాంకేతికంగా ఎంతో ఉన్నతంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం రిలీజ్ పోస్ట్‌పోన్ కావచ్చని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. తాజాగా బిగ్ బీ అమితాబ్ బచ్చన్ తన బ్లాగులో ఈ చిత్రం గురించి రాశారు. "కల్కి మూవీ షూటింగ్ నుంచి ఇంటికి వచ్చేసరికి రాత్రి మళ్లీ ఆలస్యమైంది. చిత్రీకరణ దాదాపుగా పూర్తయ్యింది. ముందుగా అనుకున్న సమయానికే మే 9నే ఈ చిత్రం వస్తోంది. ప్రేక్షకులకు అనిర్వచనీయమైన అనుభూతిని అందించే విషయంలో ఎక్కడా రాజీ పడకుండా చిత్ర బృందం అహర్నిశలు శ్రమిస్తోంది" అని తన బ్లాగులో పేర్కొన్నారు. దీంతో ఈ చిత్రం విడుదలపై వస్తున్న అసత్య ప్రచారాలకు చెక్ పడినట్లైంది.

మంచి సందేశంతో ది 100

ఎం.వెంకయ్యనాయుడు



'సినిమా అనేది శక్తిమంతమైన ఆయుధం. దాని ప్రభావం సమాజం మీద ఉంటుంది. 'ది 100' చిత్ర ఇతివృత్తం బాగుంది. ఇందులో మంచి సందేశం ఉంది. ఇంత చక్కని చిత్రాన్ని తీసిన దర్శకనిర్మాతలకు, హీరో సాగర్‌కు అభినందనలు. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అన్నారు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు. 'మొగలిరేకులు' ఫేమ్ ఆర్కే. సాగర్ హీరోగా, ఓంకార్ శశిధర్ దర్శకత్వంలో రూపొందిన 'ది 100' చిత్రం ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను వెంకయ్యనాయుడు ఆవిష్కరించి, ప్రసంగించారు. 'ఇది ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్. కమర్షియల్ అంశాలతో పాటు ఓ సోషల్ ఇష్యూని చెప్పాం. అందరూ చూడదగ్గ చిత్రం' అని దర్శకుడు చెప్పారు. 'ది 100' అనేది ఒక వెపన్. ప్రతి మనిషికీ జీవితంలో ఈ ఆయుధం అవసరం అవుతుంది' అని సాగర్ చెప్పారు. మిషా నారంగ్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని రమేశ్ కరుటూరి, వెంకీ పూషడపు, కె.తారక్‌రామ్ నిర్మించారు.

వెయ్ దరువెయ్ ప్రేక్షకులను మెప్పిస్తుంది



సాయిరామ్ శంకర్, యషా శివకుమార్ హీరో హీరోయిన్లుగా నటించిన 'వెయ్ దరువెయ్'. ఈ శుక్రవారం రిలీజ్ అవుతోంది ఈ సందర్భంగా హీరో సాయిరామ్ శంకర్ మీడియాతో మాట్లాడుతూ "ఇందులో హీరో క్యారెక్టర్ జోవియల్‌గా ఉంటుంది. సమాజంలోని ఓ సమస్యపై హీరో చేసే చిన్నపాటి పోరాటాన్ని ఇందులో చూపించాం. 'బంపర్ ఆఫర్' మూవీ నా బాడీ లాంగ్వేజ్‌కి తగ్గట్లు ఉండే చిత్రం. ఆ తర్వాత ఈ కథ నాకు అలా అనిపించింది. కామెడీ నాకు బాగా ఇష్టం. 'వెయ్ దరువెయ్' విషయానికి వస్తే ఇందులో 80 శాతం కామెడీ ఉంటుంది" అని అన్నారు.

అజిత్ హీరోగా గుడ్ బ్యాడ్ అగ్లీ

తమిళ స్టార్ హీరో అజిత్‌కుమార్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు-తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. రాక్‌స్టార్ దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు. గురువారం ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ "స్టార్ హీరో అజిత్‌తో కలిసి పని చేయడం గౌరవంగా భావిస్తున్నాను. ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని అందించబోతున్నాం" అని అన్నారు.



నిర్మాత వై రవిశంకర్ మాట్లాడుతూ "అధిక్ అద్భుత దర్శకత్వ ప్రతిభ అతని మునుపటి చిత్రాల్లో చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కొత్త చిత్రం నెక్స్ లెవల్‌లో వుండబోతుంది" అని చెప్పారు. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ మాట్లాడుతూ "అజిత్‌తో కలిసి పనిచేయటం నా చిరకాల స్వప్నం. ఈ సినిమాతో అది నెరవేరబోతోంది" అని అన్నారు. ఈ చిత్రానికి అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రీకరణ జూన్ 2024లో ప్రారంభం అవుతుంది. 2025 సంక్రాంతి కానుకగా విడుదలవుతోంది.



శ్రుతీహాసన్ మ్యూజికల్ వీడియో

విశిష్ట నటుడు కమల్‌హాసన్ తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయనున్న మ్యూజికల్ వీడియో 'ఇనిమెల్'. తండ్రి కమల్ రాసిన పాటను తనయ శ్రుతీహసన్ స్వరపరిచి, కాన్సెప్ట్ తయారు చేశారు. ఇందులో దర్శకుడు లోకేశ్ కనగరాజ్ నటించడం ఓ విశేషం. ఆయనతో పాటు శ్రుతి కూడా ఇందులో నటించారు. త్వరలో విడుదల కానున్న ఈ మ్యూజికల్ వీడియోకు భువన్ గౌడ సినిమాటోగ్రాఫర్. ద్వారకేశ్ ప్రభాకర్ దర్శకుడు.

హైదరాబాద్‌లో డబ్ల్యూఎన్ఎస్ డెలివరీ సెంటర్

హైదరాబాద్: మరో ప్రముఖ అంతర్జాతీయ సంస్థ హైదరాబాద్‌లో కొలువు తీరింది. బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం) సేవల్లో ప్రముఖ సంస్థగా పేరొందిన డబ్ల్యూఎన్ఎస్ హైదరాబాద్‌లో తన డెలివరీ సెంటర్ ఏర్పాటు చేసింది. కంపెనీ ఈ కేంద్రం ద్వారా షిప్పింగ్, లాజిస్టిక్స్ హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా, హైటెక్ రంగాలకు తన డిజిటల్ సొల్యూషన్స్ సేవలు అందించనుంది. 'నిపుణులైన ఉద్యోగుల లభ్యత, ప్రభుత్వ ప్రోత్సాహం హైదరాబాద్‌లో ఐటీ-బీపీఎం రంగ అభివృద్ధికి అద్భుత అవకాశాలు కల్పిస్తున్నాయి' అని డబ్ల్యూఎన్ఎస్ గ్రూప్ సీఈఓ కేశవ్ ఆర్ మురుగేశ్ తెలిపారు. డబ్ల్యూఎన్ఎస్‌కు ఇప్పటికే విశాఖపట్నంతో పాటు చెన్నై, బెంగళూరుతో సహా తొమ్మిది ప్రధాన నగరాల్లో బీపీఎం సేవల డెలివరీ కేంద్రాలు ఉన్నాయి. హైదరాబాద్ డెలివరీ కేంద్రం పదోది.

యూనికార్న్‌లతో ఐదు కోట్ల కొలువులు: సీఐఐ

న్యూఢిల్లీ: ఉద్యోగాల కల్పనలో యూనికార్న్ స్టార్టప్‌లు కీలక పాత్ర పోషించబోతున్నాయి. 2030 నాటికి వీటి ద్వారా కొత్తగా ఐదు కోట్ల ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయి. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) గురువారం విడుదల చేసిన ఒక నివేదిక ఈ విషయం తెలిపింది. ఉద్యోగాలకు తోడు యూనికార్న్ స్టార్టప్స్‌లో ద్వారా 2030 నాటికి మన ఆర్థిక వ్యవస్థకు లక్ష కోట్ల డాలర్ల జీడీపీ జత అవుతుందని పేర్కొంది. వంద కోట్ల డాలర్ల కంటే ఎక్కువ విలువకు చేరిన స్టార్టప్‌లను యూనికార్న్‌లుగా వ్యవహరిస్తారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,110 ▲	60,600 ▲	80,000 ▲
ముంబై	65,523 ▲	60,019 ▲	73,781 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ		విజయవాడ	418
హైదరాబాద్	390	విశాఖపట్నం	425
15వ తేదీ		వరంగల్	392
చిత్తూరు	463		
గోదావరి	418	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	104	గోదావరి	106
వరంగల్	104	విజయవాడ	106
కరీంనగర్	104	గుంటూరు	110
మహబూబ్‌నగర్	104	ఒంగోలు	110
కర్నూలు	104	చిత్తూరు	116
విశాఖపట్నం	103		

ఏప్రిల్ నుంచి కాకినాడ ప్లాంట్‌లో పెన్సిలిన్ ఉత్పత్తి

- జూన్‌లోగా వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి షురూ
- అరబిందో ఫార్మా వెల్లడి



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద అరబిందో ఫార్మా ఏర్పాటు చేస్తున్న పెన్సిలిన్ (పెన్-జీ) తయారీ ప్లాంటు ఉత్పత్తికి సిద్ధమవుతోంది. 'వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఈ ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభిస్తాం. ప్రస్తుతం ఈ ప్లాంటులో ఉత్పత్తి ప్రక్రియను స్థిరీకరించే పనిలో ఉన్నాం' అని కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ కే నిత్యానంద రెడ్డి తెలిపారు. ఈ ప్లాంటులో వచ్చే నెలలో ప్రయోగాత్మక ఉత్పత్తి ప్రారంభించి జూన్‌లోగా వాణిజ్య స్థాయిలో, రెండో త్రైమాసికానికల్లా పూర్తి స్థాయి ఉత్పత్తి అందుకోవాలని కంపెనీ అధికార వర్గాలు ప్రయత్నాలు చేస్తున్నాయి.

చైనా దిగుమతులకు చెక్!

ప్రస్తుతం కీలకమైన పెన్సిలిన్ ఉత్పత్తిలో చైనాదే గుత్తాధిపత్యం. కొవిడ్ తర్వాత ఆ దేశం నుంచి పెన్సిలిన్ దిగుమతులకు ఆటంకం ఏర్పడింది. దీనికి తోడు సరిహద్దు ఉద్రిక్తతలు పెరిగితే చైనా మన దేశానికి పెన్సిలిన్ ఎగుమతులను కట్టడి చేసే ప్రమాదం ఉందని ఎప్పటి నుంచో ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో చైనా పెన్సిలిన్ దిగుమతులకు చెక్ పెట్టేందుకు దేశీయంగా ఈ కీలక ఔషధ ముడి పదార్థం తయారు చేసే కంపెనీలకు పీఎల్ఐ పథకం కింద ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రోత్సాహకాలను దృష్టిలో ఉంచుకుని అరబిందో ఫార్మా కాకినాడ వద్ద రూ.2,400 కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంటు ఏర్పాటు చేస్తోంది.

60 శాతం సొంత అవసరాలకే

ఏటా 15,000 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఈ ప్లాంటు ఉత్పత్తిలో 60 శాతం ఉత్పత్తిని అరబిందో ఫార్మా సొంత అవసరాలకు వాడుకోనుంది. మిగతా 40 శాతం ఉత్పత్తిని దేశీయ ఫార్మా కంపెనీలకు, విదేశాలకు ఎగుమతి చేస్తామని కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సంతానం సుబ్రమణియన్ చెప్పారు. చైనా కంపెనీలు అమ్మే ధరకే తమ పెన్సిలిన్ లభిస్తుందని కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ నిత్యానంద రెడ్డి తెలిపారు. 'మా పోటీ చైనాతోనే. మా ఉత్పత్తి ధర చైనా కంపెనీలతో సమానంగా ఉంటుంది' అన్నారు.



పేటీఎం.. ఇక థర్డ్ పార్టీ యూపీఐ యాప్

అనుమతించిన ఎన్‌పీసీఐ

ఎస్‌బీఐ సహా నాలుగు బ్యాంకుల ద్వారా యూపీఐ లావాదేవీల కొనసాగింపునకు ఓకే

ముంబై: పేటీఎం యాప్ ద్వారా వినియోగదారులు చెల్లింపుల లావాదేవీలను కొనసాగించేందుకు వీలుగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. పేటీఎం థర్డ్‌పార్టీ యాప్‌గా మారేందుకు అనుమతిస్తున్నట్లు ఎన్‌పీసీఐ గురువారం తెలిపింది. ఇందులో భాగంగా నాలుగు బ్యాంకుల (ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యస్ బ్యాంక్) ద్వారా యూపీఐ లావాదేవీలను కొనసాగించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఫిబ్రవరి 29 తర్వాత పీపీబీఎల్ తన ఖాతాదారుల అకౌంట్లు, వాలెట్ వంటి ప్రీ-పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్లు, ఫాస్టాగ్, నేషనల్ కామన్ మొబిలిలిటీ కార్డ్స్‌లో డిపాజిట్లు, క్రెడిట్ లేదా టాప్-అప్ లావాదేవీలు నిర్వహించకుండా ఆర్‌బీఐ నిషేధం విధించింది. ఆ తర్వాత డెడ్‌లైన్‌ను మార్చి 15 వరకు పొడిగించింది. ఈ నెల 15 నాటికల్లా పీపీబీఎల్ కస్టమర్లు అందరూ ఇతర బ్యాంక్‌లకు మారాల్సిందిగా ఆర్‌బీఐ సూచించింది. "వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఓసీఎల్)కు మల్టీ బ్యాంక్ మోడల్‌లో భాగంగా థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్ (టీపీఏపీ)గా యూపీఐ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు అనుమతి ఇస్తున్నట్లు" ఎన్‌పీసీఐ పేర్కొంది. 4 బ్యాంకులు ఓసీఎల్‌కు పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్ (పీఎస్‌పీ) బ్యాంక్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపింది. ఓసీఎల్ ప్రస్తుత, కొత్త యూపీఐ మర్చంట్ల కోసం యస్ బ్యాంక్ మర్చంట్ అక్వైరింగ్ బ్యాంక్‌గానూ వ్యవహరించనుంది. 'ఎట్ పేటీఎం' హ్యాండిల్‌ను కూడా యస్ బ్యాంక్‌కు అప్పగించనున్నట్లు వెల్లడించింది.

పీపీబీఎల్‌లో 20 శాతం ఉద్యోగాల కోత: ఆర్‌బీఐ నిషేధంతో సేవలు దాదాపుగా నిలిచిపోనున్న నేపథ్యంలో పీపీబీఎల్ 20 శాతం ఉద్యోగాలకు కోత పెట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

వయాకామ్ 18లో పారామౌంట్ వాటా రిలయన్స్ చేతికి..

డీల్ విలువ రూ.4,286 కోట్లు

న్యూఢిల్లీ: భారత టెలివిజన్ చానళ్ల సంస్థ వయాకామ్ 18 మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో తనకున్న 13.01 శాతం వాటాను రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు రూ.4,286 కోట్లకు విక్రయించేందుకు పారామౌంట్ గ్లోబల్ అంగీకరించింది. పారామౌంట్ గ్లోబల్‌కు చెందిన రెండు అనుబంధ సంస్థల నుంచి ఈ వాటాను కొనుగోలు చేసేందుకు విధిగా కట్టుబడి ఉండే ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది. అలాగే, నియంత్రణ మండళ్ల అనుమతులతో పాటు ఇప్పటికే రిలయన్స్, వయాకామ్ కలిసి స్టార్ డిస్నీతో కుదుర్చుకున్న జాయింట్ వెంచర్ డీల్ పూర్తి అయ్యాక ఈ లావాదేవీ పూర్తవుతుందని పారామౌంట్ వెల్లడించింది.

• స్వల్పంగా తగ్గిన టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: దేశంలో టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) ఫిబ్రవరిలో 0.2 శాతం తగ్గింది. జనవరి నెలలో డబ్ల్యూపీఐ సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 0.27 శాతం ఉంది. ఆహార వస్తువుల ధరలు పెరిగినప్పటికీ ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గడం విశేషం. గత ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం ప్రతికూల స్థితిలోనే ఉంది. చివరికి నవంబరులో 0.26 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది ఫిబ్రవరిలో ఇది 3.85 శాతం ఉంది.

• రికాన్ టెక్నాలజీస్ నుంచి మహీంద్రా పవరాల్ జెన్‌సెట్స్



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లోకి మహీంద్రా పవరాల్ జెన్‌సెట్స్‌ను రికాన్ టెక్నాలజీస్ విడుదల చేసింది. రికాన్ టెక్నాలజీస్..మహీంద్రా పవరాల్ జెన్‌సెట్స్‌కు అధీకృత జనరేటర్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారుగా ఉంది. 625 కేవీఏ సామర్థ్యం వరకు గల ఈ జెన్‌సెట్స్‌ను తెలుగు రాష్ట్రాల మార్కెట్లకు తగ్గట్టుగా హైదరాబాద్ ప్లాంట్‌లో తయారు చేసినట్లు రికాన్ టెక్నాలజీస్ ఎండీ వేణు వినోద్ తెలిపారు.

మార్కెట్లో రికవరీ ర్యాలీ

- సెన్సెక్స్ 335 పాయింట్లు అప్
- 22,100 ఎగువ స్థాయికి నిఫ్టీ
- స్మాల్, మిడ్‌క్యాప్ సూచీల హైజంప్
- రూ.7.81 లక్షల కోట్లు పెరిగిన సంపద

ముంబై: బుధవారం సెషన్‌లో భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం ట్రేడింగ్‌లో కాస్త కోలుకున్నాయి. ఐటీ, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ఒక దశలో 602 పాయింట్లకు పైగా పెరిగి 73,364 స్థాయికి చేరిన సెన్సెక్స్.. చివరికి 335.39 పాయింట్ల లాభంతో 73,097.28 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 148.95 పాయింట్ల వృద్ధితో 22,146.65 వద్ద క్లోజైంది. వరుసగా మూడు రోజుల పాటు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్న చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలోనైతే జోరుగా కొనుగోళ్లు జరిగాయి. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 3.11 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.28 శాతం ఎగబాకాయి. రంగాలవారీ సూచీల్లో సర్వీసెస్, టెలికాం, యుటిలిటీస్, ఆయిల్ అండ్ గ్యాస్ మూడు శాతానికి పైగా పుంజుకున్నాయి. రికవరీ ర్యాలీతో మార్కెట్ వర్గాల సంపద ఒక్కరోజులోనే రూ.7.81 లక్షల కోట్లు పెరిగి మొత్తం రూ.379.98 లక్షల కోట్లకు చేరుకుంది.

గోపాల్ స్నాక్స్ లిస్టింగ్.. ఫ్చ్

గోపాల్ స్నాక్స్ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో షేర్లను నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.401తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 12.71 శాతం డిస్కౌంట్‌తో రూ.350 వద్ద లిస్టయింది. ఒక దశలో 14.71 శాతం నష్టంతో రూ.342 వద్దకు జారుకున్న షేరు.. చివరికి 10.21 శాతం నష్టంతో రూ.360.05 వద్ద స్థిరపడింది. సోమవారంతో ముగిసిన కంపెనీ ఐపీఓకు మాత్రం ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందనే లభించింది. ఇష్యూ సైజుకు 9.02 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

రూ.250 కోట్లతో శ్రీసిటీ ప్లాంట్ విస్తరణ : బ్లూస్టార్

కోల్‌కతా: హోమ్ అప్లయెన్సెస్ కంపెనీ బ్లూస్టార్ శ్రీసిటీలోని రూమ్ ఎయిర్ కండిషనర్ల తయారీ యూనిట్‌లో సామర్థ్యాల విస్తరణపై రూ.250 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ప్రస్తుతం శ్రీసిటీ ప్లాంట్ సహా వివిధ ప్లాంట్లలో రూమ్ ఏసీల వార్షిక తయారీ సామర్థ్యం 10 లక్షల యూనిట్లుంది. సమీప భవిష్యత్తులో రూమ్ ఏసీల తయారీ సామర్థ్యాన్ని 18 లక్షలకు పెంచాలన్నది తమ లక్ష్యమని కంపెనీ ఎండీ బీ త్యాగరాజన్ అన్నారు. ఇందులో భాగంగానే వచ్చే ఆర్థిక సంవత్సరంలో శ్రీసిటీ ప్లాంట్‌లో రూమ్ ఏసీల తయారీ సామర్థ్యం 3 లక్షల యూనిట్ల మేరకు పెంచాలనుకుంటున్నామని, ఇందుకు రూ.250 కోట్లు ఖర్చు చేస్తామని వెల్లడించారు.

హైదరాబాద్‌లో గోద్రెజ్ ప్రాపర్టీస్ మరో రియల్టీ ప్రాజెక్టు

హైదరాబాద్: ప్రముఖ రియల్టీ సంస్థ గోద్రెజ్ ప్రాపర్టీస్ హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఓఆర్ఆర్ సమీపంలోని కోకాపేట వద్ద మూడు ఎకరాల భూమి కొనుగోలు చేసింది. ప్రీమియం నివాస గృహ సముదాయం కోసం కొనుగోలు చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా రూ.1,300 కోట్ల ఆదాయం వస్తుందని కంపెనీ భావిస్తోంది. అయితే ఈ మూడు ఎకరాలను ఎవరి నుంచి ఎంతకు కొనుగోలు చేశారు? అనే విషయాలు మాత్రం వెల్లడించలేదు. నెల రోజుల క్రితం కూడా గోద్రెజ్ ప్రాపర్టీస్ హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ప్రాంతంలో నివాస గృహ సముదాయం కోసం రూ.350 కోట్లతో 12.5 ఎకరాలు కొనుగోలు చేసింది.

మార్కెట్లోకి గ్రీవ్స్ ఎల్ట్రా సిటీ



హైదరాబాద్: గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ.. మార్కెట్లోకి త్రీ వీలర్ ప్యాసింజర్ వెహికల్ గ్రీవ్స్ ఎల్ట్రా సిటీ తీసుకువచ్చింది. 9.6 కిలోవాట్ మోటార్, 10.8 కేడబ్ల్యూహెచ్ లిథియం అయాన్ బ్యాటరీతో ఈ ఆటోను రూపొందించింది. ఒకసారి చార్జింగ్‌తో ఈ ఆటో 160 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. మూడేళ్ల వారంటీని అందిస్తోంది. ఆక్వా బ్లూ, లూనార్ వైట్ రంగుల్లో అందుబాటులో ఉండనుంది. కంపెనీ ఈ ఆటోను హైదరాబాద్ సమీపంలోని తూప్రాన్ ప్లాంట్‌లో తయారు చేస్తోంది.

స్పోర్ట్స్



సింధు ఇంటిదారి..

- క్వార్టర్స్‌లో లక్ష్యసేన్
- సాత్విక్, అశ్విని జోడీలు అవుట్
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్స్‌లో గురువారం భారత్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. పురుషుల సింగిల్స్‌లో ఒక్క లక్ష్యసేన్ తప్ప అందరూ ఇంటిదారి పట్టారు. డబుల్ ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్, అశ్విని జోడీలు ఓటమిపాలయ్యారు. రెండో రౌండ్‌లో సింధు 19-21, 11-21తో డిఫెండింగ్ చాంప్, టాప్ సీడ్ అన్ సి యంగ్ (కొరియా) చేతిలో వరుస గేముల్లో చిత్తయింది. మరోవైపు స్ఫూర్తిదాయక ప్రదర్శనతో వరల్డ్ నెం:18 లక్ష్య సేన్ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. ప్రీక్వార్టర్స్‌లో లక్ష్య సేన్ 24-22, 11-21, 21-14తో 4వ సీడ్ ఆండ్రెస్ అంటాన్‌సెన్ (డెన్మార్క్)పై పోరాడి గెలిచాడు. గంటా 20 నిమిషాలపాటు సాగిన పోరులో కీలక సమయాల్లో ఒత్తిడికి గురికాకుండా సేన్ అద్భుత ఆటను ప్రదర్శించాడు.

వరుస తప్పిదాలతో..: కొరియా షట్లర్ అన్ సి యంగ్‌తో 42 నిమిషాలపాటు సాగిన పోరులో సింధు ఆటాకింగ్ గేమ్ ఆడే ప్రయత్నంలో పదేపదే తప్పులు చేయగా.. ప్రత్యర్థి మాత్రం విభిన్నమైన షాట్లు, ర్యాలీలతో ప్రత్యర్థిని ఇబ్బందిపెట్టింది. యంగ్ చేతిలో ఒక్క మ్యాచ్ కూడా నెగ్గని సింధుకు ఇది వరుసగా ఏడో పరాజయం కావడం గమనార్హం. తొలి గేమ్‌లో సింధు 16-17తో గట్టిపోటీ ఇచ్చేలా కనిపించింది. సింధు మూడు గేమ్‌పాయింట్లు కాచుకున్నా.. యంగ్‌ను అడ్డుకోలేక పోయింది. ఇక, రెండో గేమ్‌లో కొరియన్ ఆధిపత్యం ముందు సింధు ఏమాత్రం నిలబడలేక పోయింది. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంట 21-11, 11-21, 11-21తో చైనాకు చెందిన జాంగ్ షు జియాన్-జంగ్ యు చేతిలో పరాజయం పాలైంది.

సాత్విక్ జంటకు షాక్..: డబుల్స్ వరల్డ్ నెం:1 సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి 16-21, 15-21తో ఇండోనేసియాకు చెందిన మహ్మద్ షోహిబుల్ ఫిక్రి-మౌలానా బగాస్ చేతిలో పరాజయం పాలయ్యారు. తొలి గేమ్ ఆరంభం నుంచే ఇరు జోడీలు హోరాహోరీగా తలపడడంతో ఆధిక్యం చేతులు మారుతూ సాగింది. 16-19 స్కోరు వద్ద తప్పిదాలు చేసిన సాత్విక్ జోడీ తొలి గేమ్‌ను చేజార్చుకొంది. ఇక, రెండో గేమ్‌లోనూ భారత జంట తడబడింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఇండోనేసియా జోడీ గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకొంది.

హార్దిక్ కాదు.. రోహిత్‌నే ఉంచాల్సింది



న్యూఢిల్లీ: ఐపీఎల్ జట్టు ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ మార్పుపై టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. సారథిగా రోహిత్ శర్మను కొనసాగించాల్సి ఉండాల్సిందన్నాడు. 'ఐదుసార్లు ఐపీఎల్ నెగ్గిన రోహిత్‌ను సారథ్య బాధ్యతల నుంచి తప్పించడమనేది చాలా పెద్ద నిర్ణయం. ఈ సీజన్ వరకు అతడినే కెప్టెన్‌గా కొనసాగించి.. హార్దిక్ పాండ్యాను ఉప సారథిగా నియమించి ఉండాల్సింది. ఆ తర్వాత నాయకత్వ మార్పు చేసివుంటే ఎటువంటి సమస్యలూ ఉత్పన్నమయ్యేవి కావ'ని యువీ అభిప్రాయపడ్డాడు. ఇప్పుడు హార్దిక్‌పై ఎంతో ఒత్తిడి నెలకొనే అవకాశం ఉందన్నాడు. కాగా హిట్‌మ్యాన్ స్థానంలో పాండ్యాకు ముంబై పగ్గాలు అప్పగించడం ఎంతో వివాదాస్పదమైందని దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిల్లీర్స్ అన్నాడు. కానీ, వాటి నుంచి బయటపడిన ముంబై.. భవిష్యత్‌పై దృష్టిసారించిందని చెప్పాడు.



ముంబై ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- 8 ఏళ్ల తర్వాత రంజీ టైటిల్
- 169 రన్స్ తేడాతో విదర్భ చిత్తు

ముంబై: రంజీల్లో ముంబై జట్టు నిరీక్షణ ఫలించింది. గురువారం ముగిసిన ఫైనల్లో విదర్భను 169 పరుగుల తేడాతో చిత్తు చేసిన ముంబై ఎనిమిదేళ్ల తర్వాత విజేతగా నిలిచింది. 2015-16 సీజన్‌లో జట్టు చివరిసారి టైటిల్ దక్కించుకుంది. ఓవరాల్‌గా ముంబైకిది 42వ రంజీ ట్రోఫీ కావడం విశేషం. అలాగే 2016-17, 2021-22 సీజన్లలో ఫైనల్ వరకు చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది. ఇక 538 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన విదర్భ ఆఖరి రోజున రెండో ఇన్నింగ్స్‌లో 368 పరుగులకు ఆలౌటైంది. అక్షయ్ వాడ్కర్ (102), హర్ష్ దూబే (65) రాణించారు. తనూష్‌కు నాలుగు, ముషీర్.. తుషార్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. గురువారం 248/5 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట ఆరంభించిన విదర్భ జట్టు విజయానికి మరో 290 పరుగుల దూరంలోనే ఉండడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అయితే రెండో సెషన్‌నుంచి వికెట్లు పడిపోవడంతో విదర్భ పోరాటం పరిసమాప్తమైంది. అలాగే కెరీర్‌లో ఆఖరి మ్యాచ్ ఆడిన పేసర్ ధవల్ కులకర్ణి ప్రత్యర్థి చివరి వికెట్‌ను తీసి మ్యాచ్‌ను ముగించాడు. ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 224, విదర్భ 105 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో ముంబై 418 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ముషీర్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా తనూష్ కోటియన్ నిలిచారు.

విజేతకు రూ. 10 కోట్లు: రంజీ విజేతగా నిలిచిన తమ జట్టు ప్రైజ్‌మనీని ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) రెట్టింపు చేసింది. దీంతో ఆటగాళ్లకు రూ.10 కోట్లు దక్కనుంది.

కంగ్రాట్స్ తమ్ముడూ.. : సర్ఫరాజ్



రంజీ ఫైనల్లో ముంబై తరఫున సెంచరీ బాదిన ముషీర్ ఖాన్‌ను అతడి అన్న, టీమిండియా సభ్యుడు సర్ఫరాజ్ ఖాన్ అభినందించాడు. ఈమేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలను పోస్ట్ చేశాడు. 2022 ఫైనల్‌లో ముంబై తరఫున సర్ఫరాజ్ 134 రన్స్‌తో అత్యధిక స్కోరు సాధించగా.. ముషీర్ ఆ రికార్డును 136 రన్స్‌తో అధిగమించాడు.

శరత్ మరో సంచలనం



సింగపూర్: వెటరన్ టేబుల్ టెన్నిస్ స్టార్ శరత్ కమల్ సింగపూర్ స్మాష్ టోర్నీలో జోరు కొనసాగిస్తున్నాడు. శరత్ తనకన్నా మెరుగైన ర్యాంక్ ఆటగాళ్లను ఓడిస్తూ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరాడు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో 88వ ర్యాంకర్ శరత్... వరల్డ్‌నెంబర్ 22 ఒమర్ అస్సర్ (ఈజిప్ట్)పై 11-4, 11-8, 12-10 తేడాతో సునాయాసంగా గెలిచి మరో సంచలనం సృష్టించాడు. అంతకుముందు వరల్డ్‌నెంబర్ 13 డార్కో జోర్గిక్ (స్లొవేనియా)ను సైతం శరత్ మట్టికరిపించాడు. ఇక క్వార్టర్స్‌లో శరత్ ఫ్రాన్స్‌కు చెందిన ఫెలిక్స్ లెబ్రున్‌తో తలపడనున్నాడు. మరోవైపు ఈ ప్రదర్శనతో సింగిల్స్‌లో శరత్ ర్యాంకు మెరుగుకానుండడంతో ఒలింపిక్ అవకాశాలు కూడా పెరగనున్నాయి.

ముంబై, కాలికట్‌లకు విజయాలు



చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్ సూపర్-5లో ముంబై మీటియర్స్ బోణీ చేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 15-8, 13-15, 7-15, 16-14, 15-13తో అహ్మదాబాద్ డిఫెండర్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో కాలికట్ హీరోస్ 18-16, 16-14, 8-15, 11-15, 15-10తో బెంగళూరు టోర్పడోస్‌ను ఓడించింది.



ఫైనల్ చేరేదెవరు?

రాత్రి 7.30 నుంచి జియో సినిమా, స్పోర్ట్స్ 18లో...

నేటి ఎలిమినేటర్‌లో ముంబై × బెంగళూరు


న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో సమవుజ్జీలైన ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్లు శుక్రవారం జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో అమీతుమీ తేల్చుకోన్నాయి. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు.. ఆదివారం జరిగే ఫైనల్లో ఢిల్లీతో తలపడనుంది. డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగిన ముంబై.. ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో ఆడలేదనే చెప్పుకోవాలి. అయితే, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ మంచి ఫామ్‌లో ఉండడం ఆ జట్టుకు పెద్ద ప్లస్. అమేలియా కెర్, బ్రంట్, షబ్నిం ఇస్మాయిల్ రాణిస్తున్నారు. మరోవైపు బెంగళూరు ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శనే చేస్తోంది. చివరి లీగ్ మ్యాచ్‌లో పెర్రీ ఆల్‌రౌండ్ షోతో ముంబైను చిత్తు చేసింది. సారథి స్మృతి మంధాన బ్యాట్‌తో మెరుస్తుండగా.. రిచా ఘోష్ ఆకట్టుకొంటోంది. బెంగళూరు పోరాడుతున్న తీరుచూస్తుంటే.. ముంబైకి గట్టిపోటీ ఇచ్చేలా కనిపిస్తోంది.

పడి.. లేచాడు

పంత్ కోలుకున్న తీరు అద్భుతం

డాక్టర్ల వెల్లడి





బెంగళూరు: రిషబ్ పంత్.. భారత క్రికెట్‌లోకి వేగంగా దూసుకొచ్చి వికెట్ కీపర్‌గా, విధ్వంసకర బ్యాటర్‌గా జట్టు విజయాల్లో కీలకంగా నిలిచాడు. ముఖ్యంగా టెస్టు ఫార్మాట్‌లో అతడి ఆటతీరుతోనే భారత్ గట్టెక్కిన సందర్భాలున్నాయి. అలాంటిది.. ఓ ఘోర కారు ప్రమాదానికి గురై ఇక నడవడమే కష్టమనే పరిస్థితి నుంచి, నేడు మైదానంలో క్రికెట్ బ్యాట్ పట్టే వరకు చేరాడంటే పంత్ అసాధారణ మానసిక స్థితిని ప్రశంసించాల్సిందే. తనకు చికిత్స చేసిన డాక్టర్లు కూడా ఇదే మాట చెబుతున్నారు. తాము నిర్దేశించిన సమయం కంటే మూడు నెలల ముందే కోలుకున్నాడని పంత్‌కు చికిత్స చేసిన డాక్టర్ దిన్షా పార్థివాలా కొనియాడాడు. 'ఆస్పత్రిలో చేరాక పంత్ కుడి మోకాలికి ఏకంగా మూడు ఆపరేషన్లు చేశాం. పాదం, మణికట్టు ఎముకలు కూడా విరిగాయి. వాస్తవానికి మోకాలి చిప్ప పక్కకు జరగడం చాలా తీవ్రమైందే. దీన్ని సాధారణ స్థితికి తీసుకురావడం డాక్టర్లకు సవాల్‌గా మారింది. అలాగే అటు పేషెంట్ కూడా ఈ సమయంలో మానసికంగా ధృడంగా ఉండాలి. ఈ విషయంలో మా బృందం అతడిని నిరంతరం ప్రోత్సహించింది. పంత్‌ను ఎప్పటిలాగే నడిచేట్టు చేస్తామని తన తల్లికి కూడా హామీ ఇచ్చాం. తొలి దశ ఆపరేషన్‌ను సక్సెస్ చేశాక, గాయపడిన భాగాన్ని బలోపేతం చేసి కదలికలు జరిగేలా చూశాం. ఈ దశలో సాధారణ స్థితికి చేరేందుకు 18 నెలల సమయం పట్టవచ్చని చెప్పాం. కానీ పంత్ మాత్రం ఏడాదిలోపే ఫిట్‌నెస్ సాధించి చూపిస్తానని ధీమాగా చెప్పాడు. అన్నట్టుగానే 15 నెలల్లోనే తిరిగి బ్యాట్ పట్టడం అద్భుతమనే చెప్పాలి' అని కోకిలాబెన్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ దిన్షా తెలిపాడు.

బీఆర్‌ఎస్, బీఎస్పీ పొత్తు.. రహస్యమేంటి?

» ఇమడలేకనే బీఆర్‌ఎస్ వీడుతున్నా: కోనేరు కోనప్ప

» మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాగజ్‌నగర్, మార్చి 14: బీఆర్‌ఎస్, బీఎస్పీతో పొత్తు పెట్టుకోవటం వెనుక రహస్య ఒప్పందం ఏంటని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై లేనిపోని ఆరోపణలు చేసి ఓడించిన ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌తో బీఆర్‌ఎస్ జత కట్టడం ఇమడలేకనే ఆ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ చైర్మన్ రాజేందర్‌తోపాటు పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై తనకు ఎలాంటి కోపం లేదన్నారు. తనకు ఎలాంటి పదవులు వద్దని, కేవలం సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధి చాలని వ్యాఖ్యానించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. సిర్పూరు నియోజవర్గ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

బీఆర్‌ఎస్‌కు పెద్దిరెడ్డి రాజీనామా

హుజూరాబాద్, హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి తరువాత కీలక నేతలు పార్టీని వీడుతున్నారు. తాజాగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. తన ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా అధిష్ఠానం వ్యవహార శైలి ఉందని, అది నచ్చకనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం రాజీనామా లేఖను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, రాజకీయాలపై సుదీర్ఘ అనుభవం కలిగిన తనకు పార్టీలో సముచిత గౌరవం లభించలేదని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానన్నారు. కాగా ఆయన అధికార కాంగ్రెస్‌లో చేరతారని సమాచారం.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ముగ్గురు

మహబూబ్‌నగర్, మార్చి14: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో నిలిచారు. మొత్తం 16మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ముగ్గురి దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. 10 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి నవీన్‌కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్ బరిలో నిలిచారు. 28న ఎన్నిక జరగనుంది.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన జానారెడ్డి

» రఘువీర్‌రెడ్డి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న రఘువీర్‌రెడ్డి విజయం కోసం సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మాజీ మంత్రి జానారెడ్డి కోరారు. గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసానికి వెళ్లిన జానారెడ్డి తన కుమారుడు రఘువీర్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో తమ మధ్య ఉన్న అనుబంధాన్ని ఇరువురు నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రఘువీర్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.

రైల్వే రక్షణ దళానికి 'శక్తి టీం' పురస్కారం

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం దక్షిణ మధ్య రైల్వే మహిళా రైల్వే రక్షణ దళానికి 'మహిళల రక్షణ కేటగిరి' కింద 'శక్తి టీం' పురస్కారాన్ని అందించింది. గురువారం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క.. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్‌కు రూ.లక్ష నగదు, జ్ఞాపికను అందించి సత్కరించినట్టు అధికారులు తెలిపారు.

డిప్యూటీ డైరెక్టర్ల నుంచి ఇన్‌స్పెక్టర్ల వరకు

» గనుల శాఖలో ఒకేసారి 79 మందికి స్థానచలనం

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గనులు, భూగర్భ వనరుల శాఖలో రాష్ట్రస్థాయిలో డిప్యూటీ డైరెక్టర్ల నుంచి జిల్లా స్థాయి రాయల్టీ ఇన్‌స్పెక్టర్ల వరకు ఉన్నతాధికారులందరినీ ఒకేసారి ప్రభుత్వం బదిలీ చేయడం సంచలనంగా మారింది. వీరిలో హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న ఎం.వెంకటేశ్వర్లు, వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ పి.మధుసూదన్ రెడ్డి, మరో డిప్యూటీ డైరెక్టర్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో అసిస్టెంట్ డైరెక్టర్లుగా పనిచేస్తున్న 21మంది, అసిస్టెంట్ జియాలజిస్టులు మల్టీజోన్-1లోని 13 మంది, మల్టీజోన్-2లో 9 మంది, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లుగా ఉన్న మల్టీజోన్-1లోని 20 మంది, మల్టీజోన్-2లో 13 మంది ఉన్నతాధికారులు మొత్తం కలిపి 79 మంది ఉన్నారు. గురువారం గనులు, భూగర్భ శాఖ ముఖ్య కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా బదిలీలపై ఉత్తర్వులు జారీ చేశారు. గనులు, భూగర్భ వనరుల శాఖలో అవినీతిపై ఇటీవల చేపట్టిన సమీక్షలో సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ శాఖలో దాదాపు అధికారులందరినీ బదిలీ చేయడం ప్రభుత్వంలో తీవ్ర చర్చనీయాంశమైంది. బదిలీ తర్వాత అధికారుల పనితీరుపైనా నిరంతరం దృష్టి పెట్టాలని సీఎం ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం.

ఏప్రిల్ 4లోగా పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిందే

» నీటి పారుదల శాఖకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ ప్రాజెక్టు, కల్వకుర్తి లిఫ్ట్ పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల బకాయిలను ఏప్రిల్ 4లోగా కాంట్రాక్టు సంస్థకు చెల్లించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులకు హైకోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. బిల్లులు చెల్లించాలంటూ గతంలోనే ఆదేశాలు జారీ చేసినా అమలు చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉచిత పథకాల కోసం రూ.కోట్లు కేటాయించే ప్రభుత్వం.. పూర్తి చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంలో అర్థం లేదని వ్యాఖ్యానించింది. తమ ఆదేశాలను ఎలా అమలు చేయించాలో తెలుసని.. గడువులోపు బిల్లులు చెల్లించకపోతే ఇరిగేషన్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాహుల్ బొజ్జా సహా ఇతర అధికారులు స్వయంగా హాజరుకావాలని ఆదేశాలు జారీ చేస్తామని హెచ్చరించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ ప్రాజెక్టు స్టేజ్-2 ఫేజ్-1 పనులకు సంబంధించి రూ.76.53 కోట్ల బిల్లును ఏ వివాదం లేకున్నా విడుదల చేయడం లేదంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐవీఆర్‌సీఎల్, నవయుగ, ఎస్‌ఈడబ్ల్యూ జాయింట్ వెంచర్ (జేవీ) సంస్థ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ వేసింది. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా ఉన్న పంపింగ్ స్టేషన్లు, ఓఅండ్ఎం పనులకు సంబంధించిన బిల్లు రూ.29 కోట్లు విడుదల చేయడం లేదని మరో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. వీటిపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. బిల్లుల చెల్లింపుల ఫైళ్లు ఏడు దశల్లో క్లియర్ కావాల్సి ఉంటుందని.. మరో మూడు నెలల గడువు కావాలని కోరారు. దీనిపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో నోటీసులు జారీ చేసి కూడా 3 నెలలు అవుతోందని.. మరోసారి గడువు కోరడం సమంజసం కాదని పేర్కొంది. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పుడు వెంటనే ఫైళ్లు క్లియర్ చేయాల్సిందేనని ఆదేశించింది. కోర్టు ఆదేశాల అమల్లో నిర్లక్ష్యం చేస్తే సహించబోమని.. సాంకేతిక కారణాలు చూపి జాప్యం చేస్తే ఏం చేయాలో తెలుసని హెచ్చరిస్తూ విచారణ వాయిదా వేసింది.

డీకే శివకుమార్‌ను కలిసిన మల్లారెడ్డి

తనయుడితో కలిసి బెంగళూరుకు.. కర్ణాటక డిప్యూటీ సీఎంతో భేటీ

పార్టీ మారుతున్నారనే ఊహాగానాలు.. వ్యాపార లావాదేవీలేనన్న మల్లారెడ్డి

హైదరాబాద్/మేడ్చల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గురువారం బెంగళూరులోని ఒక హోటల్లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిశారు. మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి కూడా వెంట ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి పలువురు నేతలు కాంగ్రెస్‌లోకి చేరుతున్న నేపథ్యంలో మల్లారెడ్డి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంకగాంధీని కలిసేందుకు అవకాశం ఇప్పించమని మల్లారెడ్డి కుటుంబసభ్యులు డీకేను కోరినట్టు సమాచారం. గత వారమే మల్లారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి సీఎం సలహాదారు అయిన వేంనరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. అప్పుడే ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రచారం జరిగింది. దాంతో కేటీఆర్ మల్లారెడ్డిని తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. తనకు కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదని మల్లారెడ్డి కేటీఆర్‌కు చెప్పారు. ఆ మాట చెప్పి వారం గడవక ముందే డీకే శివకుమార్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ మారుతున్నట్లు వచ్చిన ఆరోపణలను మల్లారెడ్డి ఖండించారు. తాను బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. బెంగళూరుకు ఒక ఫంక్షన్‌కు వచ్చానని, అక్కడ ఒక ప్రైవేటు వర్సిటీ అమ్మకానికి ఉందని ఫ్రెండ్ చెబితే దాని కొనుగోలు గురించి మాట్లాడటానికి మధ్యవర్తి ద్వారా డీకే శివకుమార్‌ను కలిశానని తెలిపారు. , రాజకీయాలేవీ మాట్లాడలేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి 75 ఏళ్లు దాటుతాయని, ఆ ఎన్నికల్లో పోటీచేసే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. ఈ ఐదేళ్లు బీఆర్‌ఎస్‌లోనే ఉంటూ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. మల్లారెడ్డి డీకే శివకుమార్ దగ్గరే ఆగిపోకుండా ప్రియాంకగాంధీ అపాయింట్‌మెంట్ అడగడం ఊహాగానాలకు తావిస్తోంది. ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్‌లోకి వెళ్లడమే మార్గమని మల్లారెడ్డి భావిస్తున్నారని కాంగ్రెస్‌లోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మల్లారెడ్డి రాకను మేడ్చల్ కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్ రెడ్డి, వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ వ్యతిరేకిస్తున్నారు. రేవంత్ సన్నిహితుడిని కలిసినా చేరిక పని కాకపోవడంతో మల్లారెడ్డి బెంగుళూరు వైపు నుంచి నరుక్కొస్తున్నారని భావిస్తున్నారు.

ఆపరేషన్ రేవంత్!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. రేవంత్ ఆయన సహచర బృందం కదలికలను గుర్తించడంతో పాటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డబ్బులు ఎక్కడినుంచి, ఏయే మార్గాల్లో, ఎవరెవరు సర్దుబాటు చేస్తున్నారు..? అనే వివరాలను ప్రణీత్ ట్యాపింగ్ చేశారు. ముఖ్యంగా ఎన్నికలకు కొద్ది నెలల ముందు నుంచి రేవంత్‌తో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులు, సహకరించే అందరి ఫోన్లపైనా ట్యాపింగ్ కొనసాగినట్లు ఆధారాలు లభించినట్లు తెలిసింది. అప్పటి అధికార పార్టీ బీఆర్‌ఎస్ ఆదేశాల మేరకు నడుచుకున్న ప్రణీత్.. రాజకీయ నాయకులు, పోలీసులతో పాటు ప్రైవేటు వ్యక్తుల సహకారం కూడా తీసుకున్నారు. ఎక్కడికక్కడ తమకు అందుతున్న సమాచారం, ఫోన్ నంబర్ల ఆధారంగా ఎస్ఐబీ ప్రధాన కార్యాలయం, ఇతర వార్ రూంల నుంచి రోజుల వ్యవధిలోనే వందల ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. హార్డ్ డిస్క్‌ల ధ్వంసం, కీలక పత్రాల దహనం కేసు దర్యాప్తులో భాగంగా ప్రణీత్ ఫోన్‌లోని వాట్సాప్ చాటింగ్‌లను దర్యాప్తు అధికారులు పరిశీలించగా బీఆర్‌ఎస్ నేతలతో పాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలను పరిశీలించారు. ఎన్నికల్లో డబ్బులు ఎవరెవరి చేతులు మారుతున్నాయన్న సమాచారం గుర్తించి కట్టడి చేశారని స్పష్టమైంది. అరెస్టు సమయంలో ప్రణీత్‌రావును ప్రాథమికంగా విచారించగా ఒక ఎస్పీ, ఎస్ఐబీ అప్పటి చీఫ్ ఆదేశాల మేరకే తాను, తన బృందం పనిచేసినట్లు వెల్లడించినట్లు తెలిసింది. ప్రణీత్‌ను కస్టడీకి తీసుకుని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఏడు రోజుల కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ప్రణీత్‌రావు కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై సీఎం రేవంత్ పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆరా తీసినట్లు సమాచారం. దీంతో వారు సమగ్ర నివేదిక అందించారని తెలిసింది. ప్రణీత్ వ్యవహారంలో వెలుగులోకి వచ్చిన వ్యక్తుల పేర్లు.. అనుసరించాల్సిన విధానాలపై సీఎంకు వివరించినట్లు సమాచారం. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.



ప్రణీత్‌రావు (ఫైల్)

ఉన్నతాధికారుల చుట్టూ ఉచ్చు

ప్రణీత్‌తో అంటకాగి కుట్రలో భాగస్వాములైన ఎస్ఐబీ అప్పటి ఉన్నతాధికారులను నేడో రేపో విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పంజాగుట్ట పోలీసులు వారికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఎన్నికల ముందు పనిచేసినవారిపై దృష్టి పెట్టినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో అధికారులు వారి ఇళ్లలోనే ప్రత్యేక గదుల్లో (వార్ రూమ్‌లు) ఏర్పాట్లు చేసి, ట్యాపింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని సిద్ధం చేసిన ప్రణీత్‌కు పలువురు సహచరులూ సహకరించినట్లు తెలుస్తోంది. మూడు నియోజకవర్గాల్లో విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు, ఎస్ఐబీ అధికారి ఇళ్లలో వార్ రూమ్‌లను ఏర్పాటు చేసి, ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్నికల సందర్భంగా ఓ పార్టీ నిధుల తరలింపులోనూ ప్రణీత్ కీలక పాత్ర పోషించారని అనుమానిస్తున్నారు. డబ్బు, బంగారం, వస్తువులను చేరవేసేందుకు సొంత, ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ వాహనాలను వినియోగించారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ప్రణీత్ ఫోన్ నుంచి కీలక వివరాలు సేకరించే పనిలో సైబర్ నిపుణులు ఉన్నారు. ఆయన తొలగించిన డేటాను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది బయటకు వస్తే మరింతమంది అరెస్టయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే ఎస్ఐబీ లాగర్ రూమ్‌లో పనిచేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలను విచారించారు.

ట్యాపింగ్ చేయమన్నది ఎవరు?

ట్యాపింగ్‌కు ఎవరు ప్రోత్సహించారు? ఎలాంటి సమాచారం సేకరించారు? ఎవరి పాత్ర ఎంత? అనే ప్రశ్నలకు ప్రవీణ్ స్పష్టంగా సమాధానం ఇచ్చారని తెలుస్తోంది. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించారు. ప్రణీత్ ఫోన్ డేటా విశ్లేషించి, ఏయే నంబర్లతో ఎంత మందితో టచ్‌లో ఉన్నారో తెలుసుకున్నారు. ఎవరెవరి ఫోన్లు ఎంత కాలం ట్యాప్ చేశారు? తదితర అంశాలను దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్ రూమ్‌లకు ఈ డేటాను అందించినట్లు అంచనాకు వచ్చారు. డేటాను కాపీ చేసిన హార్డ్ డిస్క్‌లు ఎక్కడున్నాయో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక బ్యారెక్.. పకడ్బందీ భద్రత

ప్రణీత్‌ను విచారించి ఆధారాలు, సమాచారం రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రణీత్ న్యాయవాదులకు జడ్జి సూచించారు. శుక్రవారం వాదనలు జరిగే అవకాశముంది. కాగా, పోలీసుల అదుపులో ఉన్న ఆయనను బుధవారం రాత్రి చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ప్రణీత్‌ను భద్రతా కారణాల దృష్ట్యా ప్రత్యేక బ్యారెక్‌లో ఉంచారు. సీసీ కెమెరా నిఘాతో పాటు నిరంతరం జైలు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అటువైపుగా ఇతర ఖైదీలను అనుమతించడం లేదు. గురువారం ఉదయం ప్రణీత్ తరపు న్యాయవాది అనుదీప్, సోదరుడు వంశీ ములాఖాత్ అయ్యారు.

కాంగ్రెస్‌లోకి జితేందర్‌రెడ్డి!

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి జితేందర్ నివాసానికి వెళ్లి అరగంట పాటు సమావేశమయ్యారు. ఇది జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న ప్రచారానికి మరింత ఊతమిచ్చినట్లైంది. మరోవైపు ఈ పరిణామం మహబూబ్‌నగర్ జిల్లాలోనూ కలకలం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి వరకు ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో కాంగ్రెస్ నుంచి జితేందర్‌రెడ్డి పోటీ చేస్తారని పెద్దఎత్తున చర్చ జరిగింది. ఇక గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వెళ్లి కలిశారంటేనే పార్టీలోకి ఆహ్వానించడానికి కాదా? అని వ్యాఖ్యానించారు. జితేందర్‌రెడ్డి మనస్తత్వం తనకు తెలుసని, ఎంపీగా రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేస్తే బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు.

ఎన్నికల్లో పోటీ చేయను..

తాను ఎన్నికల్లో పోటీ చేయడం లేదని జితేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. రేవంత్‌తోనూ ఎన్నికల్లో పోటీపై చర్చించలేదని స్పష్టంచేశారు. నిత్యం ప్రజల్లో ఉండే తనకు బీజేపీ టికెట్ రాకపోవడంతో సీఎం బాధపడ్డారని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం చూసి రేవంత్‌రెడ్డి వచ్చినట్లు చెప్పారు. తన భవిష్యత్తును పార్టీ అధినాయకత్వమే చూసుకుంటుందని చెప్పారు. కాగా, జితేందర్‌రెడ్డికి ప్రధాని మోదీ, అమిత్‌షాతో సన్నిహిత సంబంధాలున్నాయి. అయితే, తనకు టికెట్ రాలేదని తెలిసి ఓదార్చేందుకే.. సొంత జిల్లా వాసి అయిన రేవంత్ వచ్చి కలిశారని చెప్పినా మహబూబ్‌నగర్ బీజేపీ, కాంగ్రెస్ వర్గాల్లో మాత్రం పార్టీ మార్పు ఊహాగానాలు పెద్దఎత్తున సాగాయి.

అరుణ ప్రెస్‌మీట్‌లో జితేందర్ కుమారుడు

మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ పేరును ప్రకటించాక జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి అభినందలు తెలిపారు. గురువారం జితేందర్‌రెడ్డి నివాసానికి సీఎం రేవంత్ వెళతారని ప్రచారం జరుగుతున్న సమయంలోనే పాలమూరులో అరుణ మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులోనూ మిథున్‌రెడ్డి పాల్గొనడం గమనార్హం.

నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల కిందట వచ్చి, సంస్థాగత బలోపేతంపై రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేశారు. బీజేపీ సోషల్ మీడియా వారియర్స్‌తో పాటు పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆ పైస్థాయి క్యాడర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ ముఖ్య నేతలతో భేటీ అయి పోలింగ్ బూత్‌ల పటిష్ఠత ఆవశ్యకతను వివరించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆయన మూడు రోజుల పాటు పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు నగరంలో మోదీ రోడ్ షోను నిర్వహించినట్లుగానే ఈసారి కూడా బీజేపీ అదే విధంగా ప్లాన్ చేస్తోంది. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కలిపి ఒక కేంద్రంలో ప్రధాని ఎన్నికల ప్రచారం కొనసాగించేలా రాష్ట్ర పార్టీ ప్రణాళిక రూపొందించింది. ఇందుకు అనుగుణంగా మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ సెగ్మెంట్లకు కలిపి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జరిగే రోడ్ షోలో మోదీ పాల్గొంటారు. మీర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా 1.3 కి.మీ మేర ఈ రోడ్ షోను భారీ ఎత్తున నిర్వహించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం 4.50 గంటలకు ప్రధాని ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5 గంటల నుంచి 6 గంటల వరకు రోడ్ షోలో పాల్గొంటారు. మల్కాజ్‌గిరి చౌరస్తాలో ప్రసంగిస్తారు. అనంతరం, ప్రధాని రాజ్‌భవన్‌కు వెళ్లి బస చేస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు బయలుదేరి నాగర్‌కర్నూలులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఈ సభను ఏర్పాటుచేశారు. అనంతరం గుల్బర్గా బయలుదేరి వెళతారు. తిరిగి 18న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ సెగ్మెంట్లకు సంబంధించి ఈ సభను ఏర్పాటు చేసినట్లు బీజేపీ వర్గాలు వివరించాయి.

రేవంత్‌కు అభద్రతా భావమెందుకు?: లక్ష్మణ్

కాంగ్రెస్‌కు మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలనే కోరుకుంటున్నామని.. కానీ నిలబెట్టుకోలేకపోతే వారి కర్మ అని అన్నారు. రాష్ట్రంలో 12కు పైగా స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని మాజీ ఎంపీ, చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఓటమికి, ఆ పార్టీ పతనానికి అహంకారమే కారణమని మాజీ ఎంపీ, బీజేపీ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి సీతారాం ఢిల్లీలో విమర్శించారు. ప్రజలే ఆ అహంకారాన్ని అణచివేశారని తెలిపారు.

పలు ప్రాజెక్టులకు అనుమతులు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలకు పరిపాలనపర అనుమతులు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగుపై రూ.107.30 కోట్లతో ఆనకట్ట, నాగార్జున సాగర్ ఎడమకాలువపై రూ.35.75 కోట్లతో కొడుమూరు ఎత్తిపోతల పథకం రెండో దశ, కరీంనగర్ జిల్లాలోని కలువల వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.

తెలంగాణలో కాంగ్రెస్‌దే హవా!

17 లోక్‌సభ స్థానాల్లో 10 ఆ పార్టీ ఖాతాలోకే.. బీజేపీ-4, బీఆర్‌ఎస్-2, మజ్లిస్-1

» ఏపీలో టీడీపీ కూటమికి ఘన విజయం

» 25 సీట్లలో 20 గెల్చుకునే అవకాశం

» ఉత్తరాదిన మళ్లీ బీజేపీ ప్రభంజనం

» పలు రాష్ట్రాల్లో కమలం క్లీన్ స్వీప్!

» ఏబీపీ-సీఓటర్ సర్వే అంచనాలు

» తెలంగాణలో బీజేపీ 8 సీట్లు గెలుస్తుందని నెట్‌వర్క్ 18 సర్వే వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 14: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ 10 స్థానాలను కైవసం చేసుకోనుందని ఏబీపీ- సీ ఓటర్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. మొత్తం 17 స్థానాల్లో బీజేపీ 4, బీఆర్‌ఎస్ 2, ఎంఐఎం 1 స్థానం గెలవవచ్చని పేర్కొంది. కాగా, ఓట్ల విషయానికొస్తే.. కాంగ్రెస్ 43 శాతం, బీఆర్‌ఎస్ 28 శాతం, బీజేపీ 25 శాతం, ఎంఐఎం ఒక శాతం ఓట్లను దక్కించుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోరు ఉంటుందని ఈ సర్వే వెల్లడించింది. మొత్తం 25 సీట్లలో టీడీపీ కూటమి 20 సీట్లను తమ ఖాతాలో వేసుకుంటుందని, వైసీపీ కేవలం 5 స్థానాలకే పరిమితమవుతుందని పేర్కొంది. ఓట్ల పరంగా కూటమికి 45 శాతం, వైసీపీకి 42 శాతం, కాంగ్రెస్‌కు 3 శాతం ఓట్లు లభిస్తాయని తెలియజేసింది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే ఈ సర్వే వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.

తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ స్వీప్

కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి 23 సీట్లను, కాంగ్రెస్ ఐదు సీట్లను దక్కించుకుంటాయి. తమిళనాడులో మొత్తం 39 సీట్లనూ డీఎంకే-కాంగ్రెస్ కూటమి స్వీప్ చేయనుంది. కేరళలో ఉన్న 20 సీట్లలో 16 సీట్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెల్చుకోనుంది. మిగిలిన నాలుగు సీట్లు వామపక్ష (ఎల్‌డీఎఫ్) కూటమి కైవసం చేసుకుంటుంది. బీజేపీకి ఒక్క స్థానం కూడా దక్కే అవకాశం లేదు. ఇక దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం, అత్యధికంగా 80 సీట్లను కలిగి ఉన్న యూపీలో ఈసారి కూడా బీజేపీ హవా వీయనుంది. 74 స్థానాలను ఆ పార్టీ సారథ్యంలోని ఎన్‌డీఏ కైవసం చేసుకుంటుంది. ఎస్పీ-కాంగ్రెస్‌లకు ఆరుకు మించి లభించే అవకాశాల్లేవు. బిహార్‌లో మొత్తం 40 స్థానాలకుగాను ఎన్‌డీఏ కూటమి 32 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసే అవకాశం ఉంది. మిగిలిన ఎనిమిది సీట్లకే ఇండియా కూటమి పరిమితం కావచ్చు. పంజాబ్‌లో మొత్తం 13 స్థానాలు ఉండగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరు స్థానాలను గెల్చుకునే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ 5, బీజేపీ, అకాలీదళ్ చెరో స్థానాన్ని ఖాతాలో వేసుకోవచ్చు. 14 సీట్లున్న జార్ఖండ్‌లో 12 ఎన్‌డీఏ కూటమికి, రెండు ఇండియా కూటమికి లభించవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో మొత్తం ఏడు సీట్లనూ బీజేపీ మరోసారి హస్తగతం చేసుకోనుంది. హరియాణాలో 10 స్థానాలకుగాను బీజేపీ 8, కాంగ్రెస్ 2 స్థానాల్లో విజయం సాధించే అవకాశాలున్నాయి. గుజరాత్ (26), రాజస్థాన్ (25), హిమాచల్ ప్రదేశ్ (4)లను బీజేపీ పూర్తిగా క్లీన్‌స్వీప్ చేయనుంది. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న 11 స్థానాల్లో 9 బీజేపీ ఖాతాలోనే పడతాయని ఏబీపీ సీ ఓటర్ సర్వే అంచనా వేసింది. కాగా, నెట్‌వర్క్ 18.. 'మెగా ఒపీనియన్ పోల్' పేరుతో తెలంగాణలో తమ సర్వే వివరాలను గురువారం వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం.. రాష్ట్రంలోని 17 సీట్లలో బీజేపీ 8 కైవసం చేసుకుంటుంది. కాంగ్రెస్ 6, బీఆర్‌ఎస్ 2, ఎంఐఎం ఒక స్థానంలో గెలిచే అవకాశాలున్నాయి. అయితే, ఓట్ల పరంగా కాంగ్రెస్ అత్యధికంగా 34 శాతం ఓట్లను దక్కించుకుంటుందని, బీజేపీకి 28 శాతం, బీఆర్‌ఎస్‌కు 27 శాతం, ఇతరులకు 11 శాతం ఓట్లు లభిస్తాయని ఈ సర్వే పేర్కొంది.

మల్కాజిగిరిలో రాగిడి లక్ష్మారెడ్డి

ఆదిలాబాద్‌లో ఆత్రం సక్కు.. మరో రెండు ఎంపీ స్థానాలకు బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఖరారు చేసిన కేసీఆర్

హైదరాబాద్, ఆదిలాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగనున్న మరో ఇద్దరు బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం ప్రకటించారు. మల్కాజిగిరి ఎంపీ స్థానానికి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ స్థానానికి ఆత్రం సక్కు అభ్యర్థిత్వాలను ఆయన ఖరారు చేశారు. ఇప్పటికే ప్రకటించిన వాటితో కలిపి ఇప్పటి వరకు 11లోక్‌సభ స్థానాలకు బీఆర్‌ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించింది. ఉప్పల్ టికెట్ రాకపోవడంతో రాగిడి లక్ష్మారెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే మల్కాజిగిరి స్థానం నుంచి పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ అనూహ్యంగా రాగిడి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంపై పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన నేతలతో నందినగర్‌లోని తన నివాసంలో కేసీఆర్ గురువారం భేటీ అయ్యారు. ఆదిలాబాద్‌లో పార్టీ అభ్యర్థి ఎవరన్నదానిపై నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో ఆదివాసీ ఉద్యమనేత, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించారు. సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయనకు ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో అవకాశం ఇవ్వలేదు. అదేసమయంలో ఆయనకు లోక్‌సభకు అవకాశం ఇస్తామన్న అధినాయకత్వం హామీ మేరకు తాజాగా ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందిన ఆత్రంసక్కు ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఇప్పటికే బీజేపీ పార్టీ ఆదివాసీ నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం, కాంగ్రెస్‌పార్టీ ఆదివాసీ నేతను బరిలోకి దించేందుకు అవకాశం ఉండడంతో బీఆర్‌ఎస్ కూడా ఆదివాసీనేతకు అవకాశం కల్పించింది. పొత్తుల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఎస్పీ పార్టీ అభ్యర్థి, జడ్పీ మాజీ చైర్మన్ సిడాంగణపతికి అవకాశం దక్కుతుందన్న ప్రచారం జరిగింది. కానీ ఆదిలాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ నేతలంతా ఆత్రంసక్కు వైపే మొగ్గు చూపడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. కాగా గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన నగేశ్.. తనకు ఈసారి టికెట్ దక్కదని భావించి పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆయనకు ఆదిలాబాద్ టికెట్ ప్రకటించారు.



రాగిడి లక్ష్మారెడ్డి



ఆత్రంసక్కు

వడివడిగా ప్రజాపాలన

వంద రోజుల విజయాలను వెల్లడించిన రేవంత్ ప్రభుత్వం



కాంగ్రెస్ సర్కారుకు 100 రోజులు

- ఏకంగా 29వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి..
- గృహ జ్యోతితో 40లక్షలపైగా కుటుంబాలకు లబ్ధి
- 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం..
- టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన.. త్వరలో జాబ్ క్యాలెండర్

హైదరాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజాపాలన దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఒక్కో గ్యారంటీని అమలు చేస్తూ శుక్రవారంతో వంద రోజుల పాలనను పూర్తి చేసుకోబోతుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతోపాటు ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షల దాకా చికిత్సను అందించే ఫైలుపై తొలి సంతకం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఎన్నికల ప్రచారంలో మాటిచ్చిన విధంగానే తొలి రోజునే ప్రగతిభవన్ ముందున్న కంచెను తొలగించేలా చర్యలు చేపట్టారు. విధ్వంసానికి గురైన వ్యవస్థలను ఒక్కటొక్కటిగా చక్కదిద్దుతూ మొదటి వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేసినట్లు తాజాగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సర్కారు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత ఏడాది డిసెంబరు 28వ తేదీ నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, అర్హులకు పథకాలు అందజేసింది. ఔటర్ రింగ్‌రోడ్డు టోల్ టెండర్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణకు ఆదేశించడంతోపాటు గొర్రెల పంపిణీ చేపపిల్లల పథకాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న ఏజెన్సీతోపాటు మిషన్ భగీరథ పనులపై విచారణ చేపట్టడం ద్వారా అవినీతిపై ఉక్కుపాదం మోపింది. వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో రూ.వంద కోట్లకుపైగా వ్యాట్ ఎగవేతపై విచారణకు ఆదేశించడంతోపాటు ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ అధికారుల పాత్రను వెలికితీసింది. వారంలో రెండు రోజుల పాటు ప్రజలు తమ సమస్యలను నివేదించుకోవడానికి వీలుగా ప్రజావాణి కార్యక్రమాన్ని తీసుకొచ్చింది.

29 వేల ఉద్యోగాలు

అధికారంలోకి రాగానే నియామక ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం వేగిరం చేసింది. మూడు నెలల్లోనే 29,384 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేసి, ఎంపికైన అభ్యర్థులందరికీ నియామక పత్రాలు అందించింది. వీరిలో 53 శాతం పురుషులు, 47 శాతం మహిళలు ఉన్నారు. ఈ ఉద్యోగాలన్నీ కూడా మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్మెంట్ బోర్డు, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు, టీఎస్‌పీఎస్సీ, సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీల పరిధిలోనివే. ఇవీ కాక సింగరేణిలో 441 మందికి కారుణ్య నియామకాలు కల్పించారు. గత ప్రభుత్వ హయాంలోని రిజర్వేషన్ల వివాదాలు, ఫలితాల నిలిపివేతలు, కోర్టు కేసులన్నింటినీ అధిగమిస్తూ.. టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేసింది. కొత్త పాలకవర్గాన్ని నియమించి, యూపీఎస్సీ తరహాలో పరీక్షల నిర్వహణకు సన్నాహాలు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో గ్రూప్-1 పరీక్ష రెండుసార్లు రద్దుకాగా.. కొత్త పోస్టులను చేర్చి.. 563 పోస్టులతో గ్రూప్- 1 కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. 11,062 టీచర్ పోస్టుల భర్తీతో మెగా డీఎస్సీని ప్రకటించింది. త్వరలో జాబ్ క్యాలెండర్ అమలుకు రంగం సిద్ధం చేస్తోంది. గత ప్రభుత్వ పాలన తీరును ఎండగడుతూ కాంగ్రెస్ సర్కారు శ్వేతపత్రాలను విడుదల చేసింది. ఆర్థిక స్థితిగతులు, విద్యుత్ రంగాన్ని ధ్వంసం చేసిన తీరుతోపాటు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అవకతవకలను ప్రజల దృష్టికి తీసుకెళ్లింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ముఖ్యమంత్రి, మంత్రులతోపాటు అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం మేడిగడ్డను సందర్శించి.. ప్రాజెక్టు వైఫల్యాన్ని ప్రజల ముందుంచింది.



ఉచిత ప్రయాణం @ 23కోట్ల మంది

మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించగా.. ఇప్పటిదాకా 23 కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారు. ఇదే పథకం కింద కేవలం రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకాన్ని కూడా ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. మరోవైపు.. అరులైన పేద కుటుంబాలకు 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్తును అందించే 'గృహ జ్యోతి' పథకాన్ని ఈ నెల 1వ తేదీ నుంచే అమలు చేస్తోంది. 200 యూనిట్లలోపు విద్యుత్తు వాడే 40 లక్షల మందికి పైగా గృహ వినియోగదారులందరికీ జీరో బిల్లు జారీ చేసింది. అలాగే, రూ.22,500 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 4,50,000 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సంకల్పించింది. నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. అరులైన నిరుపేదలకు సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ఈ పథకం కింద అందనుంది. మలి విడతలో ఇళ్ల స్థలాలు లేనివారికి ప్రభుత్వ స్థలం కేటాయించడంతోపాటు ఆర్థిక సాయం అందిచనుంది.

సాధించిన విజయాలు, తీసుకున్న నిర్ణయాలు

- ఎనిమిదిన్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రక్షణ శాఖ భూముల సమస్యకు పరిష్కారం లభించడంతో హైదరాబాద్-రామగుండం రాజీవ్ రహదారిపై రూ.2,232 కోట్లతో భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు జాతీయ రహదారి-44పై రూ.1580 కోట్లతో డబుల్ డెక్కర్ కారిడార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.
- రూ.2,700 కోట్లతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఐటీఐల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు.
- దావో‌స్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో దాదాపు రూ.40,232 కోట్ల పెట్టుబడులు, 30 వేల ఉద్యోగాల కల్పనకు భరోసా.
- 300 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ ఫేజ్-2 ప్రారంభిస్తామని బయో ఆసియా సదస్సులో సీఎం రేవంత్ ప్రకటన. రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో 5 లక్షల మందికి ఉద్యోగాల కల్పన. వికారాబాద్, మెదక్, నల్లగొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ల ఏర్పాటుకు నిర్ణయం
- ధరణి సమస్యల పరిష్కారానికి ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీ
- హైదరాబాద్‌లో మూసీ పునరుజ్జీవం, పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టుకు ప్రతిపాదనలు
- హైదరాబాద్‌లో డ్రగ్స్ చలామణి పై ఉక్కుపాదం
- సింగరేణిలో 43వేల మంది కార్మికులకు వర్తించేలా రూ.కోటి ప్రమాద బీమాకు బ్యాంకులతో ఒప్పందం
- హైకోర్టు నూతన భవనానికి 100 ఎకరాల స్థలం కేటాయింపు
- పారిశ్రామిక అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్ 2050.
- ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున నియోజకవర్గాల అభివృద్ధికి రూ.1190 కోట్ల నిధులు.
- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన
- కొడంగల్‌లో మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ కాలేజీలకు భూమి పూజ.
- ట్యాంక్‌బండ్‌పై గద్దర్ విగ్రహం ఏర్పాటుకు పచ్చజెండా
- కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు గద్దర్ అవార్డు అందజేస్తామని ప్రకటన
- హుస్సేన్ సాగర్ చుట్టూ దుబాయ్ మోడల్ టూరిజం స్పాట్ ఏర్పాటు
- రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు.
- రాష్ట్ర గీతంగా 'జయ జయహే తెలంగాణ'





శిల్పారామంను సందర్శిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

శిల్పారామంలో స్టాల్స్ మహిళలకే: సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో స్టాల్స్ అన్ని మహిళలకే కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్, హైటెక్ సిటీ సమీపంలోని శిల్పారామం పక్కన నిరుపయోగంగా ఉన్న స్టాల్స్‌ను ముఖ్యమంత్రి గురువారం పరిశీలించారు. 2017 నుంచి నిరుపయోగంగా ఉన్న నైట్ బజార్‌లోని 119 స్టాల్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మహిళా శక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా స్టాళ్లను తీర్చిదిద్దాలని సూచించారు. స్టాళ్లను మహిళలకే కేటాయించేందుకు అవసరమైన ఉత్తర్వులను సిద్ధం చేయాలని ఆదేశించారు.



రైతులకు చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల

పంట రుణాలివ్వడం బ్యాంకర్ల సామాజిక బాధ్యత!

- రైతుల పట్ల నిర్లక్ష్యం, అసహనం ప్రదర్శించొద్దు
- అన్నదాతల పట్ల మానవీయ కోణంలో వ్యవహరించాలి: భట్టి
- వేలకోట్లు తీసుకున్న వ్యాపారుల నుంచి ఎందుకు రికవరీ చేయరు?
- వ్యవసాయ, అనుబంధరంగాలకు ప్రాధాన్యమివ్వాలి: తుమ్మల

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పంట రుణాలు ఇవ్వడం సామాజిక బాధ్యతగా బ్యాంకర్లు భావించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతుల పట్ల బ్యాంకర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, అసహనాన్ని ప్రదర్శించొద్దని సూచించారు. రుణాలిచ్చే విషయంలో రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సాగు పెట్టుబడి కోసం అన్నదాతలు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారని, ఫలితంగా ఆ అప్పులు తీర్చలేక వారు ఆత్మహత్యకు పాల్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల పట్ల బ్యాంకర్లు మానవీయ కోణంలో వ్యవహరించాలని సూచించారు. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ 40వ త్రైమాసిక సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రాధాన్యంగా తీసుకున్నదని చెబుతూ వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలను ముందుకు తీసుకెళ్లేందుకు బ్యాంక్లరు సహకరించాలని కోరారు. గత పదేళ్లలో చాలా మంది రైతుల బ్యాంకు ఖాతాలు సరైన నిర్వహణ లేక గందరగోళంగా మారాయని, వారికి కొత్త రుణాలు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయం, హౌసింగ్, విద్యకు ఇచ్చే రుణాలను బ్యాంకర్లు ప్రాధాన్యంగా తీసుకోవాలన్నారు. రైతులు, నిరుద్యోగులకు రుణాలిచ్చే విషయంలో ఆస్తులను తాకట్టు పెట్టుకోవడం సరికాదని, స్వయం ఉపాధి కొరకు వారికి రుణాలివ్వాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘంలో ఉన్న మహిళా సభ్యులను కోటీశ్వరులుగా చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం అని, ఆ మేరకు బ్యాంకర్లు ఆ సంఘాలకు అధిక రుణాలు ఇవ్వాలని సూచించారు. రానున్న ఐదు సంవత్సరాల్లో డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.లక్ష కోట్ల మేర రుణాలను వడ్డీలేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పించనున్నదని, ఇందుకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. మహిళలకు ఇచ్చే వడ్డీ లేని రుణాల డబ్బులను బ్యాంకర్లకు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.

వ్యవసాయ, అనుబంధ రంగాలకు బ్యాంకర్లు ప్రాధాన్యమివ్వాలి: తుమ్మల

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ముందుకు తీసుకెళ్లేందుకు బ్యాంకర్లు సహకరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రుణాలిచ్చే విషయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు బ్యాంకులు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో డిమాండ్‌కు తగ్గట్టుగా పాలఉత్పత్తి లేదని, పాడి పరిశ్రమ నెలకొల్పేందుకు ముందుకొచ్చే రైతులకు బ్యాంకర్లు రుణాలిచ్చి ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు ట్రాక్టర్ల కోసం రుణం ఇస్తూ పొలాన్ని తనఖా పెట్టుకుంటున్నారని, రుణం తీర్చకపోతే భూమిపైకి వస్తున్నారని. అయితే వేల కోట్లు అప్పులు తీసుకున్న వ్యాపారుల నుంచి మాత్రం రికవరీ చేయడం లేదని పేర్కొన్నారు. బడా వ్యాపారుల విషయంలో ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు? అని బ్యాంకర్లను ప్రశ్నించారు. ఈ సందర్భంగా పట్టు గూళ్ల పెంపకం రైతులకు ప్రోత్సాహకంగా రూ.1,83,41,000 చెక్కును భట్టి, తుమ్మల అందజేశారు.

వ్యవసాయ విద్యార్థులకు యూఎస్‌లో మాస్టర్స్ డిగ్రీకి చాన్స్: తుమ్మల

ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తయిన విద్యార్థుల్లో ఇద్దరు చొప్పున ఏడాదికి నలుగురు విద్యార్థులకు యూఎస్‌లో 'ఏయూబీయూఆర్‌ఎన్' యూనివర్సిటీలో సంబంధిత విద్యలో మాస్టర్స్ డిగ్రీ చేసేందుకు ఓవర్‌సీస్ ఫెలోషిప్‌లు ఇవ్వనున్నట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఈ నిర్ణయం తీసుకుందని, ఓవర్‌సీస్ ఫెలోషిప్‌లు మూడేళ్లవరకు ఇవ్వాలని నిర్ణయించినట్టు చెప్పారు. మాస్టర్స్ డిగ్రీకి విద్యార్థులకయ్యే రెండేళ్ల ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

నేటి నుంచి వాహనాల కోడ్ 'టీజీ'

0001 నుంచి ప్రారంభం కానున్న రిజిస్ట్రేషన్లు.. ఇప్పటికే 'టీఎస్'గా నమోదైన వాహనాలు యథాతథం

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మోటారు వాహనాల రిజిస్ట్రేషన్ రాష్ట్ర కోడ్ శుక్రవారం నుంచి 'టీజీ'గా మారనుంది. రాష్ట్ర కోడ్‌ను 'టీఎస్' నుంచి 'టీజీ'కి మార్చాలంటూ రేవంత్ రెడ్డి సర్కారు కేంద్రాన్ని కోరిన విషయం తెలిసిందే.! మూడ్రోజుల క్రితం ఆ మేరకు కేంద్ర రవాణా శాఖ ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీచేసింది. శుక్రవారం నుంచి 'టీజీ' కోడ్‌ను అమలు చేయాలంటూ రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కేఎస్ శ్రీనివాసరాజు గురువారం గెజిట్ విడుదల చేశారు. దీంతోపాటుగా.. ఇంతకు ముందు పేర్కొన్న జిల్లా వాహనాల కోడ్‌లు యథావిధిగా కొనసాగుతాయని, వాటికి ముందు టీజీ చేరుతుందని చెబుతూ.. ఆ జాబితాను విడుదల చేశారు. అంతేకాదు.. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న రిజిస్ట్రేషన్లు '0001' నుంచి మొదలవుతాయి. కాగా.. రాష్ట్రంలో రోజుకు సగటున 4 వేల వరకు వాహనాల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

టీఎస్ వాహనాలు యథాతథం!

రాష్ట్ర వాహనాల కోడ్ 'టీజీ'గా మారిన నేపథ్యంలో.. గత పదేళ్లుగా 'టీఎస్'గా రిజిస్టర్ అయిన వాహనాలు యథాతథంగా కొనసాగుతాయని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రిజిస్టర్ అయిన 'ఏపీ' కోడ్ తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా కొనసాగింది. ఇప్పుడు 'టీఎస్' విషయంలోనూ అంతే. వాటన్నింటినీ 'టీజీ'గా మార్చడం భారీ ప్రక్రియ. పైగా.. వాహనదారులకు రిజిస్ట్రేషన్ కార్డు, కొత్త హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ కోసం అదనపు చార్జీల భారం పడుతుంది. ఒకవేళ అలా చేసినా.. హైసెక్యూరిటీ నంబర్‌ప్లేట్ల ఉత్పత్తిదారులపై భారం పడి.. మళ్లీ పెండెన్సీ పెరిగే ప్రమాదం ఉంటుంది" అని రవాణాశాఖకు చెందిన ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

'స్పెషల్ నంబర్' పరిస్థితి ఏమిటి?

రవాణా శాఖలో 'స్పెషల్ నంబర్' రిజర్వేషన్ తెలిసిందే. ఒకే నంబర్ కోసం ఎక్కువ మంది పోటీ పడితే.. వేలం వేస్తారు. అలాంటి నంబర్ల కోసం రూ.లక్షల్లో వేలం పాడుకున్న సందర్భాలను చూశాం. గురువారం కూడా కొన్ని వేల సంఖ్యలో స్పెషల్ నంబర్లు రిజిస్టర్ అయ్యాయి. అవన్నీ 'టీఎస్' కోడ్‌తో ఆయా వాహనాల తాత్కాలిక రిజిస్ట్రేషన్(టీఆర్), ఇంజన్, చాసిస్ నంబర్ల ఆధారంగా రిజర్వ్ అయిపోయాయి. అలా రిజర్వ్ చేసుకున్న వారు 15 రోజుల్లోగా తమ వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించాలి. అయితే.. 'టీఎస్'ను 'టీజీ'గా మారుస్తూ కేంద్రం, రాష్ట్రం గెజిట్లు జారీ చేశాయి. అంటే.. ఇకపై రిజిస్టర్ అయ్యే వాహనాలన్నీ 'టీజీ' కోడ్‌తో ఉండాలి. కొత్త రిజిస్ట్రేషన్లన్నీ '0001'తో ప్రారంభం కావాలి. అలాంటప్పుడు ముందే స్పెషల్ నంబర్‌ను రిజర్వ్ చేసుకున్న వారి పరిస్థితి ఏమిటి? అనే ఆందోళన వాహనదారుల్లో తలెత్తుతోంది. "ఈ సమస్యను ముందుగా గుర్తించలేకపోయాం. గురువారం కూడా రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో స్పెషల్ నంబర్లు రిజర్వ్ అయ్యాయి. అలాంటి వాహనాలకు మాత్రం 'టీఎస్'గా రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. అడ్వాన్స్‌డ్ నంబర్ రిజిస్ట్రేషన్ అనే విధానాన్ని 2005-06లో రద్దు చేసి, ఏరోజుకారోజు లిస్టులో ఉండే నంబర్లు, ఆ రోజు లిస్టుకు ముందు ఉండే వెయ్యి నంబర్లు మాత్రమే రిజర్వేషన్‌కు అందుబాటులో పెట్టాలంటూ ప్రభుత్వం నిబంధనలను సవరించింది. ఈ ప్రకారం ఇప్పుడు స్పెషల్ నంబరు రిజర్వ్ చేసుకున్న వారికి 'టీజీ'లో నంబర్ ఇవ్వడానికి వీల్లేదు. దీనిపై ప్రభుత్వం శుక్రవారం స్పష్టతనిచ్చే అవకాశం ఉంది" అని రవాణా శాఖకు చెందిన ఓ అధికారి వివరించారు.

టీజీతో తెలంగాణ ఆత్మగౌరవం : పొన్నం

టీజీ అనే పదం తెలంగాణ ఆత్మ గౌరవం అని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఆయన హనుమకొండ కలెక్టరేట్, భీమదేవరపల్లి, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేంద్ర ప్రభుత్వం జూన్ 2న గెజిట్‌లో టీజీ అనే పేర్కొన్నదని గుర్తుచేశారు. అయితే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం కేంద్ర ప్రభుత్వానికి నివేదించి టీఎస్‌గా మార్పించారు. తాము క్యాబినెట్, శాసనసభ తీర్మానం మేరకు కేంద్రానికి విజ్ఞప్తి చేసి, తిరిగి 'టీజీ'గా మార్పించామన్నారు.

317 జీవోతో విధ్వంసం!

- ఇది రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధం
- ఇప్పటికైనా ఆ జీవోను వెంటనే సవరించాలి
- స్థానికతతోనే ఉద్యోగుల విభజన చేపట్టాలి
- మంత్రివర్గ ఉపసంఘానికి వినతుల వెల్లువ

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జారీ చేసిన 317 జీవోతో భారీ విధ్వంసం చోటు చేసుకుందని, స్థానికత అంశాన్ని కాలరాస్తూ ఇష్టానుసారం ఉద్యోగుల శాశ్వత కేటాయింపు జరిగిందని పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయపడ్డాయి. ఈ జీవో రాష్ట్రపతి ఉత్తర్వులకు పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నాయి. జీవో 317ను సవరించి, ఉద్యోగుల విభజనలో స్థానికతను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రివర్గ ఉపసంఘాన్ని కోరాయి. మంత్రి దామోదర రాజనర్సింహ చైర్మన్‌గా, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఏర్పాటైన మంత్రి వర్గ ఉప సంఘం గురువారం సచివాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నుంచి వినతులు స్వీకరించింది. టీజీవో, టీజీటీఏ, యూటీఎఫ్, జీహెచ్ఏ, జీటీఏ సంఘాల నాయకులు పలు సమస్యలను ఉప సంఘం దృష్టికి తీసుకెళ్లారు.

ఇవీ వినతులు

- క్యాడర్‌లో జూనియర్ అయిన కారణంగా స్థానికేతర మల్టీజోన్/జోన్/జిల్లాకు కేటాయించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను వారి మొదటి ఐచ్ఛికం ప్రకారం స్థానిక మల్టీజోన్/జోన్/జిల్లాలకు బదిలీ చేయాలి. ఖాళీలు లేకపోతే సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించడంతోపాటు పదవీ విరమణ వల్ల ఏర్పడే ఖాళీల్లోనూ దశల వారీగా అబ్జార్బ్ చేయాలి.
- 2017 టీఆర్టీలో ఎంపికై స్థానికేతర జిల్లాల్లో నియమితులైన ఉపాధ్యాయులను వారి ఐచ్ఛికాల మేరకు స్థానిక జిల్లాకు బదిలీ చేయాలి.
- కారుణ్య నియామకం పొందిన వితంతు ఉద్యోగులకు మాత్రమే గత కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇచ్చారు. అలా కాకుండా వితంతు ఉద్యోగులందరినీ వారి ఐచ్ఛికాల ప్రకారం కోరుకున్న మల్టీజోన్/జోన్/జిల్లాకు బదిలీ చేయాలి.
- దంపతులైన ఉద్యోగులందరినీ వారి ఐచ్ఛికాల ప్రకారం ఒకే మల్టీజోన్/జోన్/జిల్లాకు బదిలీ చేయాలి. భార్య లేదా భర్త కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్నా పరిగణనలోకి తీసుకోవాలి.
- ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను ఆయా జిల్లాల్లో ఖాళీల దామాషా ప్రకారం కాకుండా అదనంగా లేదా తక్కువ కేటాయించారు. దీని వల్ల నష్టపోయిన వారిని కోరుకున్న మల్టీజోన్/జోన్/జిల్లాకు బదిలీ చేయాలి.

టెన్త్ పరీక్షల్లో 5 నిమిషాల గ్రేస్ టైం

- ఈ నెల 18 నుంచి పరీక్షల ప్రారంభం
- ఉదయం 9.30 నుంచి 12.30 వరకు
- ముగిసిన ఇంటర్మీడియట్ పరీక్షలు



హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలకు 5 నిమిషాల 'గ్రేస్ టైం' ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలు వచ్చే నెల 2వ తేదీ వరకు కొనసాగుతాయి. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు జరుగనున్నాయి. ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గ్రేస్ టైం ఇచ్చిన అధికారులు టెన్త్ పరీక్షల్లోనూ ఇవ్వాలని నిర్ణయించారు. అంటే పరీక్ష ప్రారంభ సమయం దాటిన తర్వాత 5 నిమిషాల వరకు విద్యార్థులను అనుమతించనున్నారు. పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోలేని విద్యార్థులకు ఈ నిర్ణయంతో మేలు జరుగుతుంది. ఈ సారి సైన్స్ పరీక్షను రెండు పేపర్లుగా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. పార్ట్-1లో ఫిజిక్స్ పార్ట్-2లో బయాలజీ ఉంటాయి. ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు 5,08,385 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో 2,57,952 మంది బాలురు, 2,50,433 మంది బాలికలు ఉన్నారు. మొత్తం 2,676 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, కెమెరాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం (040-23230942)కు ఫోన్ చేసి విద్యార్థులు అవసరమైన సేవలు పొందచ్చని అధికారులు సూచించారు. హాల్ టికెట్లను ప్రధానోపాధ్యాయుల నుంచి తీసుకోవాలని తెలిపారు. www.bse.telangana.gov.in అనే వెబ్ సైట్‌లో కూడా హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచామని, కావాలంటే వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. హాల్ టికెట్లల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే సంబంధిత ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

శుక్రవారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహిస్తారు. ఈ విద్యా సంవత్సరం చివరి రోజైన ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈ నిబంధన వర్తిస్తుంది. విద్యార్థులకు 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం అందించాల్సి ఉంటుంది. టెన్త్ పరీక్షా కేంద్రాలుగా ఉన్న బడులను మాత్రం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలని అధికారులు సూచించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారంతో ముగిశాయి..


గ్రూప్-1 దరఖాస్తు గడువు పొడిగింపు

- 16న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుకు అవకాశం

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే గడువును తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) గురువారం పొడిగించింది. ఈ పోస్టులకు దరఖాస్తు గడువు ఈ నెల 14వ తేదీతో ముగిసింది. అయితే గడువును ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించారు. రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. వీటికి ఫిబ్రవరి 23 నుంచి అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. గతంలో గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ వచ్చినప్పుడు సుమారు 3.8 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈసారి ఆ స్థాయిలో దరఖాస్తులు రాలేదు. తాజాగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి గడువును రెండు రోజులు పొడిగించిన నేపథ్యంలో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. కాగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను జూన్ 9న, మెయిన్ పరీక్షలను అక్టోబరు 21 నుంచి నిర్వహించనున్నారు.

ఇంధన సామర్థ్యంలో హైదరాబాద్‌ను అగ్రగామిగా నిలుపుతాం

- పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్



హైదరాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఇంధన సామర్థ్యంలో హైదరాబాద్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎం. దానకిశోర్ తెలిపారు. అందుకోసం ఇంధన సామర్థ్యంలో పెట్టుబడిదారులను ఆకర్షించడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. గురువారం హైదరాబాద్‌లో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ) ఆధ్వర్యంలో విషన్ లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధితో పాటు, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం, నగర సామాజిక, ఆర్థిక, పర్యావరణ వ్యవస్థల్ని మెరుగుపరచడం కూడా తమ లక్ష్యమని దానకిశోర్ చెప్పారు. ఇవన్నీ పూర్తయితే లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడనున్నాయి. ఈ కార్యక్రమంలో బీఈఈ కార్యదర్శి మిలింద్ దేవ్‌రా, బీఈఈ డైరెక్టర్లు సౌరభ్ దీదీ, ఎస్‌కే వర్మా, బీఈఈ దక్షిణాది రాష్ట్రాల సలహాదారుడు ఎ.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సింగరేణిలో 327 పోస్టుల భర్తీ

సింగరేణిలో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ కేటగిరీలో 327 పోస్టుల భర్తీకి గురువారం నోటిఫికేషన్ వెలువడింది. వీటిలో మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఈ అండ్ ఎం-ఈ2 గ్రేడ్) 42, మేనేజ్‌మెంట్ ట్రైనీ (సిస్టమ్స్)-ఈ2 గ్రేడ్ 7 పోస్టులతోపాటు 100 జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ, 9 అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ, 24 అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ, 47 ఫిట్టర్ ట్రైనీ, 98 ఎలక్ట్రీషియన్ ట్రైనీ పోస్టులున్నాయి. ఈ పోస్టులకు ఏప్రిల్ 15వ తేదీ నుంచి మే 4 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. 30 ఏళ్లలోపు వయసున్న వారు ఉద్యోగాలకు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు ఐదేళ్ల వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. దరఖాస్తుల సమర్పణకు www.scclmines.com అనే వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

ప్రతీ డ్యామ్‌కూ డిజిటల్ లాగ్‌బుక్: ఎన్‌డీఎస్‌ఏ

రాష్ట్రంలో జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) పరిధిలోకి వచ్చే డ్యామ్‌లు, బ్యారేజీల సమగ్ర సమాచారంతో కూడిన డిజిటల్ లాగ్‌బుక్‌లు నిర్వహించాలని ఆ సంస్థ స్పష్టం చేసింది. స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎన్‌డీఎస్‌వో) ఈ బాధ్యత తీసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు గురువారం ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ లాగ్‌బుక్‌లో 35 రకాల ప్రధాన సమాచారంతో పాటు అనుబంధ వివరాలు పొందుపరచాలని నోటిఫికేషన్‌లో నిర్దేశించారు. ప్రధానంగా వర్షాకాలంలో రిజర్వాయర్ నీటి మట్టాన్ని ప్రతి గంటకు ఒకసారి, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో సమాచారాన్ని ప్రతి రోజూ తెలియజేయాలని పేర్కొన్నారు. అనుకోకుండా చోటుచేసుకునే ఘటనలు/పరిణామాలకు సంబంధించిన 13 రకాల సమాచారం రికార్డు చేయాల్సిందేనని పేర్కొన్నారు. డ్యామ్ ఎత్తు 60 మీటర్లు, ఆ పైన ఉంటే దాని సేఫ్టీ యూనిట్‌కు ఇన్‌చార్జిగా చీఫ్ ఇంజనీర్ ఉండాలని పేర్కొన్నారు.

నేడు సుప్రీంలో ఎమ్మెల్సీ కవిత పిటిషన్‌పై విచారణ

న్యూఢిల్లీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరగనుంది. ఫిబ్రవరి 28న కేసు తుది విచారణ జరగాల్సి ఉండగా, ఆ రోజు సమయం సరిపోకపోవడంతో కేసును వాయిదా వేశారు. మద్యం కేసులో విచారణకు రావాలని గతేడాది ఈడీ జారీ చేసిన నోటీసుల్ని కవిత సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.

34 మందితో రెండో జాబితా

ఏపీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటన.. 'ఎక్స్'లో పార్టీ అధినేత చంద్రబాబు పోస్ట్



అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీకి పోటీ చేయబోయే టీడీపీ అభ్యర్థుల రెండో జాబితాను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు గురువారం 'ఎక్స్' వేదికగా విడుదల చేశారు. ఈ జాబితాలో 34 మంది పేర్లు ఉన్నాయి. 94 మందితో ఇదివరకే మొదటి జాబితాను విడుదల చేశారు. ప్రజల్లో పట్టున్న నేతలనే ఎంపిక చేయడం ఈ రెండు జాబితాల్లోనూ స్పష్టంగా కనిపించింది. కొన్నిచోట్ల మార్పుపై తర్జనభర్జనలు జరిగినా ప్రజల్లో సానుకూలత ఉందనుకున్న చోట సీనియర్లకే అవకాశం ఇచ్చారు. మొత్తం 175 అసెంబ్లీ సీట్లకు గాను జనసేన, బీజేపీలతో పొత్తులో భాగంగా టీడీపీ 144 స్థానాల్లో పోటీ చేయనుంది. వీటిలో ఇప్పటికి రెండు జాబితాల్లో కలిపి 128 సీట్లకు అభ్యర్థులను ప్రకటించగా.. ఇంకా 16 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. కొద్ది రోజుల్లోనే వీటిని కూడా ప్రకటించనున్నారు. ఇప్పటి వరకు టీడీపీ ప్రకటించిన సీట్లలో బీసీ, ఎస్సీ ఎస్టీ మైనారిటీలకు కలిపి 45 శాతం (58 సీట్లు) దక్కాయి. ఇందులో ఎస్సీలకు 27, బీసీలకు 24, ఎస్టీలకు నాలుగు, మైనారిటీలకు మూడు లభించాయి. రెడ్డి సామాజిక వర్గానికి 28, కమ్మ-28, కాపు-8, క్షత్రియ-5, వెలమ-1, వైశ్యులకు రెండు, దక్కాయి. ఇక, టీడీపీ ఎంపీ అభ్యర్థుల జాబితా శుక్రవారం విడుదలయ్యే అవకాశం ఉంది. ఏపీలోని 25 లోక్‌సభ సీట్లకు గాను పొత్తులో భాగంగా టీడీపీ 17 స్థానాల్లో పోటీచేయనుంది. బీజేపీకి ఇచ్చిన ఆరు, జనసేనకు ఇచ్చిన రెండు సీట్లలో మార్పుచేర్పులేవీ లేవని, కేటాయించుకున్న స్థానాల్లో ఆయా పార్టీలే బరిలోకి దిగుతాయని టీడీపీ వర్గాలు పేర్కొన్నాయి.

టీడీపీ రెండో జాబితా ఇదీ..

భగ్గు రమణమూర్తి (నరసన్నపేట); పల్లా శ్రీనివాసరావు(గాజువాక); కేఎస్ఎన్ఎస్ రాజు(చోడవరం); పైలా ప్రసాద్(మాడుగుల); వరుపుల సత్యప్రభ(ప్రత్తిపాడు); వాసంశెట్టి సుభాష్(రామచంద్రాపురం); గోరంట్ల బుచ్చయ్యచౌదరి(రాజమండ్రి రూరల్); మిర్యాల శిరీష(రంపచోడవరం)(ఎస్టీ); ముప్పిడి వెంకటేశ్వరరావు (కొవ్వూరు)(ఎస్సీ); చింతమనేని ప్రభాకర్(దెందులూరు); మద్దిపాటి వెంకటరాజు(గోపాలపురం(ఎస్సీ); భాష్యం ప్రవీణ్(పెదకూరపాడు); పిడుగురాళ్ల మాధవి(గుంటూరు వెస్ట్); మహమ్మద్ నజీర్(గుంటూరు ఈస్ట్); యరపతినేని శ్రీనివాసరావు(గురజాల); ఇంటూరి నాగేశ్వరరావు(కందుకూరు); కందుల నారాయణరెడ్డి(మార్కాపురం); అశోక్‌రెడ్డి(గిద్దలూరు); ఆనం రామనారాయణరెడ్డి(ఆత్మకూరు); వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి(కోవూరు); కురుగొండ్ల లక్ష్మీప్రియ(వెంకటగిరి); పుత్తా చైతన్యరెడ్డి(కమలాపురం); ఎన్.వరదరాజులురెడ్డి(ప్రొద్దుటూరు); గిత్తా జయసూర్య(నందికొట్కూరు(ఎస్సీ); జయనాగేశ్వరరెడ్డి(ఎమ్మిగనూరు); రాఘవేంద్రరెడ్డి(మంత్రాలయం); పల్లె సింధూరారెడ్డి(పుట్టపర్తి); కందికుంట యశోదాదేవి(కదిరి); షాజహాన్ బాషా(మదనపల్లె); చల్లా రామచంద్రారెడ్డి (బాబు)(పుంగనూరు); పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని)(చంద్రగిరి); బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి(శ్రీకాళహస్తి); కోనేటి ఆదిమూలం(సత్యవేడు)(ఎస్సీ); డాక్టర్ కలికిరి మురళీమోహన్)(పూతలపట్టు)(ఎస్సీ).

పిఠాపురం నుంచి నిలబడుతున్నా

- ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఉంది
- ఎంపీగా పోటీపై త్వరలోనే నిర్ణయం: పవన్



అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): "సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయమని కొందరు, ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్లాలని మరికొందరు కోరుతున్నారు. నాకు మాత్రం ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఉంది. దత్తాత్రేయుడి అవతారమైన శ్రీపాద శ్రీవల్లభుడు జన్మించిన పవిత్రమైన నేలగా పేరుగాంచిన పిఠాపురం నుంచి పోటీకి నిలబడుతున్నాను" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పవన్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారన్న ఉత్కంఠకు తెరదించారు. గురువారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన ఈ మేరకు ప్రకటించారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మంగళగిరి కేంద్ర కార్యాలయంలో జనసేన సోషల్ మీడియా ప్రతినిధులతో పవన్ సమావేశమయ్యారు. ఎంపీగా పోటీ చేయాలని చాలామంది సూచిస్తున్నారని, దానిపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. 2014లోనే పిఠాపురం నుంచి నిలబడాలని ప్రతిపాదన వచ్చిందని, అయితే అప్పట్లో బీజేపీ, టీడీపీ గెలుపు కోసం మద్దతు ఇవ్వడంతో పోటీ చేయలేదని తెలిపారు. 2024 ఎన్నికల్లో జనసేన పోటీచేసే 21 స్థానాల్లో వంద శాతం స్ట్రైక్ రేట్ ఉండేలా ప్రతి కార్యకర్త, నాయకుడు పని చేయాలని పవన్ పిలుపునిచ్చారు. టీడీపీ, బీజేపీతో కూడిన పొత్తును అందరూ ఆశీర్వదించి, కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

పీట దెబ్బకు కదిలిన పీఠం!

గుట్ట ఆలయ ఈవో బదిలీ, కొత్త ఈవో భాస్కర్‌రావు

యాదాద్రి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో పీట వివాదం.. ఈవో పీఠాన్నే కదిలించింది. ఇటీవలి ప్రొటోకాల్ వివాదాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం.. ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి(ఈవో) రామకృష్ణారావుపై వేటు వేసింది. ఆయన స్థానంలో కొత్త ఈవోగా అసిస్టెంట్ కలెక్టర్ భాస్కర్‌రావును నియమించింది. నృసింహుడి దర్శనానికి వచ్చే వీవీఐపీలు, వీఐపీలకు ఆశీర్వచన సమయంలో ఒకే ఎత్తులో ఉండే పీటలను వినియోగించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కొత్తగా మరో 10 పీటలను ఆలయ అధికారులు కొనుగోలు చేశారు. ఈ నెల 11న యాదగిరిగుట్ట ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం రేవంత్‌తోపాటు ఆయన సతీమణి గీతారెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఆశీర్వచనం అందించే సందర్భంలో సీఎంతో పాటు ఆయన సతీమణి గీతారెడ్డి, వారి పక్కనే మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పెద్దపీటలపై కూర్చోగా.. అదే వరుసలో ఇటు చివర భట్టి, అటు చివర కొండా సురేఖ చిన్న పీటలపై కూర్చున్నారు. దీంతో దళితుడైన డిప్యూటీ సీఎం భట్టిని, బీసీ మంత్రి కొండా సురేఖను అవమానించారంటూ పలు పార్టీలు విమర్శలు గుప్పించాయి. ఈ అంశంపై ఉప ముఖ్యమంత్రి స్పందించి.. వివరణ ఇచ్చినప్పటికీ వివాదం సద్దుమణగలేదు. ఈ నేపథ్యంలో ప్రొటోకాల్ వివాదంపై దృష్టి పెట్టిన ప్రభుత్వం.. దేవాదాయ శాఖ నుంచి నివేదిక తెప్పించుకుంది. ఈ మేరకు ఇక నుంచి స్వామివారి దర్శనానికి విచ్చేసే వీవీఐపీలు, వీఐపీల కోసం ఒకే ఎత్తులో ఉండే పీటలు వినియోగించాలని ఆదేశించింది. దీంతో యాదగిరిగుట్ట ఆలయ అధికారులు తాజాగా మరో 10 కొత్త పీటలను కొనుగోలు చేశారు. ఇదే సమయంలో ఆలయ ఇన్‌చార్జి ఈవోగా ఉన్న రామకృష్ణారావును సర్కారు బదిలీ చేసింది.

టెట్ ఉందోచ్!

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపడంతో టెట్ నిర్వహణకు మార్గం సుగమం అయింది. టెట్‌కు సంబంధించిన పూర్తి నోటిఫికేషన్‌ను ఈ నెల 20న విడుదల చేయనున్నారు. అయితే టెట్ నిర్వహణ, దరఖాస్తుల తేదీలు మాత్రం ప్రకటించారు. టెట్ కోసం ఈనెల 27 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మే నెల 20 నుంచి జూన్ 3వ తేదీ వరకు టెట్ నిర్వహిస్తారు. పరీక్షను పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో నిర్వహిస్తారు. ఫలితాలను జూన్ 20వ తేదీలోపు ప్రకటిస్తారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ఇది ఐదో టెట్! 2016, 2017, 2022, 2023లో టెట్ నిర్వహించారు. ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ పరీక్షలను జూలై 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. డీఎస్సీ దరఖాస్తు గడువును ఏప్రిల్ 3వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు పొడిగించారు. గత ప్రభుత్వం నిరుడు సెప్టెంబరులో విడుదల చేసిన డీఎస్సీకి 1.77 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తాజా డీఎస్సీ నోటిఫికేసన్ వెలువడ్డాక ఇప్పటి వరకు మరో 17 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా టెట్‌ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఈ దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

టీపీసీసీ అధికార ప్రతినిధి జి. హర్షవర్ధన్‌రెడ్డి హర్షం

నిరుద్యోగుల డిమాండ్ మేరకు టెట్ నిర్వహించాలని నిర్ణయించడం పట్ల టీపీసీసీ అధికార ప్రతినిధి జి.హర్షవర్ధన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం డీఎస్సీకి అర్హత పొందిన వారే కాకుండా అదనంగా 3.24లక్షల మంది టెట్ ద్వారా డీఎస్సీ పరీక్షకు అర్హత సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు, నిరుద్యోగుల అభీష్టం మేరకు రేవంత్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని చెబుతూ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్యాబినెట్ సబ్ కమిటీకి 2008 డీఎస్సీ అభ్యర్థుల అంశం

2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలను ఎలా కల్పించాలన్న అంశాన్ని ఖరారు చేసే బాధ్యతను క్యాబినెట్ సబ్ కమిటీకి అప్పగించారు. ఆ మేరకు గురువారం విద్యాశాఖ కార్యదర్శి వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలను ఇవ్వాలని రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఏపీలో కూడా 2008 అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చారు. అయితే అక్కడ గౌరవ వేతనంతో వారిని తీసుకున్నారు. ఏపీలో మాదిరిగానే ఇక్కడ కూడా గౌరవ వేతనం పరిధిలో వీరికి ఉద్యోగాలను ఇవ్వాలని భావిస్తున్నారు.

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుపై ఉత్తర్వులు జారీ

- కమ్మ సామాజిక వర్గానికీ రేవంత్ న్యాయం
- కమ్మ సంఘం నాయకులతో మంత్రి తుమ్మల, రేణుకా చౌదరి

హైదరాబాద్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుచేసింది. కమ్మ సామాజికవర్గంలో ఆర్థికంగా వెనుకబడిన వారికోసం ప్రత్యేకంగా ఈ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అంతకుముందు కమ్మ సామాజిక వర్గంలో ఆర్థికంగా వెనుకబడి వారి విద్య, ఉపాధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరిని కమ్మ సంఘాల ప్రతినిధులు, మేధావులు కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో తుమ్మల, రేణుకాచౌదరిని విడివిడిగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రేణుకాచౌదరి వారితో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ కమ్మలకు న్యాయం చేస్తారనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎంకు వినతి పత్రం అందజేస్తానని తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని కమ్మ సంఘాల నేతలకు తుమ్మల హామీ ఇచ్చారు. తుమ్మల నాగేశ్వరరావు, రేణుకాచౌదరిని కలిసిన వారిలో కమ్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగవరపు రామకృష్ణ ప్రసాద్, ఉపాధ్యక్షుడు బొడ్డు రవిశంకర్, కోశాధికారి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు. అయితే, వీరు మంత్రులను కలిసి విజ్ఞప్తి చేసిన కొన్ని గంటల్లో కమ్మ కార్పొ రేషను ఏర్పాటు చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

గొర్రెల పంపిణీ స్కీం అక్రమాల కేసులో.. పశు సంవర్ధక శాఖ జేడీ, ఏడీ అరెస్ట్

- 2.10 కోట్ల బిల్లు చెల్లింపులో గోల్‌మాల్
- ప్రైవేటు వ్యక్తులకు పెత్తనం అప్పగింత
- రైతులకు బదులు వారి ఖాతాల్లోకి నగదు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గొర్రెల కొనుగోళ్ల బిల్లు చెల్లింపులో అక్రమాల కేసులో ఏసీబీ అధికారులు గురువారం పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అంజిలప్ప, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.కృష్ణయ్యను అరెస్ట్ చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకంలో జేడీ అంజిలప్ప, ఏడీ కృష్ణయ్య ప్రైవేటు వ్యక్తులతో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడినట్టు ఏసీబీ ఆధారాలు సేకరించింది. రూ.2.10 కోట్ల బిల్లు చెల్లింపులో గోల్‌మాల్‌పై దర్యాప్తు జరుపుతున్న ఏసీబీ ఇప్పటికే నలుగురు ప్రభుత్వ ఉద్యోగులను అరెస్ట్ చేసింది. కస్టడీలో నిందితులు ఇచ్చిన సమాచారం, దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు జేడీ, ఏడీని అరెస్ట్ చేసింది. గొర్రెల కొనుగోళ్లలో జేడీ, ఏడీ ప్రైవేటు వ్యక్తులకు పెత్తనం అప్పగించి, వారు చెప్పినట్టు నడుచుకోవాలని కిందిస్థాయి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. దాంతో గొర్రెలు విక్రయించే రైతులను చూడకుండానే ప్రైవేటు వ్యక్తుల ఆదేశాల మేరకు కొనుగోళ్లు జరిపారు. సంబంధిత పత్రాలను ప్రభుత్వ అధికారులు పూర్తి చేయాల్సి ఉండగా వారి బదులు ఓ ప్రైవేటు సంస్థ ఉద్యోగులే ఆ పనులన్నీ చక్కబెట్టారు. గొర్రెలు విక్రయించిన రైతుల స్థానంలో ప్రైవేటు వ్యక్తుల పేర్లు, వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసినట్లు ఏసీబీ విచారణలో తేలింది. కలెక్టర్‌కు అందించిన నివేదికలోనూ తప్పుడు సమాచారమే ఇచ్చినట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. గొర్రెలు విక్రయించిన రైతులకు బదులు ప్రైవేటు వ్యక్తుల ఖాతాల్లో నగదు జమ అయినట్లు కనుగొన్నారు. అక్రమాల్లో జేడీ, ఏడీ పాత్రపై ఆధారాలు లభించడంతో గురువారం సాయంత్రం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితులు మొహిదుద్దీన్, ఆయన కుమారుడు సౌదీలో ఉన్నారు. వారిని రప్పించేందుకు ఏసీబీ అధికారులు చర్యలు చేపట్టారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 15 మార్చి 2024

టీఎస్ పీజీ ఈసెట్ నోటిఫికేషన్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ)- స్టేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ పీజీ ఈసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయుహెచ్) నిర్వహిస్తోంది. దీని ద్వారా ఎంఈ/ఎంటెక్/ఎంఫార్మసీ/ఎంఆర్క్/గ్రాడ్యుయేట్ లెవెల్ ఫార్మా-డీ(పీబీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ ఇంజనీరింగ్/ఫార్మసీ/ఆర్కిటెక్చర్ కళాశాలల్లో ముందుగా గేట్/జీప్యాట్ స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ నిర్వహిస్తారు. తరవాత మిగిలిన సీట్లను పీజీఈసెట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పార్ట్ టైం, స్పాన్సర్డ్ పీజీ ప్రోగ్రామ్‌లు ఈ టెస్ట్ పరిధిలోకి రావు.

విభాగాలు: ఏరోస్పేస్ ఇంజనీరింగ్, బయోమెడికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, నానో టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, బయో టెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, జియో ఇంజనీరింగ్ అండ్ జియో ఇన్ఫర్మాటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఫార్మసీ.

అర్హత: ఇంజనీరింగ్/ఫార్మసీ విభాగాల్లో ద్వితీయ శ్రేణి మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు.

పరీక్ష వివరాలు: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో అభ్యర్థి ఎంచుకొన్న విభాగం నుంచి మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఇస్తారు. విభాగానికి సంబంధించిన సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 25 శాతం మార్కులు(30 మార్కులు) రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఇది వర్తించదు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** మార్చి 16 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 10
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 14 నుంచి 16 వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 28 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్
- **పీజీఈసెట్ 2024 తేదీలు:** జూన్ 6 నుంచి జూన్ 9 వరకు
- **వెబ్‌సైట్:** https://pgecet.tsche.ac.in

ఏపీ బీసీ గురుకులాల్లో అయిదోతరగతి ప్రవేశాలు

విజయవాడ-కానూరులోని మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 106 గురుకుల పాఠశాలల్లో అయిదోతరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యార్థులను ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు. విద్యార్థుల స్థానికత ఆధారంగా సంబంధిత జిల్లాకు చెందిన గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. బాలురు, బాలికలకు విడివిడిగా పాఠశాలలు ఉన్నాయి. ప్రత్యేక కేటగిరీ కింద అనాథ పిల్లలకు, మత్స్యకారుల పిల్లలకు ప్రవేశాలు కల్పిస్తారు.



గురుకులాల ప్రత్యేకతలు: స్టేట్ సిలబస్ ప్రకారం డిజిటల్ తరగతులతో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు. నాలుగు జతల యూనిఫాం, టై, బెల్ట్, బూట్లు, సాక్స్, రెండు దుప్పట్లు ఇస్తారు. పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, ప్లేట్, గ్లాస్, సమీకృత పౌష్టికాహారం(వేరుశనగ చిక్కీ, గుడ్డు, చికెన్) అందిస్తారు. క్రీడలలో శిక్షణ ఇస్తారు. ఇక్కడ గ్రంథాలయాలు, ప్రయోగశాలలు ఉంటాయి. అయిదోతరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఇంటర్ వరకూ ఇక్కడే చదువుకొనే అవకాశం ఉంది.

- కాస్మోటిక్ ఖర్చుల కింద అయిదు, ఆరు తరగతులు చదివే బాలురకు నెలకు రూ.125; ఏడు నుంచి ఇంటర్ వరకు చదివేవారికి నెలకు రూ.150లు ఇస్తారు. సెలూన్ ఖర్చుల నిమిత్తం నెలకు రూ.50 ఇస్తారు. అయిదు నుంచి ఏడోతరగతి వరకు చదివే బాలికలకు నెలకు రూ.130; ఎనిమిది నుంచి ఆపై చదివే బాలికలకు నెలకు రూ.250లు చెల్లిస్తారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో మూడోతరగతి, 2023-24 సంవత్సరంలో నాలుగోతరగతి చదివి ఉండాలి. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు 2013 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.1,00,000లు మించకూడదు.

ప్రవేశ పరీక్ష వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. తెలుగు నుంచి 10, ఇంగ్లీష్ నుంచి 10, లెక్కల నుంచి 15, పరిసరాల విజ్ఞానం నుంచి 15 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ నాలుగోతరగతి స్థాయిలోనే ఉంటాయి. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్న పత్రాన్ని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. మొత్తం మార్కులు 50. విద్యార్థులు సొంత జిల్లాలోనే పరీక్ష రాయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **ప్రవేశ పరీక్ష తేదీ:** ఏప్రిల్ 27
- **వెబ్‌సైట్:** mjpapbcwreis.apcfss.in

జేఎన్‌సీఏఎస్‌ఆర్‌లో పీజీ, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు



బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ (జేఎన్‌సీఏఎస్‌ఆర్)- పీజీ, రీసెర్చ్, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ/ఇంటర్‌డిసిప్లినరీ బయోసైన్సెస్) ప్రోగ్రామ్‌లకు మినహా అన్నింటికీ ఫెలోషిప్ సౌకర్యం ఉంది. జేఎన్‌సీఏఎస్‌ఆర్/సీఎస్ఐఆర్/యూజీసీ/ఐసీఎంఆర్/డీబీటీ/ఇన్‌స్పయిర్ ఫెలోషిప్‌లు వర్తిస్తాయి.

రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు(పీహెచ్‌డీ/ఎంఎస్ ఇంజనీరింగ్/ఎంఎస్ రీసెర్చ్)

ఏడు స్పెషలైజేషన్ యూనిట్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి స్పెషలైజేషన్ యూనిట్‌కూ నిర్దేశించిన అర్హత వివరాలను వివరంగా వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

కెమిస్ట్రీ అండ్ ఫిజిక్స్ ఆఫ్ మెటీరియల్స్: ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/కెమికల్/మేథమెటికల్/ఫిజికల్/మెటీరియల్స్ సైన్స్)/(బీఈ/బీటెక్/బీఎస్/ఎంఈ/ఎంటెక్) (ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/మెటలర్జీ/ పాలిమర్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/నానో టెక్నాలజీ, కెమికల్) ఉత్తీర్ణులై ఉండాలి.

ఇంజనీరింగ్ మెకానిక్స్: ఎమ్మెస్సీ(మేథమెటికల్/ఫిజికల్ సైన్సెస్)/(బీఈ/బీటెక్/బీఎస్/ ఎంఈ/ఎంటెక్) (ఏరోస్పేస్/మెకానికల్/మెటలర్జీ/ పాలిమర్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/కెమికల్/అట్మాస్ఫెరిక్ సైన్స్) పూర్తిచేసి ఉండాలి.

ఎవల్యూషనరీ అండ్ ఇంటిగ్రేటివ్ బయాలజీ: ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్/బయలాజికల్ సైన్సెస్/మేథమెటిక్స్/ ఫిజిక్స్)/(బీఈ/బీటెక్/బీఎస్/ఎంఈ/ఎంటెక్)(బయోటెక్నాలజీ/బయలాజికల్ ఇంజనీరింగ్)/ఎంబీబీఎస్/ఎండీ/బీవీఎస్సీ/ఎంవీఎస్సీ పూర్తిచేసినవారు అర్హులు.

మాలిక్యులర్ బయాలజీ అండ్ జెనెటిక్స్: ఎమ్మెస్సీ (బయోఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ/కెమికల్/బయలాజికల్/లైఫ్ సైన్సెస్)/(బీఈ/బీటెక్/బీఎస్/ఎంఈ/ఎంటెక్)(బయోటెక్నాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్)/ఎంబీబీఎస్/ఎండీఉత్తీర్ణులై ఉండాలి.

న్యూ కెమిస్ట్రీ: ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ/ఫిజిక్స్)/బీఈ/బీటెక్/బీఎస్ పూర్తిచేసి ఉండాలి.

న్యూరోసైన్స్: ఎమ్మెస్సీ(న్యూరోసైన్స్/బయోఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ/బయలాజికల్ సైన్సెస్/లైఫ్ సైన్సెస్/ఫార్మసీ)/(బీఈ/బీటెక్/బీఎస్/ఎంఈ/ఎంటెక్)(బయోటెక్నాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్)/ఎంబీబీఎస్/ ఎండీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

థియరిటికల్ సైన్సెస్: ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/కెమికల్/మేథమెటికల్/ఫిజికల్/మెటీరియల్స్ సైన్స్)/(బీఈ/బీటెక్/బీఎస్/ ఎంఈ/ ఎంటెక్)(ఏరోస్పేస్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/మెటలర్జీ/కెమికల్/మెకానికల్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.

- అన్ని స్పెషలైజేషన్‌లకూ గేట్/జెస్ట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. లేదా సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/ఐసీఎంఆర్/ఇన్‌స్పయిర్ సంస్థల నుంచి జేఆర్ఎఫ్ అర్హత పొంది ఉండాలి.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

ఫెలోషిప్: పీహెచ్‌డీ అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాత మూడేళ్లు నెలకు రూ.42,000ల ఫెలోషిప్ ఇస్తారు. ఎంఎస్ అభ్యర్థులకు నెలకు రూ.37,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు. ట్రావెల్ గ్రాంట్ కింద పీహెచ్‌డీ అభ్యర్థులకు రూ.1,00,000; ఎంఎస్ అభ్యర్థులకు రూ.40,000 చెల్లిస్తారు.

ఎమ్మెస్సీ ఇన్ కెమిస్ట్రీ

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్ట్‌గా కనీసం 55 శాతం మార్కులతో బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. జామ్ 2024 స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: జామ్ 2024 స్కోర్/సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ఎమ్మెస్సీ ఇన్ ఇంటర్ డిసిప్లినరీ బయోసైన్సెస్

స్పెషలైజేషన్‌లు: ఎపిజెనెటిక్స్-డిసీజెస్, న్యూరోసైన్సెస్, హ్యూమన్ డిసీజ్ జెనెటిక్స్, కెమికల్ బయాలజీ-డిసీజ్ బయాలజీ-డ్రగ్ డిస్కవరీ

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కెమిస్ట్రీ ఒక సబ్జెక్ట్‌గా కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ(బయలాజికల్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి. జామ్ 2024 స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: జామ్ 2024 స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ

ఈ ప్రోగ్రామ్‌లో ఫిజికల్ సైన్స్- మెటీరియల్స్, కెమికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ అనే మూడు స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఫిజికల్ సైన్స్‌లో ప్రవేశానికి సైన్స్/ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అడ్వాన్స్‌డ్ ఫిజిక్స్, మెటీరియల్స్ రీసెర్చ్ అంశాల్లో పరిజ్ఞానం ఉండాలి. కెమికల్ సైన్స్‌లో ప్రవేశానికి కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టుగా చదివి ఉండాలి. బయలాజికల్ సైన్స్‌లో ప్రవేశానికి డిగ్రీ (ఫిజికల్ సైన్స్/కెమికల్ సైన్స్/బయలాజికల్ సైన్స్/బయోటెక్నాలజీ/ఫార్మాస్యూటికల్స్/వెటర్నరీ సైన్సెస్/అగ్రికల్చరల్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి. జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ (జామ్) 2024 స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: ఫిజికల్ సైన్స్, కెమికల్ సైన్స్ విభాగాలకు అకడమిక్ ప్రతిభ, జామ్ 2024 స్కోర్ ద్వారా, బయలాజికల్ విభాగానికి ఆన్‌లైన్ ఎగ్జామ్ ద్వారా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు.

ఫెలోషిప్: మొదటి రెండేళ్లు నెలకు రూ.19,000; తరవాతి రెండేళ్లు నెలకు రూ.37,000; చివరి మూడేళ్లు నెలకు రూ.42,000ల ఫెలోషిప్ ఇస్తారు. ట్రావెల్ గ్రాంట్ కింద రూ.1,00,000 చెల్లిస్తారు.

పీజీ డిప్లొమా ఇన్ మెటీరియల్ సైన్స్

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఏ స్పెషలైజేషన్‌తోనైనా ఎమ్మెస్సీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎంపిక: అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **వెబ్‌సైట్:** www.jncasr.ac.in

ఎన్‌హెచ్‌పీసీలో ట్రెయినీ ఇంజనీర్లు

ఫరీదాబాద్(హరియాణా)లోని నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్.. కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 280

పోస్టుల వివరాలు

1. ట్రెయినీ ఇంజనీర్(సివిల్): **95 పోస్టులు**
2. ట్రెయినీ ఇంజనీర్(ఎలక్ట్రికల్): **75 పోస్టులు**
3. ట్రెయినీ ఇంజనీర్(మెకానికల్): **77 పోస్టులు**
4. ట్రెయినీ ఇంజనీర్(ఈఅండ్‌సీ): **4 పోస్టులు**
5. ట్రెయినీ ఇంజనీర్ అండ్ ట్రెయినీ ఆఫీసర్(ఐటీ): **20 పోస్టులు**
6. ట్రెయినీ ఆఫీసర్(జియాలజీ): **3 పోస్టులు**
7. ట్రెయినీ ఇంజనీర్ అండ్ ట్రెయినీ ఆఫీసర్(ఎన్విరాన్‌మెంట్): **6 పోస్టులు**

విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఈఅండ్‌సీ, ఐటీ, జియాలజీ, ఎన్విరాన్‌మెంట్

అర్హత: సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ ఎంసీఏ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ గేట్-2023 స్కోర్ సాధించి ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. **జీతం:** నెలకు రూ.50,000 - రూ.1,60,000

ఎంపిక ప్రక్రియ: గేట్ 2023 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.708. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/మాజీ సైనికులు/మహిళలకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంది.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 26

వెబ్‌సైట్: https://www.nhpcindia.com/

డీఆర్‌డీవోలో జేఆర్‌ఎఫ్

న్యూఢిల్లీలోని డీఆర్‌డీవో- సైంటిఫిక్ అనాలసిస్ గ్రూప్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

మొత్తం ఖాళీలు: 19

పోస్టు: జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్‌ఎఫ్)

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు నెట్/గేట్ స్కోరు సాధించి ఉండాలి.

వేతనం: నెలకు రూ.37,000


వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు

దరఖాస్తులు పంపాల్సిన ఈమెయిల్: saghr.sag@gov.in

ఇంటర్వ్యూ తేదీ: మార్చి 18

ప్రదేశం: మెయిన్ గేట్, రిసెప్షన్, మెట్కాఫ్ హౌస్, డీఆర్‌డీవో-ఎస్ఏజీ, ఢిల్లీ.

వెబ్‌సైట్: https://www.drdo.gov.in/



బామర్‌లో డిప్యూటీ మేనేజర్లు

కోల్‌కతాలోని బామర్ లారీ అండ్ కో లిమిటెడ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- డిప్యూటీ మేనేజర్(సేల్స్ అండ్ మార్కెటింగ్): 2 పోస్టులు

అర్హత: ఫుల్ టైం ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ లేదా రెండేళ్ల ఎంబీఏ లేదా మేనేజ్‌మెంట్‌లో పీజీ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణత.

వయోపరిమితి: 32 సంవత్సరాలు మించరాదు

వేతనం: నెలకు రూ.50,000 - రూ.1,60,000

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 29

వెబ్‌సైట్: https://www.balmerlawrie.com/

లిటిల్స్



ఆశపోతు

ఒక ఊరిలో రంగయ్య అనే వ్యక్తి ఉండేవాడు. అతనికి కోళ్లు, బాతులు, ఆవులు.. ఇలా మూగ జీవుల పెంపకం అంటే ఇష్టం. అతని దగ్గర కుక్కలతో పాటు పిల్లులూ ఉండేవి. జాగ్రత్తగా వాటికి గూళ్లు కట్టి కాపాడుకునేవాడు. ఈ పశుపక్ష్యాదులను పోషించటం వల్ల అతడు అదనంగా గుడ్లు, మాంసంతో డబ్బులు గడించేవాడు.


ఒక రోజు అతడు సంతకు వెళ్లాడు. ఓ తెల్లబాతు చూసి మురిసిపోయాడు. దాని వెల ఎంతయినా కొంటా అన్నాడు. కొన్న తర్వాత ఆ వ్యాపారి ఇలా అన్నాడు. 'ఈ బాతు బంగారు గుడ్లను పెడుతుంది' అన్నాడు. అవునా.. అదృష్టమే నాది అంటూ పొంగిపోయాడు. ఇంటికి తీసుకెళ్లాడు. ఆ బాతును ప్రత్యేకమైన గూటిలో ఉంచాడు.




కొన్ని నెలల తర్వాత ఆ బాతు గుడ్లకు వచ్చింది. ప్రతి రోజూ బంగారు రంగులో గుడ్డు పెట్టింది. ఆ గుడ్డును చూసి సంతోషించాడు. ఊరిలోని జనాలంతా వచ్చి ఆ గుడ్లను చూసి పొగిడారు. అసలు రంగయ్యకు రాని విద్యనే లేదు. ఈ బంగారు గుడ్లను అమ్మితే ధనవంతుడు అవుతాడని చెప్పారు. రంగయ్యకు మనసాగలేదు. ప్రతిరోజూ ఓ బంగారు రంగు గుడ్డు పెడుతోంటే.. ఆ గుడ్డును చూసి మురిసిపోయేవాడు. ఒక రోజు తన భార్యను తీసుకొచ్చి చూపించాడు. ఆమె కూడా సంతోషపడింది. డబ్బుకు కొదువే లేదు.. ఇలాంటి గుడ్లను అధిక ధరకు కొంటారని విన్నాను అన్నది. ఇద్దరూ మాదే అదృష్టం అనుకున్నారు.

ఒక రోజు ఆ బంగారు గుడ్లను చూశాక రంగయ్యకు ఓ బుద్ధి పుట్టింది. రోజూ ఒకటి ఎందుకూ.. ఒకేసారి అన్ని గుడ్లను తీసుకుంటే సరిపోతుంది అనుకున్నాడు. దురాశ, అత్యాశ వల్ల ఏమీ ఆలోచించలేదు. కళ్లు కనపడని ఆశ. దీంతో ఆ బాతును పొట్టకోసి చంపాడు. లోపల గుడ్లు లేవు. తన దురాశను చూసి అందరూ తిట్టారు. బంగారు బాతును చంపావని ఇంటిలోని వాళ్లూ తిట్టిపోశారు. ఆశపోతు రంగయ్యగా ఆ ఊరిజనాలంతా పిలిచారు. తన మూర్ఖత్వానికి అతనికి అతనే తిట్టుకున్నాడు. దుఃఖించినా ఉపయోగం లేకపోయింది.

జంతువులు ఎన్ని?



6 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 255

1	8	4	3	6		9		2
	5		1				8	
2					8	7		
	9				4	6		
		7	8		9	1		
		1	6				4	
		2	4					5
	1				5		3	
3		5		8	1	2	9	6

సుడోకు - 254 సమాధానం

9	3	6	2	4	7	1	5	8
5	7	8	1	6	9	3	4	2
1	4	2	8	5	3	7	6	9
3	6	9	7	2	1	4	8	5
7	1	5	9	8	4	2	3	6
2	8	4	6	3	5	9	7	1
6	2	7	3	9	8	5	1	4
4	9	3	5	1	6	8	2	7
8	5	1	4	7	2	6	9	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.